

జ్ఞాన సిద్ధాంతం
రూ.200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 241 | సోమవారం | 23-02-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00


### కోర్టులో హాజరుపర్చాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్‌తో సహా పలువురు మావోయిస్టు నాయకులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేసినట్టు, లొంగిపోవాలని వత్తిడి తెస్తున్నారని తెలుస్తోందని, పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టు పార్టీ నాయకులందరినీ వెంట నే కోర్టులో హాజరు పరచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## మావోయిస్టు జాతీయ కార్యదర్శి దేవ్ జీ లొంగుబాటు


దేవ్‌జీ


### కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి కూడా సరెండర్

### మరో 16 మంది జనజీవన స్రవంతిలోకి

- దేవ్ జీ, రాజిరెడ్డిపై చెరి రూ.25లక్షల చొప్పున రివార్డు
- లొంగుబాటును ధృవీకరించిన ఛతీస్‌గఢ్ డిప్యూటీ సిఎం విజయ్ శర్మ

ప్రజాపక్షం /హైదరాబాద్

నిషేధిత మావోయిస్టు సంస్థ సిపిఐ (మావోయి స్టు) పార్టీ అత్రగనేత, జాతీయ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ(58), కేంద్ర కమిటి సభ్యుడు మల్లా రాజిరెడ్డి (71) తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిద్దరితో పాటు మొత్తం 16 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఛతీస్‌గఢ్ డిప్యూటీ సిఎం విజయ్‌శర్మ ధృవీకరించారు. ఈ లొంగుబాటు హైదరాబాద్‌లోని తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) కార్యాలయంలో జరిగినట్లు తెలిసింది. గత కొద్ది నెలలుగా దేవ్‌జీ, రాజిరెడ్డిని లక్ష్యంగా చేసుకుని భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. దేవ్‌జీ, రాజిరెడ్డిలపై చెరో రూ. 25 లక్షల రివార్డు ఉంది.త్వరలో వీరందరిని మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా వీరిద్దరు మావోయిస్టు పార్టీలో గెరిల్లా దళాల నిర్వహణ,క్యాడర్ నియామకం, శిక్షణ, భద్రతా దళాలపై దాడుల వ్యూహరచన,ఆయుధ సరఫరా సమన్వయం చూసుకునేవారని తెలిసింది. దేవ్‌జీపై పోలీసు వర్గాల సమాచారం ప్రకారం రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి.భద్రతా దళాలపై దాడులకు కుట్ర,పేలుడు ఘటనల


రాజిరెడ్డి

తరువాయి 2లో

## రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి

సిఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదు. టిడిపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయం. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులు వృథాగా వదిలేసేది లేదు. 'గోదావరి నదీ జలాలలకు సంబంధించిన ప్రాజెక్టులను మనం ఈ పదేళ్లలో పూర్తి చేసుకుని 967 టిఎంసిలను వినియోగం లోకి తెచ్చుకుని ఉంటే ఈనాడు వరద జలాల విషయంలో కూడా వాటాలు అడిగే పరిస్థితి ఉండేది.
– సిఎం

- గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుంది
- గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరానికే రూ.1.10లక్షల కోట్ల ఖర్చు
- నేడు మిగతా ప్రాజెక్టులు, భూసేకరణకు నిధుల కొరత



- రూ. 6 వేల కోట్ల అంచనాలతో దేవాదుల మొదలు పెడితే... నేడు రూ. 18 వేల కోట్ల నిధులు అవసరమైన స్థితి
- ప్రాజెక్టు కోసం జూన్ 2 లోపు రూ.600 కోట్లు మంజూరు చేస్తాం
- ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం.. ప్రజలు, నీళ్ల విషయంలో కాదు
- పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బిఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరం
- ఎపితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ములుగు జిల్లా తుపాకుల గూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టు పరిశీలన

ప్రజాపక్షం/ములుగు

గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయ రంగు పులుముకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలిం ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్‌పై ఆయన పలు విమర్శలు గుప్పించారు. వచ్చే రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల మిగతా వాటికి, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉందని తెలిపారు. రూ.6వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన దేవాదుల ప్రాజెక్టు నేడు రూ.18 వేలకోట్ల నిధులు అవసరమైన స్థితికి చేరుకుందన్నారు. దేవాదుల ప్రాజెక్టు భూసేకరణ కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు మంజూరు చేస్తామని సిఎం ప్రకటించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంచనాలను బడ్జెట్‌లో ప్రభుత్వం ముందుంచి ఆమోదం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్చి నెలలో మంత్రి వర్గం సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ అంచనాలకు ఆమోదం తెలపాలని నిర్ణయించామన్నారు. దేవాదుల పంపులకు నెలరోజుల్లోపు మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో కమిటీ హాల్‌లో దేవాదుల ప్రాజెక్టుపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భూ యజమానులకు పరిహారం చెల్లింపులు గ్రీన్ ఛానల్ ద్వారా వేగవంతంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణలో

తరువాయి 2లో

## ఉగ్రకుట్ర భగ్నం

- తమిళనాడు, బెంగాల్‌లో కలిపి ఎనిమిది మంది అరెస్ట్
- 8 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులు స్వాధీనం
- పాక్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ, బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో భారీ ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్న ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎనిమిది మంది పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కోసం వారిని ఢిల్లీకి తరలిస్తున్నారు. ఇటీవల ఢిల్లీ మెట్రో సహా దేశ రాజధానిలో పలు ప్రాంతాల్లో ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు అంతికించారు. ఆ పోస్టర్లలో కశ్మీర్‌కు సంబంధించిన ఉద్రిక్త

తరువాయి 2లో



## అడుక్కుంటే కాదు పోరాడితేనే హక్కులు

- ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో అడ్డదారుల్లో యువత పయనం
- సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్టు 'అడుక్కుంటే కాదు, పోరాడితేనే హక్కులు సాధించవచ్చు' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం ఎన్.సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర సదస్సులో సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కూనంనేని సాంబశివరావు, ముఖ్య సలహాదారులుగా ఎస్. బాల్‌రాజ్, రాష్ట్ర అధ్యక్షులుగా పాద్య నాగేశ్వరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడారి సునీల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్, రాష్ట్ర కోశాధికారి రామ్ కుమార్, రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ పోలె రమేష్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిఆర్‌పి యూనియన్ తెలంగాణ(సియుటి) ఇకపై ఎఐటియుసి అనుంధ సంస్థగా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సిఆర్‌పిలు యూనియన్‌గా ఏర్పడి, హక్కుల సాధనకై ఎఐటియుసి నాయకత్వాన్ని ఎంచుకోవడం శుభపరిణామమన్నారు. తాను ఒక ఉపాధ్యాయుడినని, వారు పడే సాధకబాధకలు తెలుసుననీ చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేక అడ్డమైన

తరువాయి 2లో

## 9 రాష్ట్రాలు, యుటిల్లో 1.70 కోట్ల ఓట్లు తొలగింపు

- గుజరాత్, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, గోవా, కేరళలో తుది జాబితా ప్రకటించిన ఇసి




న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను పలు రాష్ట్రల్లో కొనసాగిస్తుంది. అందులో భాగంగా తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 1.70 కోట్లకు పైగా ఓటర్లను తొలగించింది. గత సంవత్సరం అక్టోబర్ 27న సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు గుజరాత్, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, గోవా, కేరళ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు శనివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ రాష్ట్రాల్లో

తరువాయి 2లో

## మెడికో ఆత్మహత్య

- ప్రేమ పేరుతో వేధించటంతో బలవన్మరణం
- సిద్దిపేట సురభి మెడికల్ కళాశాలలో ఘటన
- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసుమోదు

ప్రజాపక్షం/ సిద్దిపేట



మెడికో విద్యార్థి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట సురభి వైద్య కళాశాల్లో ఆదివారం వెలుగు చూసింది. సిద్దిపేట త్రీ టౌన్ సిఐ లక్ష్మి బాబు, విద్యార్థులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మెడిపల్లి గ్రామానికి చెందిన ఈద శ్రీజ (20) తల్లిదండ్రులు మృతి చెందటంతో మేనమామ నంటబాపు గత 20 ఏండ్లుగా పెంచి పోషిస్తూ చదివిస్తున్నా రు.. 2024 ఎంసెట్ ఎంట్రన్స్ ద్వారా మిట్టపల్లి సురభి కళాశాలలో బిపిటి మొదటి సంవత్సరం పూర్తిచేసుకుంది. రోజు మాదిరిగానే విద్యార్థులతో కలసి ఉదయం లేచి టిఫిన్‌కు వెళ్లాల్సిన సమయంలో శ్రీజ తాను వస్తాను.. మీరు వెళ్లండని అంటూ తన తోటి

తరువాయి 2లో

### జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు ఉగ్రవాదులు హతం

### ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం

05

గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్లు




## ఇస్కఫ్ జాతీయ అధ్యక్షుడిగా అజీజ్ పాషా

### కోశాధికారిగా కడారు ప్రభాకర్ రావు ఎన్నిక

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ అధ్యక్షులుగా మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కోశాధికారిగా హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్ రావు ఎన్నికయ్యారు. ఈనెల 19,20వ తేదీల్లో చెన్నైలో జరిగిన

తరువాయి 2లో

## నాలుగేళ్లుగా యుద్ధం



- రష్యా–ఉక్రేన్‌లో 4.65 లక్షలమంది మృతి
- నష్టపోయిన 20 లక్షల సైనిక కుటుంబాలు
- సెంటర్ ఫర్ స్ట్రేటజిక్ ఇంటర్నేషనల్ స్టడీస్ అంచనా
- యుద్ధానికి రేపటితో నాలుగేళ్ళుపూర్తి

కీవ్: హంగరీ, స్లోవేకియా దేశాల తాజా హెచ్చరికలమధ్య,ఉక్రేన్‌లో రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించి ఫిబ్రవరి 24వ తేదీ నాటికి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఈ యుద్ధంలో ఇరువైపులా 4.65 లక్షలమంది మరణించారని, మొత్తంగా 20 లక్షల సైనిక కుటుంబాలు నష్టపోయాయని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ స్ట్రేటజిక్–ఇంటర్నేషనల్ స్టడీస్ (సిఎస్ఐఎస్) అంచనావేసింది. రెండు దేశాలమధ్యా 1200 కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ ప్రజల్లో ప్రచారం చేస్తూ అధికారంలోకి వస్తే ఒక్కరోజులోనే ఉక్రేన్–రష్యా యుద్ధం ఆపేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ ఆయన ప్రయత్నాలు ఏడాది గడచినాగానీ సఫలంకాలేదు. కాగా, డ్రుజ్బా పైపులైను ద్వారా స్లోవేకియాకు చమురు సరఫరా విధానాన్ని సోమవారంనాటికి పునరుద్ధరించకపోతే ఉక్రేన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని

తరువాయి 12లో

## ఈ వెతలు తీరేదెన్నడో?



- 22 మాసాలుగా అందని పింఛన్ బకాయిలు
- మనోవేదనలో పింఛన్‌దారులు
- ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ఆరుగురు మృతి

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రభుత్వ ఉద్యోగులకు అతి పెద్ద భరోసా పింఛన్. ఆర్థిక భరోసా పింఛన్ బకాయిల చెల్లింపు. సర్వీసులో ఉన్నప్పుడు కుటుంబ ఖర్చులు, ఇతరత్రా అవసరాలతో డబ్బు దాచుకున్నా, దాచుకోకపోయినా ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ తో పాటు ప్రభుత్వం చెల్లించే పింఛన్ బకాయిలు ఆసరాగా ఉంటాయన్న భావన ప్రతి ప్రభుత్వ ఉద్యోగిలోనూ ఉంటుంది. ఇప్పుడు పింఛన్‌దారుల ఆలోచనకు ప్రభుత్వం గండి కొట్టింది. 22 మాసాలుగా పింఛన్ బకాయిలు చెల్లించకపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర మనో వ్యధకు గురవుతున్నారు. ఇప్పటికే ఒక ఖమ్మం జిల్లాలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. తమ ఉద్యోగ కాలంలో దాచుకున్న మొత్తాన్ని ఇవ్వడంలో ప్రస్తుత ప్రభుత్వం వైఫల్యం చెందింది. సాధారణంగా ఉద్యోగి ఉద్యోగ విరమణ చేసిన రెండు నెలల లోపు మొత్తం బకాయిలను ప్రభుత్వం చెల్లించేది. 2024 ఏప్రిల్ మాసం నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిల చెల్లింపులు జరగడం లేదు. రాష్ట్ర

తరువాయి 12లో

## ఇజ్రాయెల్‌కు ఎలాంటి హక్కులూ లేవు

### హక్కబీ వ్యాఖ్యలకు అరబ్ దేశాల ఖండన



**టెల్‌అవీవ్:** పవిత్రగ్రంథం బైబిల్‌లో చెప్పిన ప్రకారం ఇజ్రాయెల్ దేశం పశ్చిమ ఆసియాలో ఉన్న విస్తారమైన ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకోవడం తప్పుకాదని ఇజ్రాయెల్‌లో అమెరికా దౌత్యవేత్త హక్కబీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను 14 అరబ్, ముస్లిం దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఆక్రమిత పాలస్తినా భూభాగాలపైన, ఇతర అరబ్ రాజ్యాల భూభాగాలపైన ఇజ్రాయెల్‌కు ఎలాంటి హక్కులూ లేవని స్పష్టం చేశాయి. అమెరికాకు చెందిన మితవాద కామెంటేటర్ టక్కర్ కార్ల్‌సన్‌కు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో హక్కబీ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతాన్ని ఆక్రమించడానికి ఇజ్రాయెల్‌కు ఏమైనా హక్కులున్నాయా? అని కామెంటేటర్ ప్రశ్నించినప్పుడు, ఔను, ఉన్నాయి, బైబిల్‌లో చెప్పిన భవిష్య పురాణం ప్రకారం యావత్ పశ్చిమ ఆసియాలో ప్రాంతాలను ఆక్రమించడానికి ఇజ్రాయెల్‌కు హక్కులున్నాయని హక్కబీ సమర్థించారు. మొత్తం అంతా (భూమి) తీసుకుంటే బాగుంటుంది, కానీ ఇజ్రాయెల్ ఆ ప్రయత్నం చేయడంలేదు, ఇప్పుడు ఆక్రమించిన భూమిని కాపాడాలని ప్రజలను ఇజ్రాయెల్ కోరుతోంది'' అన్నారు. జోర్డాన్,ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా డజనుకుపైగా దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో హక్కబీ వ్యాఖ్యలను ఖండించాయి. ఆయన వ్యాఖ్యలు అంత్యత ప్రమాదకరమైనవని, యుద్ధం ముగించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద ప్రమాదకరంగా మారతాయని పేర్కొన్నాయి. ఆయన వ్యాఖ్యలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, గాజాలో ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికకు భిన్నంగా ఉన్నాయని విమర్శించాయి.

## ఆఫ్ఘాన్ ఉగ్రవాదస్థావరాలపై పాక్ దాడులు

# 70 మంది మృతి



**కాబూల్:** సరిహద్దుల్లో ఉన్న అఫ్గానిస్థాన్ గ్రామంపై పాకిస్థాన్ సైనిక దళాలు గగనతల దాడులు చేశాయి. ఈ దాడుల్లో 70 మంది మరణించారు. దీంతో ఆఫ్గానిస్థాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నాన్‌గర్హర్, పక్తికా ప్రాంతాలలో ఉన్న ఇళ్ళు, నివాసిత ప్రాంతాలు, ప్రార్థనాలయాలు లక్ష్యంగా చేసిన ఈ దాడులకు తగిన ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. ప్రాదేశిక సమగ్రతను, అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారాన్ని పాకిస్థాన్ ఉల్లంఘించి రెండు దేశాలమధ్యా ఉద్రిక్తలను రెచ్చగొడుతోందని పేర్కొంది. పాకిస్థాన్ దౌత్యవేత్తను తమ వద్దకు రప్పించి తీవ్ర నిరసన తెలియజేసింది. ఈ దాడుల్లో అనేకమంది మహిళలు, పిల్లలు మరణించారని అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఐతే పాకిస్థాన్ ఒక ప్రకటన చేస్తూ సరిహద్దుల్లో ఏడు ఉగ్రవాద రహస్య స్థావరాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. శనివారం ఖైబర్ పఖ్తుంక్వా రాష్ట్రంలోని బన్ను ప్రాంతంలో ఆత్మాహుతిదాడిలో ఒక సైనికుడు మరణించినట్లు పాకిస్థాన్ పేర్కొంది. గత ఏడాది అక్టోబరులో రెండు దేశాలమధ్యా సరిహద్దుల్లో స్వల్పయుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో 23మంది పాకిస్థాన్ సైనికులు మరణించారు. 200 మంది అఫ్గానిస్థాన్ తాలిబన్ సైనికులు మరణించారు. ఉగ్రవాదాన్ని అదుపు చేయడంలో అఫ్గానిస్థాన్ ప్రభుత్వం విఫలంకావడంతో రెండు దేశాలమధ్యా సంబంధాలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి.

ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం తెల్లవారకముందే పాకిస్థాన్ సైన్యం గగనతల దాడులు చేసింది. దీంతో సహాయబృందాలు రంగంలోకి దిగి శిథిలాలను వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నారు. శిథిల్లాల్లో ఎవరైనా సజీవంగా ఉండి ఉంటారని వెదకుతున్నారు. ఇస్లామాబాద్‌లోని షియా మసీదుపై ఇటీవల ఉగ్రవాదులు ప్రాణాంతకమైన ఆత్మాహుతి బాంబుదాలకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో 33మంది మరణించారు. ఐఎస్ఐఎస్ అనుబంధ ఐఎస్‌కెపి (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖొరాసన్ ప్రావిన్స్) ఒక ప్రకటన చేస్తూ ఈ దాడికి తామే బాధ్యులమని పేర్కొంది. ఈ సంస్థను ఫిత్నా–అల్–ఖవారిజ్‌గా పిలుస్తారు. ఆ తర్వాత వరుస ఆత్మాహుతి బాంబుదాడులు కొనసాగాయి. దీంతో ఖైబర్ ఫఖ్తుంఖ్వా సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం భారీ ఆపరేషన్ నిర్వహించి 200మంది పైగా ఉగ్రవాదులను హతమార్చింది. ఈ ఉగ్రవాదులంతా తెహ్రిక్–ఏ–తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థకు చెందినవారని, వీరిని భారతదేశం పెంచిపోషిస్తోందని పాకిస్థాన్ ఆరోపణ చేస్తోంది. వీరంతా అఫ్గానిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్నారన్నది పాకిస్థాన్ సైన్యం సందేహం. దీంతో సరిహద్దుల్లో ఉన్న ఉగ్రవాద శిబిరాలు, రహస్య స్థావరాలను ధ్వంసం చేసేందుకు ఆదివారం పాకిస్థాన్ సైన్యం గగనతల దాడులు పూర్తిచేసింది.



## ఇరాన్‌లో మళ్లీ నిరసన ప్రదర్శనలు

### ఇద్దరు సైకియాట్రిస్టులు అరెస్టు

**టెహ్రాన్:** ఇరాన్‌లో ప్రజాఉద్యమాన్ని అణచివేసిన నెలరోజులకు ఆ దేశంలోని విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు తిరిగి ఆందోళన ప్రారంభించారు. శనివారం మొదలైన ఆందోళనలు ఆదివారం రెండో రోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా మొదటిరోజు ప్రభుత్వ అనుకూల ప్రదర్శకులకు, ప్రభుత్వ వ్యతిరేక విద్యార్థులకు మధ్య ఘర్షణలు జరిగాయి. విద్యార్థులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ పలు విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శనలు జరిపారు. బెహ్నామ్ ఒహదీ, మహ్మద్ షారీ అనే టెహ్రాన్ నివాసితులు, మనస్తత్వశాస్త్రవేత్తలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేసి అక్రమంగా జైలుకు తరలించారు. ఇటీవల నిరసనల అణచివేతవల్ల మరణించినవారికి టెహ్రాన్‌లోని బెహెష్ట్ జహ్రా శ్మశానవాటికలో 40వ రోజు సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై వెళుతుండగా ఆ ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేసి టెహ్రాన్ జైలుకు తరలించారు. వాస్తవానికి శనివారం ఉదయం టెహ్రాన్‌లోని షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థుల నిరసన ప్రదర్శనలు ప్రారంభమైనట్లు పాశ్చాత్య మీడియా తెలియజేసింది. కాగా టెహ్రాన్‌లోనే మరో టెక్నలాజికల్ యూనివర్సిటీలోనే విద్యార్థులు గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన ప్రదర్శన జరిపారు. జనవరిలో ప్రభుత్వ అణచివేత చర్యల్లో మరణించిన వేలాదిమంది ప్రదర్శకులకు వారు నివాళులు అర్పించారు.

ఇరాన్‌పై పరిమితస్థాయిలో ఇజ్రాయెల్ ద్వారా దాడులు చేసేందుకు అమెరికా యుద్ధ సన్నాహాలు,బెదిరింపులు చేస్తున్న తరుణంలో మళ్ళీ విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేసేదిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోందని అమెరికా,యూరప్ దేశాలు సందేహిస్తున్న తరుణంలో ట్రంప్ ఒత్తిడితో రెండో విడత చర్చలు కూడా అమెరికా–ఇరాన్ మధ్య జరిగాయి. కానీ ఈ చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొనడంతో మళ్ళీ ఉద్రిక్తలు కొనసాగుతున్నాయి.

ఎన్ని సమస్యలు సృష్టించినా

**అమెరికాకు తల వంచం:పెజెష్కియన్**

ఒత్తిడి చేసినంతమాత్రాన భయపడి అమెరికాకు తల ఒగ్గే ప్రశ్నే తలెత్తబోదని ఇరాన్ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ అన్నారు. అణ్వాయుధాలను తయారుచేసే ఉద్దేశం తమ దేశానికి లేదని, వారు తమ దేశానికి ఎన్ని సమస్యలు సృష్టించినాగానీ అగ్రదేశానికి తలవొగ్గే ప్రసక్తే లేదని అన్నారు. ఒకవేళ ఇరాన్‌పై అమెరికా దాడిచేస్తే ఎదురు దాడులు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ టీవీలో ఆయన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

## ఫ్రాన్స్‌లో వేలాదిమంది మితవాదుల ప్రదర్శన




**లియోన్:** దక్షిణ ఫ్రాన్స్ నగరం లియోన్‌లో జాతీయవాద యువకుడు మరణించిన ఘటనను వ్యతిరేకిస్తూ వేలాదిమంది నిరసన ప్రదర్శన జరిపారు. ఈనెలారంభంలో క్వెంటిన్ డెరాంక్ (23) అనే యువకుడు దాడుల్లో మరణించారు. ఈ ఘటనపై న్యాయం చేయాలని, అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మితవాదులు భారీ ప్రదర్శన చేశారు. ఐతే ఇప్పటికే ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేశారు. లియాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లో ఫిబ్రవరి 12వ తేదీన మితవాద విద్యార్థులు, అతివాద విద్యార్థుల మధ్య వివాదం చినుకు చినుకు గాలివానగా మారి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మితవాద యువకుడు డెరాంక్ తలకు గాయమై మరణించాడు. ఐతే అందరూ ప్రశాంతంగా ఉండాలని అధ్యక్షుడు మేక్రాన్ విజ్ఞప్తి చేశారు. 2027లో ఫ్రాన్స్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల తరుణంలో మితవాదులకు, అతివాదులకు మధ్య ఘర్షణలు తిరిగి ప్రారంభమయ్యాయి.

## వెనిజులాలో 1,557 మంది

## ఖైదీల విడుదలకు రంగం సిద్ధం



**కారకస్:** వెనిజులాలో 1,557 మంది రాజకీయ ఖైదీల విడుదలకు రంగం సిద్ధమైంది. ఖైదీలను విడుదల చేసేందుకు అమ్నెస్టీ బిల్లును వెనిజులా చట్టసభలో ప్రవేశపెట్టారు. ఈ వారంలోనే ఈ బిల్లు చట్టరూపం దాల్చనున్నది. దీనివల్ల ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు జైళ్ళనుండి విడుదలవుతారు. నికొలస్ మదురో అధ్యక్షుడుగా ఉండగా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలదరూ జైలుకు వెళ్ళారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జోక్యంతో ఆ దేశ తాత్కాలిక ప్రధానమంత్రి డెల్సీ రోడ్రిగ్జ్‌పై ట్రంప్ ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తున్నది. ఈ బిల్లు ఆమోదం పొందగానే రాజకీయ ఖైదీలు విడుదలవుతారు. అనేకమంది హక్కుల నాయకులు,జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు జైళ్లల్లో ఉన్నారని అమెరికా చెబుతున్నది. ఈరోజు వరకూ 1152 మంది కొత్తగా జైలు నుండి విడుదల చేయాలని కోరుతూ దరఖాస్తులు చేసుకున్నారని ప్రభుత్వ అధికారులు చెప్పారు. దీంతో మొత్తం ఇప్పటి వరకూ జైలు నుండి విడుదల కోరుతూ దరఖాస్తులు చేసుకున్నవారి సంఖ్య 1,557కు చేరింది.

## పోరాడితేనే హక్కులు

(మొదటి పేజీ తరువాయి)

దారుల్లో యువతను ఏదో రకంగా ప్రలోభపెట్టి వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో అసెంబ్లీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లను పర్మినెంట్ చేస్తామని హామీలు గుప్పించారు కాదా? అని అధికార ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడు, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు వీలు పడదనీ సున్నితంగా తిరస్కరించారని గుర్తు చేశారు. సిఆర్‌పిలు విడివిడాగా పోరాడితే ఫలితం ఉండదనీ, ఒక సంఘంలా ఏర్పడి హామీలను నేరవేర్చుకోవాలని సూచించారు. సిఆర్‌పిల హక్కుల సాధనకై సిపిఐ తరపున అసెంబ్లీలో చర్చను లేవనెత్తుతామని చాడ వెంకట్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ యస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ సిఆర్‌పిల హక్కుల సాధనకై ఎఐటియుసి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోరాటాలు, ఉద్యమాలు చేయకుండా సమస్యలు పరిష్కారం కావనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించకుండా, కేవలం రూ.19,500 వేతనంతో ప్రభుత్వం సిఆర్‌పిల శ్రమను దోపిడీ చేస్తుందని ఆరోపించారు. ఎఐటియుసి 1920లో భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఏర్పాటైన సంస్థ అని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్మికుల హక్కులకై నిరంతరం ఉద్యమిస్తుందని కొనియాడారు. సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పాద్య నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్(సిఆర్‌పి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ విద్యా మిషన్‌లో భాగముగా(ఇప్పుడు సమగ్రశిక్ష) 2012వ సంవత్సరంలో డిఎస్సి తరహాలో రోస్టర్ కం రిజర్వేషన్ మెరిట్ ప్రకారం ఇంటర్వ్యూ ద్వారా తమని ఎంపిక చేశారన్నారు. చాలిచాలని జీతాలతో గత 13 సంవత్సరాల నుంచి కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, హ్యాబిటేషన్ పరిధిలో బడి బయట పిల్లలను గుర్తిస్తూ, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ మళ్లీ పాఠశాలలో చేర్పించి, వారి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సిఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించి, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఆరోగ్య భీమా కింద రూ. 25 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలలో సిఆర్‌పిలకు 30శాతం వెయిటేజీని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలలో పనిచేస్తున్న సిఆర్‌పి టీచర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## అజీజ్ పాషా

(మొదటి పేజీ తరువాయి)

ఇస్కఫ్ జాతీయ 24వ మహాసభల్లో 81 మందితో నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి పి.వి దుర్గాప్రసాద్ ఉపాధ్యక్షులుగా, ఆర్.గోపాల్ కార్యదర్శిగా, ప్రొఫెసర్ సారంగపాణి, అవ్వ విజయలక్ష్మి జాతీయ కార్యవర్గ సభ్యులుగా, మద్దినేని రమేష్ బాబు, కొండపర్తి శ్రీనివాసులు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు.

## ఓట్లు తొలగింపు (మొదటి పేజీ తరువాయి)

మొత్తం ఓటర్ల సంఖ్య 21.45 కోట్లకు పైగా ఉంది. అయితే ఈ వారం తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత ఆ సంఖ్య 19.75 కోట్లకు తగ్గింది. నికరంగా 1.70 కోట్లను తొలగించారు. ఇప్పటికే సర్ బిహార్‌లో పూర్తయింది. ప్రస్తుతం ప్రస్తుతం ఇది 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో దాదాపు 60 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తోంది. ఇంకా 40 కోట్ల మంది ఓటర్లు 17 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో చేపట్ట వలసి ఉంది. అసోంలో సర్‌కు బదులుగా 'ప్రత్యేక సవరణ' ఈనెల 10న పూర్తయింది. వివిధ కారణాల వల్ల, తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో సర్ షెడ్యూల్‌లలో తరచుగా మార్పులు చేయబడ్డాయి. బిహార్‌లో మాదిరిగానే, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ పార్టీలు ఈ విధానాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

## రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి




(మొదటి పేజీ తరువాయి)

జాప్యం వలన ప్రాజెక్టు పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రామప్ప చెరువు నుండి జంపన్న వాగుకు నీరు అందించే ప్రణాళికపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

**నీళ్ల విషయంలో రాజకీయాలొద్దు**

మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా అత్యధికంగా వరి దిగుబడి వస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో చర్చించామని చెప్పారు. కెసిఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారని, తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు. ప్రతిపక్షం వారు సూచనలు చేస్తే మేం స్వీకరిస్తామన్న రేవంత్ రెడ్డి... జలాల విషయంలో ఎపికి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధమని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దామని ప్రజలు, నీళ్ల విషయంలో కాదని ఆయన హితవు పలికారు. పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బిఆర్‌ఎస్ నేతలు మారకపోవటం విచారకరమన్నారు. ఆ పార్టీని మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పనట్లుగా వారు వ్యవహరిస్తున్నారన్నారు. ఓటు వేసిన ప్రజలను బహిష్కరించినట్లు చేయటం సరికాదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి విజ్ఞతగా వ్యవహరించాలని హితవు పలికారు. 'గోదావరి నదీ జలాలలకు సంబంధించిన ప్రాజెక్టులను మనం ఈ పదేళ్లలో పూర్తి చేసుకుని 967 టిఎంసిలను వినియోగంలోకి తెచ్చుకుని ఉంటే ఈనాడు వరద జాలల విషయంలో కూడా వాటాలు అడిగే పరిస్థితి ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుకే అధిక నిధులు కేటాయించడం వల్ల మిగిలిన వాటికి నిధులు ఇవ్వడానికి వెతుక్కునే పరిస్థితి వచ్చింది. రాబోవు రెండేళ్లలో ఈ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చాం. అన్ని ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో సమీక్ష చేసి పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఎపితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం**

సిఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదని రేవంత్ రెడ్డి అన్నారు. టిడిపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయమని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఎపితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని వెల్లడించారు.

**సిఎంకు మంత్రుల స్వాగతం**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాలకుగూడెం సమీపంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టు వద్దకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హెలిక్యాప్టర్ ద్వారా చేరుకున్నారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రెవె న్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మం త్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఎ పిఓ చిత్ర మిశ్రా తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు కలిసి దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు లిఫ్టింగ్ పాయింట్‌ను సందర్శించి ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూ ల్ అరుదైన ఆహ్వానం అందింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలిసారిగా నిర్వహిస్తున్న 'ఏఐ పాలసీ సింపోజియం'లో ప్రసంగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తూ హార్వర్డ్ కెన్నెడీ నిర్వాహకులు ఆహ్వాన లేఖను పంపించారు. భారతదేశం నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరినే సింపోజియం ఆహ్వానించడం విశేషం. ఈ ఏడాది మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంపస్‌లో 'ఎఐ పాలసీ సింపోజియం' కార్యక్రమం జరగనుంది. ఈ సింపోజియంలో 'మౌలిక వసతులుగా మారుతున్న కృతిమ మేదస్సు జీవన ప్రమాణాలు, ఉపాధిపై ప్రభావం' అనే ప్యానల్‌లో ప్రసంగించేందుకు సిఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఎఐ ఎకో సిస్టమ్ అభివృద్ధి, ఎఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించేందుకు సిఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వాహకులు సిఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసి సింపోజియం అంశంపైన చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమీ, ఆయా రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఎఐ పాలన, జియోపాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనెబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాల పైన చర్చించేందుకు సింపోజియం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉగ్రకుట్ర భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

అంశాలు ఉండటంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఆ పోస్టర్ల గురించి తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ సెల్ తమిళనాడులో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ నెట్‌వర్క్‌ను గుర్తించారు. ఆరుగురు వ్యక్తులు తిరుప్పూర్‌లోని వస్త్ర కర్మాగారాల్లో పని చేస్తున్నారని, నకిలీ ఆధార్ కార్డును కలిగి ఉన్నారని దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. తిరుప్పూర్‌కు చేరిన స్పెషల్ సెల్, స్థానిక పోలీసుల సాయంతో ఆరుగురిని ఆరెస్ట్ చేశారు.

**బెంగాల్‌లోనూ మరో ఇద్దరు అరెస్ట్**

తిరుప్పూర్‌లోని ఉతుకులి నుంచి ఇద్దరు, పల్లడం నుంచి ముగ్గురు, తిరుమురుగన్‌పూండి ప్రాంతం నుంచి ఒకరు అరెస్టయ్యారు. వారు మిజానుర్ రెహమాన్, మహ్మద్ షబత్, ఉమర్, మహ్మద్ లితాన్, మహ్మద్ షాహిద్, మహ్మద్ ఉజ్జల్‌గా గుర్తించారు. అలాగే బంగాల్ నుంచి మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అరెస్టయిన వారిలో కొందరు బంగ్లాదేశ్ పౌరులని, వారు తమ అసలు గుర్తింపును దాచేందుకు నకిలీ ఆధార్ కార్డులు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం రైలులో ఢిల్లీకి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం**

విదేశీ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు భారత్‌లో పెద్ద ఎత్తున ఉగ్రదాడి చేయాలని వీరు ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. ఇక ఆపరేషన్ సమయంలో ఎనిమిది మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిజిటల్ ఆధారాలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌కు చెందిన తంజీమ్ సంస్థలతో వీరి సంబంధాలపై మరింత విచారణ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ఎఐ సమ్మిట్ సందర్భంగా కశ్మీర్ పోస్టర్లు**

ఈ ఎనిమిది మంది సోషల్ మీడియా ద్వారా పరస్పరం సంప్రదింపులు కొనసాగించిటన్లు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థలకు మద్దతుగా పోస్టులు పెట్టినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ ఎనిమిది మందిలో నలుగురు ఇటీవల జరిగిన ఎఐ సమ్మిట్ సందర్భంగా ఢిల్లీకి వచ్చి 'ఫ్రీ కశ్మీర్' వంటి ప్రేరేపణాత్మక పోస్టర్లు మెట్రోస్టేషన్‌లో అతికించినట్లు పోలీసుల తెలిపారు. ఆ తర్వాత తిరిగి తమిళనాడు, బంగాల్‌కు వెళ్లినట్లు వెల్లడించారు.

**ఉగ్రముప్పు హెచ్చరికతో ఢిల్లీలో హైఅలర్ట్**

దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో శనివారం ఢిల్లీ హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందీని చౌక్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అందుకోసం భార మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముందని తెలిపాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు ఢిల్లీలో హైలర్ట్ ప్రకటించి, బాంబ్ స్క్వాడ్‌తో బృందాలు రంగంలోకి దిగాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో మసీదు పేలుడు ఘటనకు ప్రతీకారంగా భారత్‌లో భారీ ఉగ్రదాడి చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## మెడికో ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

స్నేహితులకు చెప్పినట్లు సమాచారం. స్నేహితులు టిఫిన్ చేసి గదికి వచ్చి చూసేసరికి శ్రీజ ఫ్యా నుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యానికి తెలుపగా వారు బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మధ్య కాలంలో ఇంస్టాగ్రామ్‌లో శ్రీధర్ అనే యువకుడితో పరిచయం పెంచుకోవటంతో సంబధిత యువకుడు శ్రీధర్ పెళ్లి చేసుకోవాలని విద్యార్థినీపై వత్తిడి తెచ్చారన్నారు. అలాగే గత మూడు రోజుల క్రితం పెద్దపల్లికి చెందిన శ్రీధర్ మృతురాలి మామకు ఫోన్ చేసి మీ కోడలును ప్రేమిస్తున్నారు. కాని ఆమే ఎవరితో మాట్లాడుతుందని, తాను పెళ్లి చేసుకుంటానని చెప్పినట్ల సమాచారం. దీంతో మా కోడలు ఏలా పరిచయం అయిందని నాకు ఇంస్ట్రాగ్రామ్‌లో పరిచయం అయిందని, పెళ్లి చేసుకుంటానని చెప్పారన్నారు. మృతురాలి మేనమేమ సిద్దిపేట త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు సిఐ లక్ష్మి బాబు తెలిపారు.

## లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన,ఆయుధ దళాల నిర్వహణవసూళ్లు, బెదిరింపులు కేసులు ఉన్నాయి. వీరి లొంగుబాటుకు ప్రధాన కారణాలు భద్రతా దళాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి,అడవుల్లో కఠిన నిఘా,సరఫరా మార్గాల మూసివేత,క్యాడర్‌లో అంతర్గత విభేదాలు అని అనుమానిస్తున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన వెంకటనర్సయ్య కుమారుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ (58) మే 2025లో మరణించిన మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు (బసవరాజు) తర్వాత కీలక నాయకత్వాన్ని చేపట్టినట్లు సమాచారం. ఆయన పీపుల్స్ లిబరేషన్ గురిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర సైనిక కమిషన్ ఇన్‌చార్జ్‌గా ఉండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అడవుల్లో కార్యకలాపాలు నిర్వహించినట్లు తెలిసింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఇగ్లాస్‌పూర్‌కు గ్రామానికి చెందిన మల్లా రాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ (71) కూడా విద్యార్థ దశ నుంచే మావోయిస్టు పార్టీ వైపు ఆకర్షితులై అజ్ఞాతంలోకి వెళ్లారు.

**విద్యార్థి దశలోనే ఉద్యమం వైపు**

కొరుట్ల లో ఇంటర్ చదువుతున్న సమయంలోనే దేవ్‌జీ ర్యాడికల్ స్టూడెంట్ యూనియన్ ప్రభావంతో ఉద్యమం వైపు మళ్లారు. అనంతరం 1983లో పీపుల్స్ వార్ గ్రూప్‌లో చేరి అండర్‌గ్రౌండ్‌కు వెళ్లారు. గడ్చిరోలిలో దళ సభ్యుడిగా పనిచేసి తర్వాత కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు.

**డిజిపి పిలుపు మేరకే..**

తెలంగాణ డిజిపి బి.శివధర్ రెడ్డి ఇటీవల అండర్ గ్రౌండ్‌లో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వదిలి ప్రధాన ప్రవాహంలోకి రావాలని పిలుపునిచ్చారు. లొంగిన వారికి ప్రభుత్వ పునరావాస పథకం కింద సాయం అందిస్తామని తెలిపారు. గత రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు సాధారణ జీవితంలోకి వచ్చారని పేర్కొన్నారు.

**కుటుంబంలో ఆనందం**

దశాబ్దాల తర్వాత దేవ్జీని చూసే అవకాశం వస్తోందని ఆయన సోదరుడు తిప్పిరి గంగాధర్ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన తర్వాత మీడియా ఫోటోలు తప్ప కుటుంబానికి ఆయనతో ఎలాంటి సంబంధం లేకపోయిందన్నారు. దేవ్‌జీ భార్య మరణించగా, సోదరి ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. దేవ్‌జీ లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి కీలక మలుపు కావచ్చని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి

ప్రముఖ విద్యారంగ, సామాజిక విశ్లేషకుడు ప్రొఫెసర్ కాశీం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని ప్రముఖ విద్యారంగ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కాశీం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకోవాలని, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని కోరారు. 'స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్, కాచిగూడలోని సంఘం భవనంలో రాష్ట్ర అధ్యక్షులు సదానందంగౌడ్ అధ్యక్షతన ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యా సదస్సుకు ముఖ్యవక్తగా ప్రొఫెసర్ కాశీం, ముఖ్య అతిథిగా సిపిఐ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరయ్యారు. ప్రొఫెసర్ కాశీ మాట్లాడుతూ ఎస్‌టియు సంఘం స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం అని గుర్తుచేశారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు విద్యారంగంలో పోటీపడుతున్నాయని, తదనుగుణంగా రాష్ట్రంలో విద్యా విధానంలో సమూల మార్పులు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరులతో పాటు, భౌతిక వనరులను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, పాఠశాలలకు నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు సృజనాత్మకతతో పాటు గుణాత్మక విద్య అందించడంలో ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

**టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించండి : చాడ వెంకట రెడ్డి**

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణలో ఎస్‌టియు టిఎస్ బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తుందని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందని అన్నారు. ఉపాధ్యాయులు ఉమ్మడి ఉద్యమాలకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందంగౌడ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఎలను సాధించుకునేందుకు త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, కెజిబివి, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సి.ఆర్.టి ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ, సంఘ అధికార మాస పత్రిక ఎడిటర్ ప్రసాద్, సబ్ ఎడిటర్ శంకర్ మాతంగి, హెడ్ సెక్రెటరీ కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎ.వి.సుధాకర్, శ్రీనివాసరెడ్డి, పోల్‌రెడ్డి, రవీంద్ర, రాధా జయలక్ష్మి, శీతల్ చౌహాన్, నీరజ , శిరీష, అజర్ జహా, 33 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెన్నం సోదరులను పరామర్శించిన సిఎం రేవంత్ రెడ్డి



వెన్నం రాఘవేందర్ రెడ్డి మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్యాల గ్రామానికి చెందిన వెన్నం రాఘవేందర్ రెడ్డి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఈనెల 11న వెన్నం రాఘవేందర్ రెడ్డి మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రెడ్యాల గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్నారు.

రాఘవేందర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెన్నం సోదరులైన టిపిసిసి రాష్ట్ర మాజీ కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిగ్ టీవి గ్రూప్ ఆఫ్ చైర్మన్ వెన్నం విజయ్‌లను ప్రత్యేకంగా కలిసి ఓదార్చారు. సిఎం పర్యటన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామ ప్రజలు కూడా సిఎం రాకతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

వెన్నం రాఘవేందర్ రెడ్డి మరణం గ్రామానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. సిఎం రాక తో రెడ్యాల గ్రామం జనసంద్రంగా మారింది. సిఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండ సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, ఎంపి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళి నాయక్, రామ్ చంద్రు నాయక్, ఎంపి బలరాం నాయక్, పాల్గొన్నారు.

# 'హరీష్‌రావు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయ లబ్ధి కోసంమాజీ మంత్రి హరీష్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనిభువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహంవ్యక్తంచేశారు. ఆయనఎన్ని అడ్డంకులు సృష్టించినా, చిల్లర రాజకీయాలు చేసినా అభివృద్ధి ఆగబోదని స్పష్టం చేశారు. 'హరీష్ రావు గత బిఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కక్కుర్తి పడి, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం వల్లే నేడు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఎంపిచామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూమధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసుల ఏలాంటి అన్యాయం జరగకుండ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.2012 జిఓ ప్రకారం 30 మీటర్ల బఫర్ జోన్ ఉండాల్సి ఉండగా, కేవలం 9 మీటర్ల బఫర్ చూపించి నాళాపై అపార్ట్‌మెంట్ నిర్మించారని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల తెలియక ప్రజలు ఇళ్లు కొనుక్కున్నారని, ఇందులో ప్రజల తప్పేమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

అపార్ట్‌మెంట్ వాసులకు అన్యాయం జరగనివ్వమని, బాధ్యులైన బిల్డర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బిల్డర్ల నుండే బాధితులకు నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మూసీ పునరుజ్జీవం, మెట్రో ఫేజ్2, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా నగరాభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గాంధీ సరోవర్ కట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే హరీష్ రావు అవాస్తవాలు మాట్లాడుతున్నారని కొట్టిపారేశారు.

సబర్మతి, గంగా నదుల ప్రక్షాళన సమయంలోనూ ఆక్రమణలు తొలగించారని, అదే తరహాలో హైదరాబాద్ ప్రక్షాళన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, బాధితులకు న్యాయం చేస్తూనే నగరాభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ నాయకులు చేరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.గౌరీష్‌తో పాటు పలువురు నేతలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు తనను ఆకర్షించాయని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ గౌరీష్‌కి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై

# విచారణకు మంత్రి ఆదేశం

మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఆదివారం విద్యార్థి ఆత్మహత్నం ఘటనపై విచారణ జరపాలని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిజిపి బి.శివధర్‌రెడ్డిని ఆదేశించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి ఉమేష్‌ను పరామర్శించేందుకు క్రీడల శాఖ మంత్రి హుటాహుటిన వెల్‌నెస్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఇతర కార్యక్రమాలను రద్దుచేసుకుని ఆస్పత్రికి చేరుకున్న మంత్రి, విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థికి అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్యులకు మంత్రి ఆదేశించారు. విద్యార్థి పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వమే అన్ని వైద్య ఖర్చులు భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. చికిత్స విషయంలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలను నిష్పక్షపాతంగా వెలికితీయాలని ఆదేశించారు. విద్యార్థి తల్లిదండ్రులను మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రితో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, ఇతర అధికారులు ఆస్పత్రిలో ఉన్నారు.



# తెలంగాణ ఆత్మను చాటేలా 'గాడ్స్ ఇన్ ది వాయిస్'

కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఒగ్గు కథను ప్రపంచానికి చాటేలా తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే విధంగా "గాడ్స్ ఇన్ ది వాయిస్" డాక్యుమెంటరీ కల్చర్ ఫిల్మ్ రూపొందించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. డాక్టర్ జి.కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న "గాడ్స్ ఇన్ ది వాయిస్" టీజర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం కవిత ఆవిష్కరించారు. తెలంగాణ ఒగ్గు కథను అద్భుతమైన డాక్యుమెంటరీగా తెరకెక్కిస్తున్న కుమారస్వామితో పాటు మూవీ టీమ్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, మూవీ యూనిట్ సభ్యులు ప్రొఫెసర్ జోలి పోతుసెర్రి, మేఘా యాదవ్, మహేశ్వర్, జయదేవ్ యాదవ్, సాయి రుద్రకాంత్, తిరుపతి యాదవ్, కవిత యాదవ్, రాజ్ కుమార్, శ్రీణిక, గనికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిఎం కప్ పోటీలు

యువ క్రీడాకారుల ఉత్సాహానికి వేదికగా రాష్ట్రం

తుది దశకు చేరుకున్న పోటీలు

సోమవారం ముగింపు వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు మరో 11 జిల్లాల్లో 44 క్రీడాంశాల్లో బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. కొన్ని క్రీడాంశాల్లో పోటీలు ముగిసినప్పటికీ, మరికొన్ని తుది దశకు చేరుకుని రసవత్తరంగా సాగుతున్నాయి.గచ్చిబౌలి స్టేడియంలో హాకీ, వాలీబాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్ పోటీలు జరుగుతుండగా, ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో పవర్‌లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫెన్సింగ్ పలు విభాగాల పోటీలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. హ్యాండ్‌బాల్ క్వార్టర్ పోటీలు పూర్తయ్యాయి. బిలియర్డ్స్, స్నూకర్ విభాగాల్లో పోటీలు తుది దశలోకి ప్రవేశించాయి. ఎల్‌బి టెన్నిస్ కాంప్లెక్స్‌లో టెన్నిస్ పోటీలు ఆరంభమయ్యాయి.గచ్చిబౌలి షూటింగ్ రేంజ్‌లో షూటింగ్ పోటీలు కొనసాగుతున్నాయి. హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో సెయిలింగ్, రోయింగ్ పోటీలు ముగియగా, కాయకింగ్, కనోయింగ్ పోటీలు ప్రారంభమై ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో యోగ, మల్లఖంబ్ పోటీలు ఫైనల్ దశలోకి ప్రవేశించాయి. స్కేటింగ్ పలు విభాగాల పోటీలు కూడా నిర్వహించారు.ఇదే విధంగా మిగతా 11 జిల్లాల్లో నిర్వహిస్తున్న వివిధ క్రీడాంశాల పోటీలు కూడా తుది దశకు చేరుకుని ఉత్కంఠ రేపుతున్నాయి.

**ముగింపు వేడుకలు..** అన్ని పోటీలు ఈనెల 23న ముగియనున్నాయి. ఆయా జిల్లాల్లో ఎక్కడికక్కడ ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీల విజేతలకు ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన జట్టుతో పాటు రెండో, మూడో స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు. రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసే వేదికగా సిఎం కప్ నిలుస్తోందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీలో సిపిఐ(ఎంఎల్) ఎస్‌ఒసి విలీనం

సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీలో సిపిఐ (ఎం.ఎల్) ఎస్‌ఒసి (స్టేట్ ఆర్గనైజ్ కమిటీ) పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో విలీనమైంది. రాజకీయ సిద్ధాంత విషయాలను చర్చించి ఒక అంగీకారానికి వచ్చింది. ఒక రాజకీయ పార్టీగా ఏర్పడి, పనిచేయాలని భావించినట్టు సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పార్టీల విలీనం భారత దేశంలో విప్లవకారుల ఐక్యతకు మరింత తోడ్పడాలని, సరైన సిద్ధాంత పరంగా దేశంలో ఐక్య విప్లవ పార్టీగా ఏర్పడాలన్నారు. రెండు కమ్యూనిస్టు విప్లవ సంస్థల ప్రతినిధులు సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ (గతంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టులెనినిస్ట్) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ), సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పార్టీలు సమావేశమయ్యాయి. అన్ని కమ్యూనిస్టు విప్లవ శక్తులను, పార్టీలు, సమూహాలు, వ్యక్తులను ఏకం చేయడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వ్యతిరేక శక్తుల సమీకరణ, ఐక్య అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు తదితర అంశాలపైన చర్చ జరిగిందని, కమ్యూనిస్టు విప్లవాత్మక, వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, సమగ్ర చర్చల తర్వాత ఒక సాధారణ అవగాహనకు వచ్చాయని పేర్కొన్నారు. విస్తృత ఒప్పందంతో, రెండు సంస్థలు ఒకే సంస్థగా సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్‌లో విలీనమయ్యేందుకు అంగీకరించాయి. చారిత్రక నక్సల్బరీ తిరుగుబాటు ద్వారా ఉద్భవించిన శక్తులను, భారతదేశంలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీలలోని విప్లవాత్మక మనస్తత్వం కలిగిన సమూహాలను, వ్యక్తులను, ప్రజా పోరాటాల నుండి ఉద్భవిస్తున్న అధునాతన అంశాలను ఏకం చేయడం ద్వారానే ఐక్య శక్తివంతమైన అఖిల భారత కమ్యూనిస్టు పార్టీని నిర్మించడమే తమ లక్ష్యం అని ప్రదీప్ సింఘా ఠాకూర్, అలిక్ చక్రవర్తి (సిపిఐఎంఎల్ మాస్‌లైన్) సోమనాథ్ ఛటర్జీ, తపన్ ముఖర్జీ (సిపిఐఎంఎల్‌ఎస్‌ఒసి) తెలిపారు.

# తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఫలితంగానే 'కాంగ్రెస్ మేనిఫెస్టో ఉద్యమ అంశాలు'

చీమ శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఫలితంగానే 'తెలంగాణ ఉద్యమ కారుల' అంశాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చారని ఆ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ చీమ శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారు అంశాన్ని ఎవ్వరూ మాట్లాడలేదని, అలాంటి సమయంలో తమ ఫోరం తరపున ఉద్యమ కారుల గొంతుకగా పనిచేశామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అనేక మంది వివిధ పేర్లతో ఉద్యమ కారుల గురించి మాట్లాడుతున్నారని, కానీ వారంతా కూడా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమ అంశాలను పొందుపర్చిన తర్వాత, ఆ పార్టీ అధికారంలోనికి వచ్చిన తర్వాత మాట్లాడుతున్నారని తెలిపారు.

తెలంగాణ ఉద్యమ కారుల అంశాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చేందుకు తాము ఎంతో కష్టపడ్డామని, అనేక మందినాయకుల వద్దకు వె ళ్లామని వివరించారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ పార్టీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమని బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని రాంచందర్ రావు ఇంటి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. కామారెడ్డికి బయలుదెరి వెళ్తుతుండగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు బిజెపి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డితో పాటు పలువురు బిజెపి నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధకాండ పాలనసాగిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతులకు విర్ధంగా అరెస్టులు చేయడం సిగ్గు చేటాన్నారు.

**అప్రకటిత అత్యవసర పరిస్థితి : కిషన్ రెడ్డి**

తెలంగాణలో ప్రస్తుతం 'అప్రకటిత అత్యవసర పరిస్థితి' నడుస్తోందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. 'రాజకీయంగా బిజెపి ఎదుగుదలను చూసి భయపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగాన్ని వాడుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బిజెపి భయపడదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**రాష్ట్రంలో నిర్బంధ పాలన : ఎంపి డి.కె. అరుణ**

బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డి.కె. అరుణ, బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధ పాలన సాగిస్తున్నారని, ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని హెచ్చరించారు. స్వంత పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలపడం నేరమా అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.




# ఎన్‌ఎస్‌జిపై తెలంగాణ పోలీసు జట్టు ఘన విజయం

124 పరుగుల తేడాతో గెలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత పోలీసు సౌత్ జోన్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా మూడవ రోజున మూలపాడు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో తెలంగాణ పోలీసు జట్టు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జి) పై 124 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన తెలంగాణ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 259/2 భారీ స్కోర్ సాదించింది. తెలంగాణ పోలీసు జట్టులోని లోకనాథ్ నాయక్ 58 బంతుల్లో 119 పరుగులు చేసి అద్భుత శతకం సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడి బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపించి జట్టుకు భారీ స్కోరు సాధించడంలో తోడ్పాటు అందించాడు. ఆయన ప్రదర్శన మ్యాచ్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చేదనలో ఎన్‌ఎస్‌జీ జట్టు లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమై 18.3 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌట్ అయింది. తెలంగాణ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో ప్రత్యర్థి జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ కనబరచిన లోకనాథ్ నాయక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రదానం చేయబడింది.ఈ మ్యాచ్‌లో తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సి.వి. ఆనంద్ బ్యాటింగ్ లో రాణించి 40 పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టు ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో తనదైన పాత్ర పోషించారు. కళాత్మకమైన స్ట్రెయిట్ డ్రైవులు, హుక్ మరియు పుల్ షాట్లతో అలరించారు. అనంతరం జరిగిన పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్ కార్యక్రమానికి హాజరై విజేతలను సి.వి. ఆనంద్ అభినందించారు. మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఇరు జట్లలోని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లకు తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్, ఎపి స్పోర్ట్స్ డిఐజి అన్బురాజన్ మెమోంటోలు అందచేశారు.

# బిజెపి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోంది : వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ నియంత పోకడలకు పాల్పడుతోందని మాజీ ఎంపి వి.హనుమంతరావుఆరోపించారు. గాంధీభవన్ ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి అవకాశం ఇవ్వకపోవడం దారునమన్నారు. రాజ్యాంగం ప్రకారం అధికారంలో ఉన్నవారితో పాటు ప్రతిపక్షంలో ఉన్నవారికి సైతం సమాన హోదా ఉంటుందని కాని బిజెపి ప్రభుత్వం ఇందుకు విరుద్దంగా వ్యవహారిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి వైఖరిని ప్రజలు ఇప్పుడు కాకున్న రేపు అయినా తిరస్కరిస్తారని విహెచ్ పేర్కొన్నారు.కుల గణన చేపట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.రాజీవ్ గాంధీ ఆలోచనలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు తీసుకువెళ్లడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ పై అన్ని విధాలా కృషి చేశారని, చైర్మన్ , మేయర్, ఉప సర్పంచ్ పదవుల్లో మహిళలకి రిజర్వేషన్ కల్పించారన్నారు. డిసిసి ప్రత్యేక శిక్షణ శిబిరం సమావేశంలో పని చేసే వాళ్ళకి పదవులు అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పటం అభినందనీయమని విహెచ్ పేర్కొన్నారు.



## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

**ప్రజాపక్షం/గద్వాల్:** గద్వాల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవదైన అలంపూరు జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి దంపతులు దర్శించుకున్నారు. ప్రముఖులు స్వాగతం పూజలు ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితులు వారికి వేధాశీర్వచనాలు అందించి, శేషవస్త్రం మరియు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రితో పాటు కింది ప్రముఖులు పాల్గొన్నారు. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గద్వాల్ ఎమ్మెల్యే విజయుడు అలంపూర్ ఎమ్మెల్యే, బి.యం. సంతోష్ (జిల్లా కలెక్టర్) శ్రీనివాస రావు (జిల్లా ఎస్పీ) పారిశ్రామిక అభివృద్ధి పై వినతి దర్శనం అనంతరం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేంద్ర మంత్రికి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. గద్వాల నియోజకవర్గంలో పారిశ్రామికభివృద్ధికి, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. దీని పై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సందేశం (కన్నడలో భావోద్వేగ ప్రసంగం) కేంద్ర మంత్రి కుమారస్వామి తన అనుభూతులను పంచుకుంటూన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీ వీధుల్లో తాకట్టు : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని ఎఐసిసికి ఒక ఎటిఎంగా మార్చారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఎటిఎంగా మారిందని తాము గతంలో అనేక మార్లు ప్రస్తావించామని,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే స్వయంగా అంగీకరించారని కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సంపదను కాంగ్రెస్ అధిష్టానానికి ధారపోస్తూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని కెటిఆర్ మండిపడ్డారు. రైతులకు, మహిళలకు, యువతకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన 420హామీలను అమలు చేసే విషయంలో ప్రభుత్వం వద్ద నిధులు లేవని సాకులు చెబుతున్నారన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను, లగచర్లలో గిరిజనుల భూములను, చివరకు హెచ్‌సియు విశ్వవిద్యాలయ భూములను కూడా వదలడం లేదని కెటిఆర్ మండిపడ్డారు.

## చిన్నారి మృతి అత్యంత విషాదకరం

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో దైవ దర్శనానికి వెళ్లిన రెండేళ్ల దళిత చిన్నారి అనుమానాస్పదంగా మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఆ చిన్నారి మృతి పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపం తెలియజేశారు. చిన్నారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈఘటనపైన సిఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నార్కెట్‌పల్లిలో హత్య.. పాలేరులో శవం



బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన కూసుమంచి పోలీసులు

ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించిన ఎసిపి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 15వ తేదీన కలకలం రేపిన రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును కూసుమంచి పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎసిపి తిరుపతిరెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీల వివాదమే శ్రీనివాస్ దారుణహత్యకు దారి తీసినట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్, వేణుమాధవ్‌రెడ్డి ఇద్దరు జూబ్లీ కాలేజీలో చదువుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్‌కు బొగ్గుల బిబిక్యూ పేరుతో జిఎస్టి లైసెన్స్ ఉంది. వేణుమాధవరెడ్డి మేక ప్రాజెక్ట్స్ పేరుతో ఓ కంపెనీ స్థాపించి సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇందుకు రూ.కోటి పైనే జిఎస్టి జరిమానా చెల్లించాల్సిన కారణంగా ఇరువురి మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో వేణుమాధవ్ రెడ్డి శ్రీనివాస్‌ను హత్య చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ మేరకు అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్‌హాఫీజ్, మహ్మద్ అజ్మత్‌అలీఖాన్‌తో కలిసి హత్యకు కుట్ర పన్నాడు. ఇందుకు గాను ముఠాకు రూ.5లక్షలు మొత్తాన్ని వేణుమాధవ్‌రెడ్డి సుపారీగా చెల్లించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం శ్రీనివాస్‌కు జిఎస్టి డబ్బులు చెల్లిస్తానని, ముఠాతో నమ్మించి ఈ నెల 13న విజయవాడకు నిందితులు అతని కారులోనే తీసుకొని వెళ్లారు. ఆ మరుసటి రోజు తెల్లవారుజామున నకిరేకల్, జనగామ వైపునకు వెళ్లే దారిలోని నార్కట్‌పల్లి సమీపంలో కత్తులు, ఐరన్ రాడ్లతో శ్రీనివాస్ తలపై కొట్టి, పొడిచి దారుణంగా హత్య చేశారు. అటు తర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పథకరచన చేశారు. మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి పాలేరు రిజర్వాయర్‌లోకి పడేసి, కారు అదుపుతప్పి ప్రమాద ఘటనగా నమ్మించేయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు నాలుగు టీంలుగా దర్యాప్తును విజయవంతంగా పూర్తి చేశారు. పైన పేర్కొన్న నిందితులను అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

**పోలీసులకు రివార్డు...**

కేసును విజయవంతంగా దర్యాప్తు చేసిన పోలీసులకు ఎసిపి రివార్డును అందించారు. కూసుమంచి సిఐ సంజీవ్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎస్‌ఐలు నాగరాజు, సంతోష్, జగదీష్, ప్రొబేషనరీ ఎస్‌ఐ దివ్యను అభినందించారు. అలాగే ఈ కేసులో సహకరించిన కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సతీష్, వినయ్, ఉదయ్, పూర్ణచందర్‌రావు, శ్రీశైలం, శ్రీలత, సయ్యద్, శోభన్, సీతారాములు, హోంగార్డు రాంబాబులను ప్రశంసించారు.

# ఆరు ఎకరాల భూమికి విముక్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణదారుల నుండి కాపాడి, ప్రజోపయోగ పనులకు వినియోగించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కొండాపూర్‌లో రాజరాజేశ్వరి నగర్ కాలనీలో లేఅవుట్ ప్రకారం 5 ఎకరాలు విద్యా సంస్థల స్థాపనకు, 1 ఎకరం పార్క్ అభివృద్ధికి కేటాయించారు. అయితే ఈ భూమిలో కొంత భాగం ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో సిఎంసి కమిషనర్ సృజన, విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదివారం సంయుక్తంగా పరిశీలించారు. 1993 నాటి లేఅవుట్ రికార్డులను, రెవెన్యూ పత్రాలను పరిశీలించి, భూమిని డీమార్కేషన్ చేయించారు. భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా తక్షణమే ఫెన్సింగ్ పనులు చేపట్టారు. భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ స్థలంలో త్వరితగతిన ప్రభుత్వ విద్యాసంస్థలు, పార్కును ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 78 నుంచి 93 వరకు 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ ప్రకారం 2059 ప్లాట్లు రూపొందించారు. అప్పట్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు సుమారు 1 ఎకరం, పార్కుకు ఎకరాకుపైగా, కమ్యూనిటీ హాల్‌కు 2181 గజాల స్థలం కేటాయించారు.

**భూమి విద్యా సంస్థలు, పార్కుల స్థాపనకే : సిఎంసి కమిషనర్ సృజన**

కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలో ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన 6 ఎకరాల భూమిని విద్యా సంస్థలు, పార్కుల స్థాపనకే వినియోగిస్తామని సిఎంసి కమిషనర్ సృజన స్పష్టం చేశారు. విద్యా అవసరాల కోసం కేటాయించిన 5 ఎకరాల్లో విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌ను ఆమె కోరారు. ఒక ఎకరా పార్క్ స్థలాన్ని తక్షణమే అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజాప్రయోజనాలకే ఈ భూమిని వినియోగిస్తామని రాజరాజేశ్వరి సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక నివాసితులకు అధికారులు భరోసా ఇచ్చారు.

**కోర్టుల్లో క్లియరెన్స్ వచ్చాకే వినియోగిస్తాం: రంగనాథ్**

స్వాధీనం చేసుకున్న భూములపై ఉన్న న్యాయపరమైన కేసులను చట్టపరంగా ఎదుర్కొని, కోర్టుల నుంచి క్లియరెన్స్ పొందిన తర్వాత మాత్రమే వినియోగానికి అందచేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సంబంధిత విభాగాలు ఇప్పటికే న్యాయపరమైన చర్యలు ప్రారంభించాయని చెప్పారు. ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**స్థానికుల హర్షం..**

ఈ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని రాజరాజేశ్వరినగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేయగా, హైడ్రా కబ్జాలను తొలగించింది. అనంతరం అధికారులు ప్రాంతాన్ని సందర్శించారు. ప్రభుత్వ విద్యా సంస్థల ఏర్పాటుకు విద్యాశాఖ ద్వారా సర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఐటీ కారిడార్‌కు సమీపంలోని ఈ ప్రాంతంలో దశాబ్దాల సమస్యకు తక్షణ పరిష్కారం లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వెంటనే ప్రభుత్వం కళాశాల, పాఠశాల, పార్క్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించడం అభినందనీయమని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఒక్క 'స్కానింగ్'తో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు!

డిజిటల్ సేవలు విస్తరణకు జిహెచ్‌ఎంసి సన్నహాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర వాసులకు పౌర సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు మహానగర పాలక సంస్థ( జిహెచ్‌ఎంసి) చర్యలు చేపట్టింది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రతి ఇంటికి ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ కేటాయించే వినూత్న వ్యవస్థకు శ్రీకారం చుట్టనుంది. గుర్గావ్‌లో విజయవంతంగా కొనసాగుతున్న ఈ విధానంపై అధ్యయనం చేసిన అధికారులు, హైదరాబాద్ నగరంలోని మూడు మున్సిపల్ వార్డుల్లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, డిజిటల్ పద్ధతిలో అత్యుత్తమ సేవలు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ వాసులకు అతి సులభంగా, పారదర్శకంగా, వేగవంతమైన పౌర సేవలను అందించేందుకు జిహెచ్‌ఎంసి కొత్త డిజిటల్ విధానాన్ని అమలు చేయనుంది. ఒక్క క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తోనే పారిశుద్ధ్యం సహా పలు పౌర, అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టింది. ముమ్ముందు ఈ క్యూ ఆర్ కోడ్ వ్యవస్థను జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆస్తిపన్ను చెల్లింపులు వంటి సేవలకు అనుసంధానం చేయనున్నారు. ఇప్పటికే తుదిదశకు చేరుకున్న జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సర్వే (జిఐఎస్) డేటాను ఈ స్కానర్‌తో లింక్ చేసి ప్రతి ఇంటి స్థలం, వినియోగం, యజమాని వివరాలు, ప్రాపర్టీ ట్యాక్స్ స్థితి వంటి సమాచారాన్ని సర్వర్లో పొందుపరచనున్నారు. అంతేకాకుండా కరెంట్, వాటర్ బిల్లుల వివరాలు కూడా ఈ వ్యవస్థలో చూడగలిగేలా రూపకల్పన చేయాలని యోచిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా విపత్కర పరిస్థితుల్లో ఇంటికి కేటాయించిన యూనిక్ నెంబర్, జిఐఎస్ డేటా ఆధారంగా అత్యవసర సేవలను వేగంగా అందించవచ్చని అధికారులు వెల్లడించారు. గూగుల్ మ్యాప్ లోకేషన్‌తో అనుసంధానం చేసి ఇంటి లొకేషన్‌ను తక్షణమే గుర్తించే విధంగా ఈ వ్యవస్థను ఆధునీకరించనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, జిహెచ్‌ఎంసి పరిధిలోని మొత్తం 150 మున్సిపల్ వార్డుల్లో ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఒకే స్కానర్‌తో అన్ని రకాల డిజిటల్ సేవలను అందించే దిశగా ఈ ప్రాజెక్ట్ పునాది కానుందని చెప్పుతున్నారు.

**పైలట్ ప్రాజెక్టుగా మూడు వార్డుల్లో ప్రారంభం..**

తొలి దశలో భాగంగా కైత్లాలాపూర్, రాజేంద్రనగర్, వనస్థలిపురం మున్సిపల్ వార్డుల్లోని అన్ని నివాసాలకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ స్కానర్లను కేటాయించనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాలకు అనుగుణంగా త్వరలోనే జిహెచ్‌ఎంసి పరిధిలోని మొత్తం 150 వార్డులకు ఈ విధానాన్ని విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు.

**చెత్త సేకరణపై ప్రత్యేక నిఘా**

ఈ క్యూఆర్ కోడ్ విధానం వల్ల ప్రాథమికంగా పారిశుద్ధ్యం సేవలు మెరుగుపడనున్నాయి. స్వచ్ఛ టిప్పర్ ఆటో ప్రతి ఇంటికి వచ్చిందా లేదా అన్నది స్కాన్ ద్వారా తెలుస్తుంది. ఒకవేళ ఆటో రాకపోతే, వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా సమీపంలోని మరో ఆటోను రప్పించే వీలుంటుంది. విధుల్లో నిర్లక్ష్యం వహించే కార్మికులపై చర్యలు తీసుకునేందుకు ఈ డేటా ఉపయోగపడుతుంది. దీనివల్ల 100 శాతం డోర్‌టుడోర్ చెత్త సేకరణ సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

**ఒకే స్కానర్.. ఎన్నో సేవలు !**

- రానున్న రోజుల్లో ఈ క్యూఆర్ కోడ్‌ను జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ (జిఐఎస్) డేటాతో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా ఇతర ప్రయోజనాలు కూడా లభించనున్నాయి.
- **డిజిటల్ చెల్లింపులు :** ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపు.
- **ధృవీకరణ పత్రాలు :** జనన, మరణ ధృవీకరణ పత్రాల దరఖాస్తు.
- **ఆస్తి వివరాలు :** ఇంటి స్థలం, యజమాని వివరాలు, వివరాలు సర్వర్‌లో అందుబాటులో ఉంటాయి.
- **అత్యవసర సేవలు :** ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు, యూనిక్ నెంబర్, గూగుల్ మ్యాప్స్ సాయంతో సహాయక బృందాలు క్షణాల్లో ఇంటిని చేరుకునేలా వ్యవస్థను ఆధునీకరించనున్నారు.

## నేటి నుంచి 'టి-సాట్'లో 'టిజి ఐసెట్' డిజిటల్ పాఠాలు

బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ ఐసెట్ 2026 ' పరీక్షలకు 'టి సాట్'లో డిజిటల్ పాఠాలను అందిస్తున్నామని టి సాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎం.బి.ఎ, ఎం.సి.ఎ అర్హత పరీక్ష ఐసెట్ నిమ్మితం సోమవారం నుంచి ప్రసారాలు మొదలవుతున్నాయని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 13, 14వ తేదీన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2026' జరుగనున్న నేపథ్యంలో ఎనలిటిక్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున పాఠాలను ప్రసారం చేయనున్నామని, విద్యా ఛానల్‌లో ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు, అలాగే నిపుణ ఛానల్ లో సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు డిజిటల్ పాఠాలను ప్రసారం అవుతాయని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు టిసాట్ డిజిటల్ పాఠాలను సద్వినియోగం చేసుకోవాలని వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

## వృద్ధుడిని కాపాడిన ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రమాదవశాత్తు రైలు కింద పడబోయిన వృద్ధ ప్రయాణికుడిని ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ ధైర్యసాహసాలు ప్రదర్శించి కాపాడిన ఉదంతం శనివారం హైదరాబాద్ కాచిగూడ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) కాచిగూడ చెందిన కానిస్టేబుల్ పంకజ్ కుమార్ శర్మ శనివారం ఉదయం ప్లాట్‌ఫాం నెం.1 వద్ద విధులు నిర్వహిస్తుండగా, ఒక వృద్ధ ప్రయాణికుడు కదులుతున్న రైలులో ఎక్కేందుకు ప్రయత్నించాడు. రైలు కదలడం ప్రారంభమైన తర్వాత అతను జారి పడిపోవడంతో రైలు ప్లాట్‌ఫాం మధ్య చిక్కుకునే ప్రమాదంలో పడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన కానిస్టేబుల్ వెంటనే స్పందించి, వృద్ధుడిని బలంగా పట్టుకుని సురక్షితంగా రైలులోకి ఎక్కించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ ప్రయాణికుడికి ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ చూపిన చాకచక్యం, అప్రమత్తత ప్రశంసనీయం అని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ జీవన్ రక్ష కార్యక్రమం కింద ప్రయాణికుల భద్రత కోసం ఆర్‌పిఎఫ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షలో మీడియా పాత్ర కీలకం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యావరణ పరిరక్షణలో మీడియా అత్యంత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు, నిపుణులు, ఉద్యమకారులు అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణలో మీడియా పాత్ర అంశంపై 'ఎన్విరాల్‌మెంట్ జస్టిస్ ఫోరం (ఇజెఎఫ్) ఎల్‌ఇఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో జర్నలిస్టులు, పర్యావరణ నిపుణులు, సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల కాలుష్యం, గృహ మురుగు, వ్యవసాయ రసాయనాల ప్రభావం, చెరువుల ఆక్రమణలు, అటవీ వినాశనం తదితర అంశాలపై చర్చించారు. ఇజెఎఫ్ కార్యదర్శి జి.కొండలరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో, ప్రజా ఆరోగ్యం, బలహీన వర్గాల రక్షణను నిర్ధారించే ప్రజాస్వామ్య సూత్రమని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు డా. పి. నారాయణరావు మాట్లాడుతూ,పర్యావరణ సమస్యల పరిష్కారానికి ప్రజల సూచనలు అవసరమన్నారు.ముఖ్యంగా మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టు, ల్యాండ్‌పూలింగ్ ప్రాంతాలు, పట్టణ పరిసరాల్లో పెరుగుతున్న పరిశ్రమల నేపథ్యంలో నియంత్రణ వ్యవస్థల సామర్థ్యం గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. పర్యావరణ ఉల్లంఘనలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధితుల స్వరాన్ని వినిపించాలని, చట్టాలను అమలు చేసే విధంగా ఒత్తిడి తీసుకురావడంతో మీడియా పాత్ర కీలకమని ఆయన అన్నారు.నిరంతర ఉద్గారాల పర్యవేక్షణ (సిఇఎంఎస్) డేటాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డా. విజయకుమార్ సూచించారు. మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, పారదర్శకత అవసరమని రుచిత్ తెలిపారు. ప్రధాన మీడియా సంస్థలు పర్యావరణ అంశాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అరుణ్య కోరారు. హైదరాబాద్ జంట జలాశయాల పరిస్థితి, వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి వ్యవస్థలపై సమగ్ర అధ్యయనం అవసరమని డా. ఐఎస్ఎన్ రాజు తెలిపారు. కాలుష్యం కలిగించినవారే ఖర్చు భరించాలి అనే సూత్రాన్ని అమలు చేయడంలో మీడియా సమన్వయకర్తగా వ్యవహరించాలని దిలీప్ రెడ్డి సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల పర్యవేక్షణలో సిబ్బంది కొరత ఉందని, తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డా. పి. శ్రీనివాసరావు తెలిపారు. జర్నలిస్టులకు పర్యావరణ పర్యవేక్షణలో నిరంతర శిక్షణ అవసరమని కన్నెగంటి రవి సూచించారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఓపెన్‌కాస్ట్ గనులు, నీటి వనరుల విషయంలో ఉన్న పర్యావరణ, ఆరోగ్య సమస్యలను ప్రస్తావించారు. ప్రభావిత ప్రజలతో కలిసి చర్చలు జరిపి పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. రౌండ్‌టేబుల్‌లో వక్తలు చేసిన తీర్మాణాలలో తెలంగాణలో ప్రత్యేక పర్యావరణ మీడియా నెట్‌వర్క్ ఏర్పాటు, పర్యావరణ పాలనపై క్రమం తప్పకుండా సమీక్షలు,పర్యావరణ రిపోర్టింగ్లో ఫ్యాక్ట్ చెకింగ్ వ్యవస్థ బలోపేతం,పారదర్శకత, బాధ్యత, ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యం,పర్యావరణ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం, బాధ్యతాయుత పాలనకు దోహదపడడం కోసం మీడియా చురుకైన పాత్ర పోషించాలని సమావేశం ఏకగ్రీవంగా అభిప్రాయపడింది.

## మహారాష్ట్రలో పేద మహిళలే లక్ష్యంగా... భారీ 'ఎగ్ డొనేషన్' రాకెట్

ముగ్గురు నిందితులు అరెస్ట్

ఒక్కో చక్రానికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు డబ్బు ఎర

శారీరక దోపిడీకి గురైన 20వేల మంది బాధిత మహిళలు

**థానే :** మహారాష్ట్రలోని థానేలో పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న కోట్లాది రూపాయల విలువైన ఎగ్ (అండం) డొనేషన్ రాకెట్‌ను పోలీసులు బట్టబయలు చేశారు. ఈ కేసులో పోలీసులు ముగ్గురు నిందితులు సులక్షణ గడేకర్(44), అశ్విని చబుక్స్వర్(29), మంజూష వాంఖెడే (46)లను అరెస్ట్ చేశారు. బాధితురాలు థానే సబ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోత్స్న సావంత్‌కు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఇటీవల దాడి చేశారు. నానోసిటీ భవనంలోని గడేకర్ నివాసంలో ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు వెల్లడించిన ప్రకారం... బాధితులకు ఒక్కో చక్రానికి రూ.25,000 నుంచి రూ.30,000వరకు ఆఫర్ చేశారు. వారిని పదే పదే అండదాతలుగా ఉపయోగించుకుని శారీరక దోపిడీ చేశారు. వారిని ఐవిఎఫ్ కేంద్రాలకు తీసుకెళ్లి శస్త్రచికిత్సల ద్వారా అండాలను తీసి లక్షలాది రూపాయలకు విక్రయించేవారని, ఇప్పటి వరకూ 20,000మంది మహిళలు ఈ ఎగ్ డొనేషన్ రాకెట్ బారినపడ్డారని విశ్వసిస్తున్నామని పోలీసులు తెలిపారు. బద్లాపూర్ జోన్‌లోని ఈస్ట్ జొవేలిలోని ఒక నివాస అపార్ట్‌మెంట్, సోనోగ్రఫీ సెంటర్‌లో నిర్వహిస్తున్న అక్రమ వ్యాపారానికి సంబంధించి ముగ్గురు మహిళలను అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారులు శనివారం తెలిపారు. ఎగ్ (అండం) డోనేషన్ అనేది ఒక సంతానోత్పత్తి ప్రక్రియ. దీనిలో ఒక స్త్రీ మరొక స్త్రీ గర్భం దాల్చడానికి అండాలను అందిస్తుంది. సాధారణంగా ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) ద్వారా దాత స్క్రీనింగ్, హార్మోన్ చికిత్స చేయించుకుంటారు. గుడ్లను ఫలదీకరణం చేసి గ్రహీతకు బదిలీ చేస్తారు. అయితే నిందితుల మొబైల్ ఫోన్లలో గర్భధారణకు సంబంధించి ఉపయోగించిన ఇంజెక్షన్ల ఫోటోలు, సోనోగ్రఫీ రిపోర్ట్స్, తప్పుడు పేర్లతో కూడిన అఫిడవిట్లు, నకిలీ పత్రా, ఆర్థిక లావాదేవీల ఆధారాలను మేం స్వాధీనం చేసుకున్నామని ఒక పోలీస్ అధికారి తెలిపారు. నిందితులు పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఎగ్ డొనేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, దాతలకు ఒక్కో సైకిల్ (చక్రం)కు రూ.25,000 నుంచి రూ.30,000వరకు డబ్బు చెల్లిస్తున్నారని పోలీసులు వివరించారు. అండాల ఉత్పత్తిని పెంచడానికి బాధితులకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చేవారని, వారిని పదేపదే శారీరక దోపిడీకి గురిచేస్తున్నారని ఆ అధికారి చెప్పారు. ఈ ప్రక్రియలో స్త్రీలకు ఉత్తేజపరిచే ఇంజెక్షన్లు ఇచ్చారని వివరించారు.అండాలను తయారుచేసి సోనోగ్రఫీ కోసం వారిని తీసుకెళతారని, అండాలు సిద్ధమైన అనంతరం బాధితులను ఐవిఎఫ్ కేంద్రాలకు పంపారని, అక్కడ శస్త్రచికిత్స ద్వారా అండాలను వెలికితీసి రూ.లక్షల రూపాయలకు విక్రయించారని ఆ అధికారి వివరించారు. 20మందికి పైగా మహిళలు ఈ ఎగ్ డొనేషన్ రాకెట్ బారిన పడి ఉంటారని ఉల్హాస్ నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) సచిన్ గోరే చెప్పారు. ఇంతకుముందు ఈ ఎగ్ డొనేషన్ రాకెట్ వాంగణిలో నిర్వహించేవారని, అయితే ఇటీవలే ఈ రాకెట్‌ను బద్లాపూర్‌కు తరలించారని, ఐవిఎఫ్ సెంటర్లు, డాక్టర్లు, హాస్పిటల్స్, పేరొందిన ప్రముఖులు ఈ స్కామ్‌లో ఎవరెవరు భాగస్వాలయ్యాయనే విషయమై విచారణ జరుగుతున్నదని గోరే చెప్పారు. భారతీయ న్యాయ సంహిత, ది అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) యాక్ట్ కింద ఈ కేసును రిజిస్టర్ చేశామని చెప్పారు.



## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

సిఎంసి కమిషనర్ జి.సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండాపూర్‌లోని మార్కెట్ ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. వ్యాపారులు రోడ్లపై చెత్త వేయరాదని, ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఉండాలని వారికి ఆమే సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్త సేకరణ సమయంలో సాట్ వాహనాలకు చెత్త అందించాలని, పరిశుభ్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు.

## బంగ్లాదేశ్‌తో బహుముఖస్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలకు భారత్ సంసిద్ధత

**ఢాకా:** బంగ్లాదేశ్ లో భారత్ హై కమిషనర్ ప్రణయ్ వర్మ ఆదివారం ఆ దేశ విదేశీమంత్రి ఖలీలుర్ రహ్మాన్‌తో సమావేశమయ్యారు. రెండు దేశాలమధ్యా బహుముఖస్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలను అభివృద్ధి చేసుకోవడంపై ఇరువురూ సంభాషణలు జరిపారు. సమావేశం అనంతరం హైకమిషనర్ వర్మ ఢాకాలో పాత్రికేయులతో మాట్లాడుతూ,బంగ్లాదేశ్‌లో దౌత్యసంబంధాలను కొనసాగించేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వంతో సంబంధాలను కొత్తగా పునఃప్రారంభించేందుకు భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించిందని చెప్పారు.అన్ని రంగాలలోనూ బంగ్లాదేశ్‌తో ప్రజలే కేంద్రంగా సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్ కోరుకుంటోందన్నారు. స్నేహపూర్వక సమావేశంకంటే ఇంకా ఎక్కువస్థాయిలోనే ఈ సమావేశం జరిగిందని ఆయన చెప్పారు. బంగ్లాదేశ్‌లో బిఎన్‌పి పార్టీ ఈనెల 12న జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత 17వ తేదీన ప్రధానమంత్రిగా తారిఖ్ రెహ్మాన్ బాధ్యతలు తీసుకున్నారు. 50 మందితో కొత్త మంత్రివర్గం ఏర్పడింది. బిఎన్‌పి విజయం సాధించిన వెంటనే భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ పార్టీకి అభినందనలు తెలియజేశారు. తారిఖ్ రెహ్మాన్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వాన ఒక బృందం హాజరైన విషయాన్ని కూడా వర్మ పాత్రికేయులకు గుర్తుచేశారు.

### అమెరికన్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో...

# ‘అబ్‌కీ బార్ ట్రంప్ సే హార్’

- కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ ఎద్దేవా
- తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఇక ‘కోల్డ్ స్టోరేజి’లో పెట్టాలని కాంగ్రెస్ హితవు

**న్యూఢిల్లీ :** అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని లక్ష్యంగా చేసుకుని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ సుంకాలపై అమెరికన్ సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ‘అబ్ కీ బార్ ట్రంప్ సే హార్’ అని ఎద్దేవా చేసింది. ఈ గందరగోళం నేపథ్యంలో దానిని తప్పకుండా ‘కోల్డ్ స్టోరేజి’లో ఉంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. మధ్యంతర ఒప్పందం కోసం ఫ్రేమ్ వర్క్ నిబంధనలను తిరిగి చర్చించామని, దిగుమతి సరళీకరణ వ్యవసాయ ఉత్పత్తుల గురించి మాట్లాడే నిబంధనలను రద్దు చేయాలని ఆదివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. ఒప్పందం అంటే ఇచ్చిపుచ్చుకోవడం అని, కానీ



భారత దేశం తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కింద మాత్రమే ఇచ్చిపుచ్చుకుందని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ‘ప్రధానమంత్రి నరేంద్రమోదీ హూస్టన్‌లో 2019లో ‘అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్’ అనే నినాదం ఇచ్చారని, కానీ ఆ ఒప్పందం ఫ్రేమ్ వర్క్ ‘అబ్ కీ బార్ ట్రంప్ హార్’ అని రుజువు చేసింది’ అని జైరామ్ రమేశ్ ‘పిటిఐ’ వీడియోలో చెప్పారు. భారతదేశం తన నిబద్ధతలను మార్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను మార్చారని ఆయన ఆరోపించారు. ఈ సమస్యను చుట్టుముట్టిన భారీ గందరగోళం దృష్ట్యా ఈ ఉమ్మడి ప్రకటనను కోల్డ్ స్టోరేజీలో ఉంచాలని తాను ఆశిస్తున్నానని, ఇది ఏకపక్ష ఒప్పందం అని, ఇది దేశంలోని వివిధ రాష్ట్రాలలో లక్షలాది మంది రైతుల ప్రయోజనాలకు హానికరమని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. కాంగ్రెస్ ఎజెండాలో కిసాన్ మహా చౌపల్స్ శ్రేణిలో మొదటిది భోపాల్‌లో ఫిబ్రవరి 24న, రెండవది మహారాష్ట్రలో మార్చి 7న, మూడవది శ్రీగంగానగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని జైరామ్ రమేశ్ నొక్కి చెప్పారు.

# జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు ఉగ్రవాదులు హతం

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో మళ్లీ తుపాకుల మోత మోగింది. కిష్టావర్ జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఆదివారం భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జెఎం) తో అనుబంధంగా ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు తెలిపారు. చత్రో బెల్ట్‌లోని పాసర్‌కుట్ ప్రాంతంలో ‘త్రాషి–1’ ఆపరేషన్ సమయంలో ఉగ్రవాదులు హతమయ్యారని, వారి నుండి రెండు ఎకె47 రైఫిల్స్‌తో సహా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం తెలిపింది. ‘జెకె పోలీసులు, ఐబి (ఇంటెలిజెన్స్ బ్యూరో), సొంత నిఘా వర్గాల నుండి సేకరించిన విశ్వసనీయ నిఘా సమాచారం ప్రకారం, కిష్టావర్ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి, తటస్థీకరించడానికి ఆపరేషన్ ‘త్రాషి–1’ కింద ఉమ్మడి ఆపరేషన్ ప్రారంభించారు. ముందుగా చర్చలు జరపగా, అవి విజయవంతం కావడంతో సిఐఎఫ్ (కౌంటర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్) డెల్టా దళాలు, పోలీసులు, సిఆర్‌పిఎఫ్‌తో



సరస్పర సమన్వయంతో ఆదివారం ఉదయం 11 గంటలకు సవాలుతో కూడిన భూభాగంలో ఉగ్రవాదుల వ్యతిరేక ఆపరేషన్‌లోకి దిగినట్లు ఆర్మీకి చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్‌లో పోస్టు చేశారు. వ్యూహాత్మక కచ్చితత్వం, దూకుడును ప్రదర్శిస్తూ, ఇద్దరు ఉగ్రవాదులను విజయవంతంగా తటస్థీకరించిన ఎన్‌కౌంటర్ ప్రదేశంలో దళాలు ఆధిపత్యం చెలాయించాయని ఆర్మీ తెలిపింది. ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని, శాంతికి భంగం కలిగించడానికి ప్రయత్నించే వారికి ఆశ్రయం దొరకదని వైట్‌నైట్ కార్ప్స్ హెచ్చరించింది. ప్రాథమిక సమాచారాన్ని ఉటంకిస్తూ, హతమైన ఉగ్రవాదులిద్దరూ పాకిస్తాన్ జాతీయులు. నిషేధిత జెఇఎం సభ్యులు అని అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు కొండ దిగువన ఉన్న ఒక మట్టిహౌస్ లోపల దాక్కున్నట్లు సమాచారం అందిందని, గాలింపు బృందాలపై వారు కాల్పులు జరపగా ప్రతిగా బలగాలు కూడా కాల్పుల జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. చత్రో అటవీ ప్రాంతంలో గత నెలలో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య దాదాపు అరడజను సార్లు కాల్పులు జరిగాయి. ఫలితంగా ఒక సైనికుడు, ఒక ఉగ్రవాది మరణించారు. ఆదివారం ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చడంతో ఈ సంవత్సరం జమ్ము ప్రాంతంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం ఆరుగురు జెఎం ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అంతకుముందు, ఉధంపూర్‌లో ఇద్దరు, కథువా జిల్లాలో ఒకరు హతమయ్యారు.

## పెళ్లిళ్లకు కొన్ని గంటల ముందు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య..!



**న్యూఢిల్లీ :** కొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన అక్కా చెల్లెళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లాలోని మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యలకు పాల్పడ్డ పెళ్లి కుమార్తెలు శోభ (25), విమ్ల (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్లుగా పనిచేస్తున్నారు. శనివారం వారి పెళ్లిళ్లు జరగాల్సి ఉండటంతో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ ‘బంధోలి’ కార్యక్రమం సందడిగా సాగాయి. అయితే శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరూ పురుగుల మందు సేవించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే పరిశీలించిన వైద్యులు అప్పటికే వారు మరణించినట్లు ప్రకటించారు. దాంతో మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇంతలో మృతుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అంత్యక్రియలను నిలిపేశారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యం జరిగి ఉంటే అంత్యక్రియలు పూర్తయ్యేవని జస్వంత్ సింగ్ చెప్పారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగంవల్ల జరిగిన ఆత్మహత్యేనని మృతుల మేనమామ ఆరోపించారు. బాధితుల బాబాయ్‌లు, ఈ పెళ్లిళ్ల విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని, మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దుచేసి, బాబాయ్‌ల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లిళ్లు నిశ్చయించారని చెప్పారు. ఈ బలవంతపు పెళ్లి ఇష్టంలేకనే తన మేనకోడళ్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాగా, పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టంలో వారి మరణానికి పురుగుల మందే కారణమని తేలింది. వారు పురుగుల మందు తాగినట్లుగా ఆధారాలు లభించాయి. అయితే ఘటనా స్థలంలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదు. దీనిపై కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నామని ఎడిసిపి రోషన్ మీనా తెలిపారు.

### మహిళకు పార్సిల్..ఓపెన్ చేస్తే

## పుర్రె, ఎముకలు, విభూది!



**చెన్నై :** ఓ మహిళకు వచ్చిన పార్సిల్‌ను తెరచి చూస్తే అందులో మనిషి పుర్రె, ఎముకలు, విభూది దర్శనమిచ్చాయి. దాంతో ఆమె తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని ప్యారిస్ ఏరియాలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వ్యాసర్పాడికి చెందిన శృతి అనే మహిళ ప్యారిస్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తోంది. ఇవాళ ఒక గుర్తు తెలియని వ్యక్తి శృతి పనిచేసే దుకాణం దగ్గరకి వచ్చి, శృతికి పార్సిల్ వచ్చిందని సెక్యూరిటీకి ఇచ్చి వెళ్లాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు ఆ పార్సిల్‌ను తీసుకెళ్లి శృతికి ఇచ్చాడు. దాంతో శృతి ఆ పార్సిల్ తనది కాదని చెప్పింది. దాన్ని తీసుకునేందుకు నిరాకరించింది. దాంతో దుకాణ యజమాని తన సిబ్బంది అందరి సమక్షంలో పార్సిల్ తెరిచి చూశాడు. అందులో మనిషి పుర్రె, ఎముకలు, విభూది ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. అనంతరం తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రుతి కుటుంబీకులకు, అదే షాపులో పనిచేసే దినేశ్ కుటుంబీకులకు గొడవలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలోనే ఆమెను భయపెట్టేందుకు దినేశ్ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాంతో పోలీసులు దినేశ్‌ను, అతని అనుచరులు శ్రీనివాసన్, జోసెఫ్‌ను అరెస్టు చేశారు.

## ఎస్‌యువి, ట్రక్ ఢీ.. ఐదుగురు పోలీస్‌లు మృతి

**భువనేశ్వర్:** ఒరిస్సా జర్సుగూడజిల్లాలోని నేషనల్ హైవే 49లో ఆదివారం తెల్లవారుఝామున ఎస్‌యువి, ట్రక్ ఢీకొట్టుకోవడంతో ఐదుగురు పోలీస్ సిబ్బంది మరణించగా , నలుగురు గాయపడ్డారు. పోలీస్‌లు తెలిపారు.పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం ... ఎనిమిది మంది ఒక వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా జర్సుగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒడిశా ఆదర్శ విద్యాలయ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఐదుగురు సిబ్బంది మరణించారు. ఇద్దరు తీవ్రంగా గాయపడి బర్గఢ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరొకరు స్థిరావస్థలో ఉన్నారు.ట్రక్ డ్రైవర్ కూడా గాయపడి , చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో ట్రక్ , పోలీస్ వాహనం రెండూ పూర్తిగా దెబ్బతిన్నాయి. మరణించిన పోలీస్ సిబ్బంది కాశీరాంబోయి,దేబదుత్తషా,లింగరాజ్ ధారువా(ఆర్మీ పోలీస్ ఆఫీస్‌నుండి)డ్రిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుజుర్, హోంగార్డు భక్తబంధు మిర్ధాగా గుర్తించారు. గాయపడినవారిలో ఎపిఆర్ సిబ్బంది దుబరాజ్ మిరిగా, ఆకాశ్ నాయక్, సెర్జెంట్ రాజీవ్ భర్సగర్ ఉన్నారు. కాగా ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మజీహ్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.జర్సుగూడలో జరిగిన ఈదుర్ఘటనాత్మక రోడ్డు ప్రమాదంలో 5మంది అంకితభావం గల పోలీస్ సిబ్బంది అకాల మరణానికి సంతాపం తెలుపుతూ, వారిఆత్మలకు శాంతి కలగాలని , గాయసడిప వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని మజీహ్ ఎక్స్‌లో వ్రాశారు.


# డిజిటల్ మోసాల బారిన పడొద్దు

### బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్స్ తరుచుగా మార్చండి : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించారు. నో యువర్ కస్టమర్ (కెవైసి)ని అప్‌డేట్ చేయమని, రీ కెవైసిని చేయమని బ్యాంకు నుంచి వచ్చే రిక్వెస్టులను చూసి అస్సలు చిరాకు పడొద్దని ప్రజలను ఆయన కోరారు. సొంత డబ్బును కాపాడుకునేందుకే ఈ పనిని చేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఆదివారం రోజు 131వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికే బ్యాంకు ఖాతా కెవైసిని చేశాం కదా, దీన్ని మళ్లీమళ్లీ ఎందుకు చేయాలనే ప్రశ్న చాలామంది మదిలో ఉదయిస్తుంటుందని ప్రధాని అన్నారు. మళ్లీమళ్లీ కెవైసి ఎందుకంటే, బ్యాంకు ఖాతా భద్రత కోసమే అని అందరూ గ్రహించాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్ట్ లాంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బారినపడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కాలంలో పెన్షన్, రాయితీలు, బీమా, యూపీఐ సహా అన్నీ బ్యాంకు ఖాతాతోనే లింకై ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. అందుకే ఖాతాలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు రీ కేవైసీని బ్యాంకులు చేయిస్తాయన్నారు.

**కెవైసి పేరుతో ఫేక్ కాల్స్, మెసేజ్‌లు రావొచ్చు**

‘‘అయితే కెవైసి, రీ కెవైసి పేరుతో కొంతమంది నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వచ్చే ప్రమాదం ఉంది. వాళ్లు ఎస్‌ఎంఎస్‌లు, వెబ్ సైట్ లింక్స్ పంపే ముప్పు కూడా ఉంది. అందుకే కెవైసి, రీ కెవైసిని నేరుగా బ్యాంకు బ్రాంచీలో చేయించండి. లేదంటే బ్యాంకు అధికారిక యాప్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయండి. ఎవరికీ మీ ఒటిపిని, ఆధార్ నంబరును, బ్యాంకు ఖాతా వివరాలను చెప్పకండి. మీ బ్యాంకు ఖాతా పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండండి. ఇలాంటి అంశాలపై దేశ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటీవలే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను నిర్వహించింది. ఈ ఏడాది పొడవునా ఈ వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఆర్‌బిఐ సూచనలను పాటించండి. మీ కేవైసీని అప్‌డేట్ చేసుకోండి’’ అని ప్రధాని మోదీ తెలిపారు.



**3 మేడిన్ ఇండియా ఎఐ మోడల్స్‌ను ఆవిష్కరించాం**

ఢిల్లీలో జరిగిన ఎఐ సదస్సు ద్వారా ఏఐ విభాగంలో భారత్ అద్భుత సామర్థ్యాలేంటో ప్రపంచానికి తెలిసొచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ సదస్సు వేళ మూడు మేడిన్ ఇండియా ఏఐ మోడల్స్‌ను భారత్ ఆవిష్కరించిందని ఆయన తెలిపారు. ‘‘భారత్ నిర్వహించిన ఎఐ సదస్సుకు చాలామంది ప్రపంచదేశాల నేతలు వచ్చారు. ఈ సదస్సు సందర్భంగా ప్రదర్శించిన భారతీయ ఏఐ ఆవిష్కరణలను నేను వాళ్లకు చూపించాను. ప్రపంచ దేశాల నేతలకు ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు బాగా నచ్చాయి. వీటిలో మొదటిది అమూల్ బూత్. ఇందులో పశువుల నిర్వహణతో ముడిపడిన ఏఐ యాప్‌లను ప్రదర్శించారు. సకాలంలో పశువులకు చికిత్సను అందించేందుకు ఎఐ టెక్నాలజీని ఎలా వినియోగించాలి అనేది అమూల్ బూత్‌లో వివరించారు. పాల డైరీ కార్యకలాపాలను, పశువులను ఎప్పటికప్పుడు సమర్థంగా ట్రాక్ చేసేందుకు పాడి రైతులకు ఏఐ వ్యవస్థలు ఎలా ఉపయోగపడతాయి అనే సమాచారాన్ని ఆ బూత్‌లో తెలియజేశారు’’ అని ప్రధాని మోదీ వివరించారు.

**జయలలిత ప్రజల గుండెల్లో నిలిచిపోతారు**

‘‘ఫిబ్రవరి 24న తమిళనాడు మాజీ సిఎం జయలలిత జయంతి జరగబోతోంది. ఆమెకు ఈసందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. అమ్మ జయలలిత తమిళనాడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. కేరళకు చెందిన మామాంగం సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 250 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సంప్రదాయం కేరళలో జీవం పోసుకుంది. ఇది హర్షించే విషయం’’ అని ప్రధాని మోదీ చెప్పారు.

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం

### గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్లు

**ముంబయి:** ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం జరిగింది. చండీగఢ్ నగరంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకుకు చెందిన ఒక బ్రాంచీలో జరిగిన ఈ గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్ల దాకా ఉందని తెలిసింది. ఈ బ్రాంచీకి చెందిన కొంత మంది ఉద్యోగులే ఈ మోసానికి పాల్పడ్డారని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు వెల్లడించింది. ఈ సమాచారాన్ని ఫిబ్రవరి 21న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)కు తెలియజేసింది. దీనిపై పోలీసులకూ ఫిర్యాదు చేశామని తెలిపింది. తమ బ్యాంకులో ఉన్న హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలు, ఇతర వ్యక్తులు, సంస్థల ఖాతాలలో మోసపూరిత, అనధికారిక లావాదేవీలు జరిగాయనే ప్రాథమిక సమాచారం ఉందని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు పేర్కొంది. ప్రస్తుతం ఈ అన్ని ఖాతాల లావాదేవీలపై అంతర్గత సమీక్ష చేస్తున్నామని, అది పూర్తయ్యాక ఎంత మొత్తంలో ఆర్థిక మోసం జరిగింది అనేది నిర్దిష్టంగా తెలుతుందని చెప్పింది. ఖాతాల్లోని లావాదేవీల సమాచారం, ఖాతాదారులు చేసే క్లెయిమ్‌లు, రికవరీ అయ్యే నగదును కలుపుకొని ఈ ఆర్థిక మోసం విలువను నిర్ధరిస్తామని బ్యాంకు స్పష్టం చేసింది. ఈ ఆర్థిక మోసం విలువ రూ.590 కోట్ల దాకా ఉంటుందనే అంచనాకు వచ్చినట్లు ఆర్‌బిఐకు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు తెలియజేసింది.

## యుపిలో అవినీతి, దుష్టపాలన పెచ్చుమీరుతోంది

### రాష్ట్రంలో బిజెపి చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు

### సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శ

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వంపై సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో అవినీతి, దుష్పరిపాలన పెచ్చుమీరిందని ఆరోపించారు. అదే సమయంలో బాధలు పెరిగేకొద్దీ పిడిఎ బలపడుతుందని ఉద్ఘాటించారు. వెనుకబడిన (పిచ్‌డే), దళిత, మైనారిటీ (అల్పసంఖ్యాక్) వర్గాలను సూచించడానికి అఖిలేశ్ తరుచూ పిటిఎ అనే పదాన్ని ఉపయోగిస్తారు. ఆదివారం లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యాదవ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రశ్నించారు. తమకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, అది ఎక్కడ ఉందని నిలదీశారు. వేస్తున్న పైపులైన్లు అవినీతి పైపులైన్లు అని అన్నారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో అక్రమాలు జరిగాయని, నాణ్యత లేని పనుల కారణంగా నీటి ట్యాంకులు పగిలిపోతున్నాయని, క్షేత్రస్థాయిలో అవినీతి స్పష్టంగా కనిపిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ నెల చివర్లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపాదించిన జపాన్ పర్యటనను విమర్శిస్తూ ‘ముఖ్యమంత్రి జపాన్ వెళ్తున్నారని, కానీ క్యోటోకు వెళ్లడం లేదని విన్నాను. ఆయన అక్కడికి వెళ్లి ఇక్కడ ఏమి చేయాలో, గత 10 సంవత్సరాలలో ఆయన ఏమి చేయలేకపోయారో చూడాలి’ అని అన్నారు. 2014లో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత, భారతీయ జనతా పార్టీ (బిజెపి) వారణాసిని క్యోటో తరహా నగరంగా మారుస్తామని ప్రకటించిందని ఎద్దేవా చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ, ప్రతిపాదిత బుల్లెట్ రైలు ఖర్చు ప్రాథమిక అంచనా నుండి



బాగా పెరిగిందని యాదవ్ అన్నారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గురించి మాట్లాడుతూ, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు నినాదాలుగా పనిచేయడం కంటే ప్రజల నిజమైన సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని యాదవ్ అన్నారు. గత ఎస్పీ పాలనలో రాష్ట్రంలో, ముఖ్యంగా నోయిడాలో ప్రారంభించిన పారిశ్రామిక విధానాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రీబ్రాండింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు కొత్త పెట్టుబడులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని పేర్కొన్నారు.

## ఐదు సీట్లు ఇవ్వండి : ఐయుఎంఎల్



**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీలు సీట్ల పంపకాలపై దృష్టి సారించాయి. తమకు ఐదు సీట్లు ఇవ్వాలని ఐయుఎంఎల్ అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్ ఆదివారం డిఎంకె విజ్ఞప్తి చేశారు. కూటమిలో కూటమిలో విస్తృత ముస్లిం ప్రాతినిధ్యం కావాలని ఐయుఎంఎల్ నాయకుడు పేర్కొన్నారు. శాసనసభలో తగినంత బలాన్ని కూడగట్టుకునేందుకు డిఎంకె గొడుగు కింద వివిధ ముస్లిం సంస్థలకు 16 నియోజకవర్గాలను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు డిఎంకె లౌకిక ప్రగతిశీల కూటమికి నాయకత్వం వహిస్తుంది. టిఆర్ బాలు నేతృత్వంలోని డిఎంకె కమిటీతో మొదటి రౌండ్ సీట్ల పంపకాల చర్చల తర్వాత ఖాదర్ విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) పాత్రను కేవలం ఒక రాజకీయ సంస్థ కంటే ఎక్కువ అని నొక్కిచెప్పారు, దీనిని తమిళనాడులో 60 లక్షలకు పైగా ముస్లిం ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ‘సమాజ ఆధారిత రాజకీయ పార్టీ’గా అభివర్ణించారు. ‘కలైంగర్ (ఎం కరుణానిధి) హయాంలో, ఆయన ఐయుఎంఎల్‌కు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలను ఇచ్చారు. ప్రస్తుత డిఎంకె నాయకత్వాన్ని అదే సంఖ్యలో కేటాయించాలని మేము అభ్యర్థించాము’ అని అన్నారు. అయితే కూటమిని మరింత బలోపేతం చేయడానికి డిఎండికె వంటి కొత్త అభ్యర్థులను చేర్చుకోవాల్సిన అవసరాన్ని డిఎంకె నాయకత్వం యోచిస్తుండగా, నాలుగు సీట్లు కూడా ఆమోదయోగ్యమని మొహిద్దీన్ అన్నారు. కాగా, గతంలో ఇచ్చిన మూడు సీట్లలో పార్టీ గెలవలేకపోయినందున, అంతకంటే తక్కువగా రెండు సీట్లలో పోటీ చేయడాన్ని ఐయుఎంఎల్ పరిగణించాలని డిఎంకె సూచించిందని ఖాదర్ చెప్పారు.

## 25,26 తేదీల్లో మోదీ ఇజ్రాయెల్ పర్యటన

### బుధవారం సాయంత్రం పార్లమెంటులో ప్రధానోపన్యాసం

**జెరూసలెం:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 25,26 తేదీలలో ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఆర్థిక, భద్రత, దౌత్య సహకారాల విస్తృతిపై రెండు దేశాలు దృష్టిపెట్టాయి. 25వ తేదీ బుధవారం సాయంత్రం ఇజ్రాయెల్ పార్లమెంటు కెన్సెట్‌లో మోదీ ప్రధానోపన్యాసం చేస్తారు. 2023 అక్టోబరులో గాజాపై ఇజ్రాయెల్ దాడి చేసిన తర్వాత చాలామంది పశ్చి మ దేశాల నాయకులు ఇజ్రాయెల్‌లో పర్యటించినప్పటికీ గ్లోబల్ సౌత్ నుండి చాలా కొ ద్దిమంది నాయకులు మాత్రమే ఇజ్రాయెల్ లో పర్యటించిన పూర్వరంగంలో మోదీ ప ర్యటనకు అత్యధిక ప్రాధాన్యత వచ్చింది. తా మిద్దరం (నెతన్యాహూ–మోదీ) అన్ని రంగాలలో సహకార విస్తృతి గురించి చర్చలు జ రుపుతామని వారాంతపు మంత్రివర్గ సమావేశ ప్రారంభం సందర్భంగా నెతన్యాహూ చెప్పారు. భారత్ అంటే ఏదో చిన్న దేశం కాదని, ఆ దేశంలో 140 కోట్లమంది జనాభా ఉన్నారని, ఎంతో శక్తిమంతమైన దేశమని అన్నారు. హైటెక్, కృత్రిమ మేధ, క్వాంటమ్ రంగాలలో కూడా సంబంధాలవృద్ధి గురించి చర్చిస్తామన్నారు. గాజా వెస్ట్‌బ్యాంక్‌లో ఆక్రమణలను చట్టబద్ధం చేస్తూ భూముల రిజిస్ట్రేషన్లకు ఇజ్రాయెల్ పార్లమెంటు ఒక శాసనం చేసిన తర్వాత ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తీవ్రస్థాయిలో నెతన్యాహూ చర్యలను దుమ్మెత్తిపోశారు. ఇలా 100 దేశాలు ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇలా వ్యతిరేకించిన దేశాలలో భారత్ కూడా ఉంది. ఈ విమర్శలు వెలువడిన కొద్ది రోజుల తర్వాత మోదీ ఇజ్రాయెల్ పర్యటన వార్త బయటకు వచ్చింది. 2017లో ఇజ్రాయెల్‌లో మోదీ మొదటిసారి పర్యటించారు. ఈ విధంగా ఒక భారత ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పర్యటన అదే మొదటిసారి. ఇప్పుడు మళ్ళీ రెండోసారి పర్యటనకు వెళుతున్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్–భారత్ మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో సంబంధాలు బలపడుతున్నాయి. మౌలికంగా పాలస్తీనా ప్రజలకు సంఘీభావం, పాలస్తీనా ఆవిర్భావమే భారత్ విదేశాంగ విధానంలోఅనేక దశాబ్దాలుగా ప్రధానాంశంగా ఉంటూ వస్తోంది. స్వతంత్ర పాలస్తీనా విముక్తి పోరాటాకు ఆది నుండీ భారతదేశం మద్దతు ఇస్తూ వస్తోంది. అడాల్ఫ్ హిట్లర్ కారణంగా యూరప్ నుండి నిరాశ్రయులైన యూదులకు పాలస్తీనాలో మాతృభూమిని ఏర్పాటు చేస్తామని 1917లో బ్రిటన్ చేసిన బాల్ఫోర్ డిక్లరేషన్‌ను భారత్ సహా ప్రపంచదేశాలు వ్యతిరేకించాయి. 1938 నవంబరు 26వ తేదీన ‘హరిజన్’ పత్రికలో మహాత్మాగాంధీ రాసిన వ్యాసంలో ‘‘ఇంగ్లాండ్ ఇంగ్లీషు వారిదే, ఫ్రాన్స్ ఫ్రెంచ్ ప్రజలదే, అదేవిధంగా పాలస్తీనా అరబ్బువాసులదే’’ అని ప్రకటించారు.

### మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారుపై

## భారత్–అమెరికా చర్చలు తాత్కాలిక వాయిదా

**న్యూఢిల్లీ:** మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు సోమవారం తలపెట్టిన భారత్–అమెరికా సమావేశాలు వాయిదా పడ్డాయి. రెండు దేశాలకు చెందిన ప్రధాన సంప్రదింపుకర్తలు నిర్ణీత ప్రకారం ఫిబ్రవరి 23 నుండి మూడు రోజులు వా షింగ్టన్‌లో సంభాషణలు చేయాల్సి ఉంది. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద విఘాతంగా మారడంతో ఆయన చిక్కుల్లో పడ్డారు. ఈ పరిస్థితులు చక్కదిద్దుకుని కొన్ని ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేసుకోవాలంటే అమెరికా వాణిజ్య శాఖ ప్రదానాధికారులకు కొంత గడువు అవసరం. అందువల్ల ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందనే విషయం తర్వాత ప్రకటిస్తారు. అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి,భారత్ వాణిజ్యమంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి దర్పణ్ జైన్ మధ్య జరగాల్సిన చర్చలు పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా మరో తేదీన జరుగుతాయని ఢిల్లీలోని కేంద్ర వాణిజ్యశాఖ వర్గాలు ఆదివారం ప్రకటించాయి. అమెరికాతో వ్యాపారం చేసే వాణిజ్యభాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన దిగుమతి సుంకాల భారం చెల్లుబాటు కాదంటూ ఫిబ్రవరి 20వ తేదీన అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిపబ్లికన్ ప్రభుత్వానికి ఇంటా బయటా తలవంపులుగా మారింది. ఈ తీర్పు చెప్పిన ఆరుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై ట్రంప్ విరుచుకుపడ్డారు. వ్యక్తిగత దూషణలు చేశారు.1977 నాటి ఐఇఇపిఎ (అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం) ప్రకారం దిగుమతి సుంకాలను పెంచడం వీలు కాదని కోర్టు స్పష్టం చేయడంతో ట్రంప్ ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకున్నారు. ఇప్పటివరకూ ఎవరూ ఉపయోగించని 122వ సెక్షన్‌ను బయటకు తీసి కోర్టు రద్దుచేసిన సుంకాలస్థానంలో 15 శాతం కొత్త సుంకాలను అమలులోకి తెచ్చారు. ఈ సుంకాలు నిరాటంకంగా 155 రోజులు అమలులో ఉంటాయి. 20వ తేదీన మొదట 10 శాతం విధించిన సుంకాలను తర్వాత గరిష్టంగా 15 శాతానికి పెంచారు. కోర్టు తీర్పును, తదుపరి పరిణామాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నట్లు భారత ప్రభుత్వం కూడా ప్రకటించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ఖజానాను నింపేందుకు చేపట్టిన కీలక ఎజెండాకు సుప్రీంకోర్టు తీర్పుతో





ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రోబెర్ట్స్ నాయకత్వాన విస్తృత ధర్మాసనం 6–3 మెజారిటీతో ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్పు చెప్పడంతో అనేక దేశాలు దీనిని ఒక ఉపశమన చర్యగా భావిస్తున్నాయి.గత ఏడాది ఆగస్టు నెలలో ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకాలు విధించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో రెండు దేశాలమధ్యా ఈనెలారంభంలో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో ఎలాంటి మార్పులూ ఉండబోవని ట్రంప్ ప్రకటించారు. కానీ ఈ మొదటిదశ ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారత్–అమెరికా వాణిజ్య ప్రధాన సంప్రదింపుకర్తలు సోమవారం ప్రారంభించాల్సిన చర్చలు పై కారణాలవద్ద వాయిదా పడ్డాయి. 2021–25 సంవత్సరాలలో భారత్‌కు అమెరికా వస్తువులలో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. భారత్ మొత్తం ఎగుమతులలో అమెరికా వాటా 18 శాతంగా ఉండగా, దిగుమతుల్లో 6.22 శాతంగా ఉంది. మొత్తం 10.73 శాతం మేరకు ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 186 బిలియన్ డాలర్ల మేరకు చేరుకుంది. వీటిల్లో 86.5 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులు ఉండగా, 45.3 బిలియన్ల మేరకు దిగుమతులు ఉన్నాయి.

# సాహిత్య ధోరణి మార్చిన సోషలిస్టు రియలిజం

ప్రపంచ సాహిత్య–కళా లోకాన్ని 20వ శతాబ్దంలో ప్రభావితం చేసిన అత్యంత శక్తివంతమైన ధోరణులలో సోషలిస్టు రియలిజం ఒకటి. సాహిత్యంలో సోషలిస్టు రియలిజం అనేది ఒక నిర్దిష్ట సౌందర్యశాస్త్ర, సిద్ధాంత దృక్పథం. ఇది ప్రధానంగా మార్క్సిస్టు భావజాలానికి ఆధారంగా అభివృద్ధి చెందింది. సామాజిక వాస్తవాలను వర్గపోరాట దృష్టితో చిత్రిస్తూ, కార్మిక వర్గం, శ్రమజీవుల జీవితం, వారి పోరాటాలు, ఆశలు, సామూహిక చైతన్యం వంటి అంశాలను కేంద్రీకరించడం దీనికి లక్షణం. వ్యక్తిగత భావోద్వేగాల కంటే సామాజిక మార్పు, చరిత్రాత్మక గమనం, సమాజ నిర్మాణ శక్తులపై దృష్టి పెట్టడం ఇందులో ముఖ్యమైనది. ఈ విధానం వాస్తవాన్ని కేవలం యథాతథంగా చూపడమేగాక, అది సామాజికవాద భవిష్యత్తు వైపు కదులుతున్న చరిత్రాత్మక ప్రక్రియగా ప్రతిబింబిస్తుంది. సోషలిస్టు రియలిజం ప్రధాన లక్షణాలలో మొదటిది వర్గచైతన్యం. పాత్రలు సాధారణంగా కార్మికులు, రైతులు, శ్రమజీవులు. రెండవది చరిత్రాత్మక ఆశావాదం. కథలో కష్టాలు ఉన్నా, చివరికి సమాజం పురోగమిస్తుంది అనే భావన ఉంటుంది. మూడవది సామూహికత. వ్యక్తి కంటే సమూహం ముఖ్యం. నాలుగవది సిద్ధాంత స్పష్టత. రచనలో సామాజిక అన్యాయంపై విమర్శ ఉండాలి. దానికి ప్రత్యామ్నాయంగా సామాజికవాద మార్గం సూచించాలి. సామాజిక వాస్తవ దృక్కోణంలో చేసిన రచనలు కేవలం కథలుగానే మిగిలిపోవు. అవి సమాజ మార్పు పట్ల ఒక ఆవశ్యకతను సూచిస్తాయి. భారతీయ సందర్భంలో కూడా సామాజిక వాస్తవవాద ధోరణులు కనిపిస్తాయి. సోవియట్ యూనియన్‌లో ప్రారంభమైన ఈ సాహిత్య రూపం, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కళ ద్వారా ప్రజల్లో వ్యాప్తి చేయడం, కార్మిక వర్గం పాత్రను మహోన్నతంగా చూపించడం, సమాజవాద భావజాలాన్ని కళా సృష్టిలో ముఖ్యంగా స్థాపించడం వంటి లక్ష్యాలతో అభివృద్ధి చెందింది. సోషలిస్టు రియలిజం అంటే, సమాజవాద విలువలను అలంకరించడం... కార్మికులు, రైతులు, సాధారణ ప్రజలను సాహిత్య హీరోలుగా చూపించడం.. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాలను కళా రూపంలో ప్రతిఫలించడం.. ఆర్థిక, రాజకీయ పోరాటాల వాస్తవాలను సామాజిక మార్పు కోణంలో చిత్రించడం వంటి లక్ష్యాలతో ఏర్పడిన సిద్ధాంతపరమైన సాహిత్య–కళా ఉద్యమం. 1932లో స్టాలిన్ కాలంలో, నాటి సోవియట్ ప్రభుత్వం దీనిని అధికారికంగా రాష్ట్ర సిద్ధాంతంగా ప్రకటించి కళా–సాహిత్యాన్ని ఒక రాజకీయ ఆయుధంలా ఉపయోగించింది. సోషలిస్టు రియలిజం ఆవిర్భావానికి తాత్విక ఆధారాలుగా కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ఆలోచనలను ప్రముఖంగా పేర్కోవాలి. వర్గపోరాటం, దోపిడీ, కార్మిక వర్గ విముక్తి గురించి వారు చెప్పిన సిద్ధాంతాలే సోషలిస్టు రిజలిజం ధోరణికి మూలం. సాహిత్యం కార్మిక వర్గాన్ని చైతన్యపరచాలి అనే భావనకు సోషలిస్టు రియలిజం కూడా జతకలిసింది. సాహితీకారుల బాధ్యతను పెంచింది. లెనిన్ ప్రకారం కళ అనేది శ్రామిక విప్లవానికి దోహదం పడాలి. ప్రజల వాస్తవ జీవితం, వారి పోరాటాలు, భవిష్యత్తు ఆశలు తదితర అంశాలన్నీ సాహిత్యంలో ప్రతిబింబించాలని అంటాడు లెనిన్. సోషలిస్టు రియలిజం సాహిత్యానికి రష్యన్ రచయిత మాక్సిమ్ గోర్కీని ఆద్యుడిగా పేర్కోవచ్చు. ఆయన రచనలు పేదలు, కార్మికుల బాధలను కళ్లకుకడతాయి. గోర్కీ రచించిన 'మదర్' ప్రపంచ సోషలిస్టు సాహిత్యంలో ఒక ప్రధాన గ్రంథం. 'సాహి త్యం ప్రజలను విముక్తి వైపు నడిపించే శక్తి' అంటాడు గోర్కీ. అనడమే కాదు.. అదే సూత్రాన్ని ఆచరించి చూపించాడు.

రేమండ్ విలియమ్స్ సోషలిస్ట్ రియలిజం వ్యవస్థాపక సూత్రాలుగా మూడు అంశాలను గుర్తిస్తాడు. అవి 'పార్టినోస్ట్' లేదా పార్టీ యొక్క కార్మికవర్గ లక్ష్యం పట్ల నిబద్ధత, ప్రజాదరణ యొక్క 'నరోడ్నోస్ట్', దిగువ తరగతి ప్రయోజనాల పట్ల రచయిత నిబద్ధతను తెలిపే 'క్లాసోవోస్ట్'. పార్టినోస్ట్ ఆలోచన వ్లాదిమిర్ లెనిన్ వ్యాసం, పార్టీ ఆర్గనైజేషన్ అండ్ పార్టీ లిటరేచర్ (1905) ఆధారంగా రూపొందింది. ఇది కార్మికవర్గాన్ని దోపిడీ నుండి విముక్తి చేయాలనే పార్టీ లక్ష్యం పట్ల రచయితకు ఉన్న నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. నరోడ్నోస్ట్ కళాకృతికి దక్కిన ప్రజాదరణ పొందిన సరళతను సూచిస్తుంది. పారిస్ మాన్యుస్క్రిప్ట్స్‌లో మార్క్స్ పెట్టుబడిదారీ సమాజంలో మానసిక, శారీరక భావాలను వేరుచేయడం వల్ల ఉద్భవించే పరాయీకరణను సూచిస్తాడు. గతంలో ఫ్యూడలిజం కింద కుటీర పరిశ్రమలలో నిమగ్నమైన కార్మికులు తమంతటతాముగా వివిధ వస్తువులను ఉత్పత్తి చేసేవారు. ఉత్పత్తికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఒకే వ్యక్తుల పర్యవేక్షణలో ఒకే చోట జరిగేవి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో కార్మికులు తమ ఉత్పత్తులపై నియంత్రణ కోల్పోయి వివిధ భాగాల ఉత్పత్తిలో నిమగ్నమై తమ సొంత పని నుంచి బలవంతంగా దూ రం కావాల్సి వచ్చింది. కాబట్టి, జానపద కళ మాత్రమే ప్రజల కళగా



మనుగడ సాగించింది. నరోద్నోస్ట్ అనే భావన ప్రజా కళ యొక్క ఈ గుణాన్ని పునరుద్ఘాటిస్తుంది. ఇది ప్రజలకు అందుబాటులో ఉంటుంది. వారు కోల్పోయిన సమగ్రతను పునరుద్ధరించాలని కోరుకుంటుంది. క్లాసోవోస్ట్ అనేది కార్మికవర్గ ప్రయోజనాల పట్ల రచయిత నిబద్ధతను సూచిస్తుంది. ఇది ఒక నిర్దిష్ట తరగతి పట్ల రచయిత యొక్క స్పష్టమైన విధేయతకు సంబంధించినది కాదు. అయితే, సామాజిక పరివర్తనను చిత్రీకరించే రచయిత స్వాభావిక సామర్థ్యంతో సంబంధం కలిగి ఉంటుంది. కాగా, సోవియట్ యూనియన్ అధికారిక సాహిత్య విధానాన్ని ప్రకటించడంతో 'మాస్కో లైన్' ప్రజాదరణ పొందింది. అంతర్జాతీయంగా కమ్యూనిస్టు వర్గాల ఆమోదం దక్కించుకుంది. ఫలితంగా, సాహి త్యం, ఆర్థిక శాస్త్రం మధ్య ప్రత్యక్ష సంబంధంపై విస్తృత చర్చలు ప్రారంభమయ్యాయి. అప్పటి వరకూ ఉన్న ఆలోచనలను అనుసరించి, కొంత మంది రచయితలుతాము మేధోపరమైన పరిమితిలో చిక్కుకున్నట్టు గుర్తించారు. ఫలితంగా సామాజిక అంశాలకు, సమాజానికి, ఆర్థిక పరిస్థితులకు, జీవన విధానాలకు ప్రాధాన్యం పెరిగింది. వాస్తవికతను ప్రదర్శించని రచనలకు ఆదరణ తగ్గింది. అయితే, కొంత మంది సాహితీకారులు ఈ విధానాన్ని అత్యంత కఠినమైన సాహితీ ప్రక్రియగా చూశారు. ఇలాంటి పరిస్థితుల్లోనే క్రిస్టోఫర్ కాడ్వెల్ రాసిన 'ఇల్యూజన్ అండ్ రియాలిటీ' సాహిత్యంలో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఈ గ్రంథంలో, అతను సాహిత్యాన్ని, కళారూపాలను సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రకారం ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్నలకు సమాధానమిస్తాడు. బేస్ (ఆర్థిక నిర్మాణం), సూపర్‌స్ట్రక్చర్ (సంఘటనా, రాజకీయ, మత, కళా నిర్మాణం) మధ్య పరస్పర సంబంధాన్ని వివరిస్తాడు. ఈ ఆలోచన సహజంగానే టెర్రీ ఈగిల్టన్ వంటి మార్క్సిస్టు విమర్శకులకు నచ్చలేదు. ఈగిల్టన్ ప్రకారం కళ, చట్టం, రాజకీయాలు, మతం వంటి మూలకాలు దేనికదే సొంత అభివృద్ధి వేగాన్ని కలిగి ఉంటాయి. ప్రతి మూలకం దాని అంతర్గత పరిణామాలతో అభివృద్ధి చెందుతుంది. సమాజాన్ని కేవలం వర్గ పోరాటం లేదా ఆర్థిక పరిస్థితి ప్రతిబింబమని మాత్రమే చూడరాదు. అంటే, సూపర్‌స్ట్రక్చర్ స్వతంత్రంగా కూడా రూపకల్పన, అభివృద్ధి, మార్పును అనుభవిస్తుంది. ఈగిల్టన్ అభిప్రాయాల్లో అతి కొద్ది భాగం ఐన్‌స్టీన్ రాసిన 'సైన్స్ అండ్ రియాలిటీ'తో కలుస్తాయి. కానీ, ఐన్‌స్టీన్ తార్కిక ఆలోచనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈగిల్టన్ మాత్రం అన్ని అంశాలకు సమప్రాతినిధ్యం ఇచ్చాడు. అతని అభిప్రాయాలను చాలా మంది మార్క్సిస్టులు తోసిపుచ్చారు. సూపర్‌స్ట్రక్చర్‌కు ఉత్పత్తి విధానం (బేస్) కీలకమని, దానిని విస్మరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. హంగేరియన్ మార్క్సిస్ట్ తత్వవేత్త, విమర్శకుడు జార్జ్ లుకాక్స్ 19వ శతాబ్దపు వాస్తవికతను ఒక నమూనాగా భావించి, వాస్తవిక రచనలు సమాజంలోని వైరుధ్యాల, వర్గ విభజనల లోతైన మోడల్స్‌ను బయటకు తెస్తాయని నమ్మాడు. ఐరోపాలో బలపడిన మార్క్సిస్టు సిద్ధాంతాలపై దోపిడీ వర్గాలు ఉక్కుపాదం మోపడం ఆనవాయితీగా మారింది. మార్క్సిస్టు దృక్పథం ఆధారంగా ఏర్పడిన సోషలిస్టు రియలిజంపై విమర్శలు, ప్రతివిమర్శలు ఎలావున్నా, ప్రజల జీవితాలు ఆర్థిక పరిస్థితులతో ముడిపడిన వైనాన్ని యావత్ ప్రపంచం గుర్తించింది. పెట్టుబడిదారీ దోపిడీ వర్గం ప్రజలను అచేతనులను చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నప్పటికీ, మార్క్సిస్టు ఆలోచనా విధానం ప్రగతిశీల సాహిత్యానికి మూలకంగా భాసిల్లుతునే ఉంది. ఐరోపా దేశాల్లో మార్క్సిస్టు దృక్పథం అనేకానేక ఒత్తిళ్ల మధ్య కూడా ఉనికిని కాపాడుకుంటునే ఉంది. ఎంతో మంది రచయితలు 'సోషలిస్టు రియలిజం' ధోరణిలో సాహితీ సృష్టి చేశారు... ఇప్పటికీ చేస్తునే ఉన్నారు. అయితే, అలాంటి వారి సంఖ్య తక్కువగా ఉండడం దురదృష్టకరం. వివిధ ఒత్తిళ్లకు లొంగిపోతున్న రచయితలు ఇకనైనా పంథాను మార్చుకొని, ప్రజాహిత సాహిత్యాన్ని అనుసరించడానికి ప్రయత్నించాలి. సాహిత్యానికి నిజమైన అర్థాన్ని ఇవ్వాలి. ఎందుకంటే, ఇలాంటి రచనల్లోనే శ్రమజీవుల జీవితాన్ని కేం ద్రంగా తీసుకొని సమాజ నిర్మాణాన్ని విశ్లేషించే ప్రయ త్నం కనిపిస్తుంది. సోషలిస్టు రియలిజం పద్ధతి రాజకీయ ప్రచారం కాదు... ఒక సౌందర్యశాస్త్ర దృక్పథం. వాస్తవాన్ని శాస్త్రీయ సామాజిక విశ్లేషణతో చూడాలని సూచిస్తుంది. అయితే దీనిపై విమర్శలు కూడా ఉన్నా యి. కొందరు విమర్శకులు ఇది అధికార అనుకూల సాహిత్యంగా మారిపోయిందని, సృజనాత్మక స్వేచ్ఛను పరిమితం చేసిందని అంటారు. అయినప్పటికీ, శ్రమజీవుల స్వరాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో దీనికి ఉన్న పాత్రను నిర్లక్ష్యం చేయలేం. ఆధునిక సాహిత్యంలో ఈ పద్ధతి ప్రాముఖ్యత ఇంకా కొనసాగుతోంది. గ్లోబలైజేషన్, పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణ, ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సందర్భంలో వర్గ విశ్లేషణ అవసరం మరింత స్పష్టమైంది. కార్మికుల వలసలు, వ్యవసాయ సంక్షోభం, నగరీకరణ వల్ల ఏర్పడిన సమస్యలు వంటి అంశాలను అర్థం చేసుకోవడానికి సోషలిస్టు రియలిజం ఒక ఉపయుక్త దృష్టి కోణం అందిస్తుంది. సమకాలీన రచయితలు పూర్తిగా సోషలిస్టు రియలిజం విధానాన్నే అనుసరించకపోయినా, సామాజిక న్యాయం, వర్గ అసమానత, శ్రమ గౌరవం వంటి అంశాలను పరిశీలించేటప్పుడు ఈ పద్ధతి ప్రభావం కనిపిస్తుంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఇది వ్యక్తిని సమాజంతో అనుసంధానిస్తుంది. వ్యక్తిగత బాధలు, సమస్యలు కూడా సామాజిక నిర్మాణాల ఫలితమే అని ఇది సూచిస్తుంది. ఈ దృక్పథం ఆధునిక సాహిత్యంలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది. రచయిత తన కాలంతో సంబంధం పెట్టుకొని, సమాజ మార్పులో పాత్ర వహించగలడని ఈ సిద్ధాంతం నొక్కి చెబుతుంది. సారాంశంగా చెప్పాలంటే, సోషలిస్టు రియలిజం అనేది వాస్తవాన్ని సామాజికవాద దిశలో విశ్లేషించే సాహిత్య విధానం. ఇది వర్గపోరాటం, శ్రమజీవుల గౌరవం, చరిత్రాత్మక ఆశావాదం వంటి అంశాలను కేంద్రీకరిస్తుంది. దీనిపై విమర్శలు ఉన్నప్పటికీ, సమాజ వాస్తవాలను గంభీరంగా పరిశీలించడానికి, సమకాలీన అసమానతలను విశ్లేషించడానికి ఇది ఇప్పటికీ ప్రాముఖ్యత కలిగి ఉంది.

**– సత్యశ్రీ**

# మానవత్వ పరిమళం.. హేమలతా లవణం..

ప్రముఖ కవి గుర్రం జాషువా కుమార్తె... తెలుగునాట నాస్తిక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన గోరా (గోపరాజు రామచంద్ర రావు) కోడలు.. మరో నాస్తికవాది గోపరాజు లవణం భార్య... ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి కాబట్టే, హేమలతా లవణం పేరు తెలుగు సమాజ చరిత్రలో సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం, రచనా చైతన్యం అనే మూడు అంశాలతో విడదీయరాని సంబంధం కలిగి ఉంది. ఆమె సంఘసేవకురాలు. ఆలోచనతో కూడిన కార్యచరణకు ప్రతీక. తండ్రి జాషువా నుంచి సమానత్వ భావనను, సమాజంలోని అణచివేతలపై సున్నిత దృష్టిని వారసత్వంగా అందుకుంది. 1932 ఫిబ్రవరి 26న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించిన హేమలత, విద్యలో ప్రతిభ కనబరిచి, మద్రాసు క్వీన్స్ కళాశాలలో బిఎ పూర్తి చేసి బంగారు పతకం సాధించింది. విద్య ఆమెకు వ్యక్తిగత పురోగతికో సాధనం... సామాజిక మార్పుకు ఆయుధం... నాస్తికత్వం, ప్రజాస్వామ్య విలువలు, గాంధేయ ఆలోచనలతో పెరిగిన గోపరాజు లవణంతో ఆమె వివాహం కూడా సామాజిక సందేశమైంది. వర్ణాంతర వివాహంగా జరిగిన ఈ కలయిక, కులవివక్షను సవాలు చేసిన సాహసోపేత నిర్ణయం. హేమలతా లవణం జీవితమంతా అణగారిన వర్గాల పక్షాన నిలిచి, జరిపిన నిరంతర పోరాటమే. వినోబా భావే భూదాన యాత్రలో పాలొనడం, చంబల్ లోయలో బందిపోటు దొంగలలో మానసిక పరివర్తన కోసం కృషి చేయడం ఆమె సేవా దృక్పథాన్ని స్పష్టం చేస్తుంది. నేరస్థుల పునరావాసం, సంస్కరణ ఆమె పనిలో ముఖ్యాంశంగా నిలిచింది. స్టూవర్టుపురం దొంగల పునరావాస కార్యక్రమాలు ఆమె సామాజిక బాధ్యతను ప్రతిబింబించాయి. 1961లో వాసవ్య విద్యాలయం స్థాపన ద్వారా సమత, మమతలపై ఆధారపడిన విద్యా విధానాన్ని ప్రోత్సహించింది. ఆర్థిక సమతా మండలి ద్వారా వెనుకబడిన వర్గాలలో ఆర్థిక, సామాజిక చైతన్యం కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టింది. 1981లో కావలిలో స్థాపించిన నవవికాస్ సంస్థ ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసింది. జోగినీ వ్యవస్థ నిర్మూలనలో ఆమె పాత్ర విశేషమైనది. జోగినులను, వారి పిల్లలను ఆదుకునేందుకు సంస్కార్ వంటి సంస్థలను నెలకొల్పి, వారికి భూములు ఇప్పించడంలో, వివాహాలు జరిపించడంలో కీలకంగా వ్యవహరించింది. ఈ కృషి ఫలితంగా అప్పటి ప్రభుత్వం జోగినీ వ్యవస్థ నిర్మూలన చట్టాన్ని అమలు చేసింది. అంధవిశ్వాసాల కారణంగా బాధపడుతున్న మహిళల సమస్యలను ఆరోగ్య సమస్యలుగా గుర్తించేందుకు ప్రయత్నించడం ఆమె దూరదృష్టిని సూచిస్తుంది. రచయిత్రిగా కూడా హేమలత తన సామాజిక బాధ్యతను నిలబెట్టుకుంది. 'జీవన ప్రభాతం', 'నేరస్థుల సంస్కరణ', 'మా నాన్నగారు', 'అనుభవ తరంగాలు' వంటి రచనల ద్వారా ఆమె అనుభవాలను, సంస్కరణ దృక్పథాన్ని పాఠకులకు అందించింది. జీవన ప్రభాతంకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించడం ఆమె రచనా ప్రతిభకు గుర్తింపు. తండ్రి జాషువా రచనలు అందరికీ




చేరాలనే సంకల్పంతో వాటిని ముద్రించడం ద్వారా సాహిత్య సేవ చేసింది. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఆమె సేవలు ఆగలేదు. 1977 దివిసీమ ఉప్పెన, తదుపరి తుపానులు వంటి విపత్తుల సమయంలో పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంది. ఈ సేవలకు గాను ఆమె అనేక పురస్కారాలు అందుకుంది. అయితే, అవార్డులు ఆమె లక్ష్యం కాదు... సమాజ మార్పే ప్రధాన ధ్యేయం. సాహిత్య సేవ అంటే, రచయితగా, కేవలం పుస్తకాలు రాయడం మాత్రమేకాదని, సమాజాన్ని నవపథంలోకి నడిపించే సాహిత్యం ప్రజలకు చేరేందుకు ప్రయత్నం చేయడం కూడా అందులో భాగమేనని హేమలత జీవితం ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. సమాజ బాధ్యతను మోసే ధైర్యం కలిగి ఉండటం... ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడం... అణగారిన వారి కోసం నిలబడటం ఆమె జీవితానికి ప్రత్యేకతను సంపాదించిపెట్టాయి. సార్థకతను అందించాయి. ఆమె జీవితం, రచనలు రెండూ కలిపి ఒక సమగ్ర సామాజిక ఉద్యమంలా గోచరిస్తుంది. 2008 మార్చి 20న ఆమె మరణించినా, సమానత్వం, మానవత్వం, చైతన్యం అనే విలువలు ఆమె వారసత్వంగా కొనసాగుతున్నాయి.

**(ఈనెల 26న జయంతి)**

## మొట్టమొదటి నవల ఏది?

ప్రపంచ సాహిత్యంలో మొదటి నవలగా ఏ రచనను పరిగణించాలి అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఎందుకంటే, అది నిర్వచనంపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక అర్థంలో, సమగ్ర కథన నిర్మాణం, వ్యక్తిత్వ విశ్లేషణ, సామాజిక నేపథ్యం, గద్యరూప విస్తృతి వంటి లక్షణాల ఆధారంగా పరిశీలిస్తే, జపాన్ దేశానికి చెందిన 'ది ది ఆఫ్ జెన్జీ' (11వ శతాబ్దం)ని ప్రపంచపు మొదటి నవలగా అనేక సాహిత్య పండితులు భావిస్తారు. దీన్ని మురసాకి శికిబు రచించింది. ఇందులో రాజసభ జీవితం, ప్రేమ, రాజకీయ సంబంధాలు, మానసిక సంఘర్షణలు విపులంగా చిత్రించారు. పాత్రల అంతర్ముఖ జీవితంపై ఇంత లోతైన విశ్లేషణ అప్పటివరకు అరుదు. అయితే, పాశ్చాత్య సాహిత్యంలో మొదటి ఆధునిక నవలగా స్పెయిన్‌కు చెందిన 'డాన్ క్విగ్జోట్' (1605)ను గుర్తిస్తారు. మిగెల్ డి సర్వాంటెస్ రచించిన ఈ కృతి వాస్తవికత, వ్యంగ్యం, పాత్రాభివృద్ధి వంటి లక్షణాలతో నవల ప్రక్రియకు కొత్త దిశనిచ్చింది. కాబట్టి, మొదటి నవల అనే గుర్తింపు సాహిత్య ప్రమాణాలపై ఆధారపడి మారుతుంది. అయితే, గద్యరూపంలో సమగ్ర కల్పిత కథనానికి ప్రాచీన నమూనాగా 'ది ది ఆఫ్ జెన్జీ'ని పరిగణిస్తారు.




## భాషా ఉద్యమానికి జాతీయ గుర్తింపు

భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం కేవలం భాషల సంఖ్యలో మాత్రమేగాక, వాటి వెనుక ఉన్న చరిత్ర, ఆత్మగౌరవం, గుర్తింపులోనూ ప్రతిఫలిస్తుంది. ఇటీవలి కాలంలో న్యూ ఢిల్లీలో జరిగిన 'ఓల్ చికీ' లిపి శతాబ్ది ఉత్సవాల ప్రారంభంతో, ఈ సత్యం మరొకసారి దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించిన ఈ వేడుక, కేవలం ఒక లిపి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంగా చూడకూడదు. కారణం, అది సంతాలి సమాజం సాంస్కృతిక స్వాభిమానానికి ఇచ్చిన అధికారిక గుర్తింపు. సంస్కృతి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్మారక నాణెం, తపాలా స్టాంపును విడుదల చేయడం, ఒక భాషా ఉద్యమానికి జాతీయ స్థాయిలో లభించిన గౌరవాన్ని సూచిస్తుంది. ఓల్ చికీ లిపి ఆవిష్కరణ వెనుక ఉన్న చరిత్రను పరిశీలించినప్పుడు, అది ఒక సామాజిక పునరుజ్జీవన ఉద్యమంగా కనిపిస్తుంది. ఒడిశాలోని మయూర్భంజ్ జిల్లాకు చెందిన పండిట్ రఘునాథ్ ముర్ము 1925లో ఈ లిపిని రూపొందించారు. ఆ సమయంలో సంతాలి భాషను రోమన్, దేవనాగరి, ఒడియా లేదా బెంగాలీ లిపుల్లో రాయడం ఆనవాయితీగా ఉండేది. కానీ ఆ విధానం భాష యొక్క స్వర నిర్మాణాన్ని పూర్తిగా ప్రతిబింబించలేకపోయింది. ఒక భాషకు తన స్వంత లిపి లేకపోవడం, దాని సాంస్కృతిక స్వతంత్రతకు ఒక లోటు. ఈ లోటును భర్తీ చేయాలనే సంకల్పంతో ముర్ము ఓల్ చికీని సృష్టించారు. ఆయన 1936లో రచించిన 'హై సెరెనా' అనేది ఈ లిపిలో రచించిన తొలి గ్రంథం. బిదుచందన్ వంటి రచనలు సంతాలి సంస్కృతిని ప్రతిబింబిస్తూ, లిపి, భాష మధ్య ఉన్న అంతర్గత అనుబంధాన్ని బలపరిచాయి. ఓల్ చికీ నిర్మాణం భాషా శాస్త్ర పరంగా ప్రత్యేకమైనది. మొత్తం 30 అక్షరాలతో కూడిన ఈ లిపి పూర్తిగా ధ్వన్యాత్మక స్వభావం కలిగినది. ప్రతి గుర్తు ఒక నిర్దిష్ట ధ్వనికి నేరుగా అనుసంధానమవుతుంది. సంతాలి భాషలో ఉన్న గ్లోట్టల్ స్టాప్‌లు, ప్రత్యేక స్వర రూపాలను ఖచ్చితంగా ప్రతిబింబించగల సామర్థ్యం ఈ లిపికి ఉంది. ఇది సంతాలి ఆస్ట్రోఆసియాటిక్ భాషా కుటుంబానికి చెందినది. ఈ కుటుంబానికి ప్రత్యేకమైన ధ్వన్యనుకరణ లక్షణాలను సరిగ్గా వ్యక్తపరచడానికి ఓల్ చికీ అనుకూలంగా రూపుదిద్దుకుంది. భాషా స్వరూపాన్ని సంరక్షించే సాధనంగా మారింది. ఈ లిపి భౌగోళిక వ్యాప్తి కూడా గమనించదగ్గది. జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, అస్సాం రాష్ట్రాలలో సంతాలి మాట్లాడే సమాజానికి ఇది ప్రధాన వ్రాత మాధ్యమంగా మారింది. ఒక భాషా సమాజం విభిన్న రాష్ట్రాలలో విస్తరించి ఉన్నప్పటికీ, ఓల్ చికీ వారిని ఒక సాంస్కృతిక బంధంతో కలిపింది. లిపి ద్వారా భాష పాఠశాలల్లో ప్రవేశించింది, సాహిత్య సృష్టికి మార్గం ఏర్పడింది, సామాజిక చైతన్యం పెరిగింది. రాజ్యాంగ పరంగా కూడా సంతాలి భాషకు లభించిన గుర్తింపు ఒక మైలురాయి. 2003లో జరిగిన 92వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సంతాలి భాషను భారత రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చడం, భాషా సమానత్వానికి ఒక బలమైన అడుగు. 2025, డిసెంబర్‌లో భారత రాజ్యాంగాన్ని సంతాలి భాషలో, ఓల్ చికీ లిపిలో అనువదించడం, ప్రజాస్వామ్య న్యాయానికి ఒక చారిత్రక ముందడుగు. రాజ్యాంగం ప్రతి పౌరుడి హక్కులు మరియు బాధ్యతలను నిర్వచించే పత్రం. అది ఒక సమాజానికి అందుబాటులో ఉండాలంటే, వారి భాషలో ఉండాలి. ఈ అనువాదం సంతాలి సమాజానికి రాజ్యాంగంతో నేరుగా అనుసంధానం కల్పించింది. ఇది భాషా న్యాయానికి ప్రతీక. ఒక లిపి కేవలం అక్షరాల సమాహారం కాదని, అది ఒక సమాజం యొక్క చరిత్ర, సంస్కృతి, స్వాభిమానానికి ప్రతీక అనీ ఓల్ చికీ శతాబ్ది వేడుకలు మనకు ఒక విశాలమైన సందేశాన్ని అందిస్తున్నాయి. పండిట్ రఘునాథ్ ముర్ము చేసిన ఆవిష్కరణ ఒక వ్యక్తిగత కృషి అయినప్పటికీ, అది సమాజాన్ని పునరుద్ధరించిన ఉద్యమంగా మారింది. భాషను సంరక్షించడం అనేది కేవలం సంస్కృతిని కాపాడటం కాదు... అది భవిష్యత్తును నిర్మించడం. ఓల్ చికీ శతాబ్ది ఉత్సవం, భాషా గౌరవం, జాతీయ ఐక్యత మధ్య ఉన్న సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశం వంటి బహుభాషా దేశంలో, ప్రతి భాషా సమాజం తన స్వరాన్ని వినిపించుకునే హక్కు కలిగి ఉంది. ఓల్ చికీ కథ, ఆ హక్కు సాధ్యమని, సమష్టి చైతన్యంతో అది స్థిరపడగలదని చూపిస్తుంది.

ఈ వారం కవితలు

## నల్లబంగారు నేలపై పొడిచిన ఎర్రని పొద్దు

భద్రాద్రి కొత్తగూడెం
శ్రామిక జన వాడల్లో
హరిజన గిరిజన బడుగు
బహుజనుల గుండెల్లో
రెపరెపలాడుతూ
ఎగురుతున్నది ఎర్రని జెండా
ఎన్నెన్నో అవమానాలు
ఆర్థిక ప్రలోభాలు
దుర్మార్గాలను దౌర్జన్యాలను
దిగమింగుకొని
కుల, మత కుళ్లు రాజకీయాల
సుడుగుండ్లు దాటుకొని
కొత్తగూడెం నల్లబంగారు నేలపై
ఎగిరింది మన ఎర్రెర్రని జెండా
కమ్యూనిస్టులకిక
కాలం చెల్లిందంటూ
కారుకూతలు కూసే
ఓ కుహనా మేధావులారా
కనబడుతున్నదా కొత్తగూడెం
కంచుకోటపై కమ్యూనిస్టులు
ఎగరేసిన ఎర్రని జెండా
వినబడుతుందా ఇంక్విలాబ్
జిందాబాదంటు నినదించే
గళాల గర్జన
శ్రమదోపిడీ పోయేదాకా
సమసమాజం వచ్చేదాకా
మరణమన్నది లేదోయ్
మార్క్సిజం సిద్ధాంతానికి ..
సూర్యచంద్రులున్నంతవరకు
ఎగురుతూనే వుంటుందోయ్
ఎర్రని జెండా

(కొత్తగూడెం కార్పొరేషన్‌లో కమ్యూనిస్టుల విజయానికి అంకితం)

**– బొమ్మగాని నాగభూషణం**
**9849622633**




స్టాన్ స్వామిని చంపేస్తే
రాజ్యాన్ని ప్రశ్నించక మా మతం కాదని
అటువైపు చూడలేదు

ముక్కుపచ్చలారని అమ్మాయిని
ప్రార్థనా మందిరంలో
అత్యాచారం చేస్తే మా మతం కాదని
నోరు మెదప లేదు

దళిత వాడలను సెక్స్ ప్రయోగశాలల్లాగా
చూస్తుంటే ఊరి చివర బతుకులతో మనకేందని
ఊరిమధ్యలో బొబ్రాయి సంబరాలు చేసుకుంటివి

భూమి మీద ఆధిపత్యమెవడిదైతే
వాడు చేసే అరాచకాలను చూసీ చూడనట్టు
తలుపులు బిగించి వినోదాల పెట్టెల్లో తల దూర్చితివి

రాజ్యాధికారం చేపట్టాక
అదే కులహంకారం పెచ్చుమీరి
హత్యలు చేసిన చరిత్ర ఆయా కులాల సొంతం
కారంచేడు చుండూరు సాక్షిగా!
నేడు కుమ్మెరలో పసిబిడ్డను తొక్కి చంపేసిన ఆధిపత్యం

ప్రార్థనమందిరంలోకెళ్లిన చాకలిదే మతమని
నిర్వచించిందో పైమెట్టు
నాలుగో వర్ణంలోని ఓ చిన్న చేపను
అదే వర్ణంలోని పెద్ద చేప చంపేసింది
బీజం వేసింది చతుర్వర్ణ వ్యవస్థదే!
దోషి సైతం అదే!!

**– గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**




కవిత మదిలో మెరిసింది
నిశ్శబ్దపు హృదయంలో
ఆలోచనల అలలా వచ్చి
భావాల్ని మేల్కొలిపింది.

కవిత కాగితపు ఒడిలోచేరింది
సిరాతో స్నేహం చేసి
అక్షరాల అడుగుల్లో
అర్థాలకు ఊపిరి పోసింది.

కవిత నదిలా పారింది
మనసు నిండా ప్రవహించి
పదాల పల్లకీలో
పుటలపై పరుగులేసింది.

కవిత కమ్మగా కుదిరింది
అక్షరాల అల్లికలో
లయకు లయ కలిపి
స్వరాల్ని సర్దుకుంది.

కవిత పత్రికల్లో ప్రచురితమయ్యింది
ప్రపంచపు వెలుతురులో
తన రూపాన్ని చూపిస్తూ
కవిత్వమని చాటింది.

కవిత పాఠకులను పిలిచింది
హృదయాల తలుపులు తట్టి
నన్ను ఆస్వాదించు అంటూ
మనసులను పలకరించింది.

కవిత మన్ననలు పొందింది
ప్రశంసల పరిమళంలో
చప్పట్ల మోగుల్లో
ఆనందంగా తేలిపోయింది.

కవిత కంచికి వెళ్ళింది
కాలపు ఒడిలో ఒదిగి
సంతృప్తి నిద్రలో
శాంతిగా విశ్రాంతి తీసుకుంది.
కవితలను చదవండి
కవులను ప్రోత్సహించండి,
పలుకులమ్మను తలచి
ప్రసాదంగా స్వీకరించండి.

కవితల్లో మునగండి
కవితామృతమును త్రాగండి,
కవితావిందును ఆరగించి
కవితామర్మము తెలుసుకోండి.

**– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం**



## చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గీత

హాజరైన ఎమ్మెల్యే వీరేశం, డైరీ చైర్మన్ అమిత్‌రెడ్డిలు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా ఎన్నికైన పందిరి గీతారమేష్ ఆదివారం రోజున పదవీ బాధ్యతలు చేపట్టారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తెలంగాణ డైరీ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవ చేయడానికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పాలక వర్గం సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా సమస్యలను వెనువెంటనే పరిష్కరించే విధంగా తమ పాలన కొనసాగాలని సూచించారు. పట్టణంలో ఎదురయ్యే మౌళిక సమస్యల పట్ల ఎల్లవేళలా అప్రమత్తత వహించాలని, పారదర్శక పాలనతో ముందుకు సాగాలన్నారు. పట్టణ అభివృద్ధిలో తమ వంతు సహకారం ఎల్లపుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, వార్డు కౌన్సిలర్లను వారు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, పందిరి శ్రీనివాసులు, జడల చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి జాతరలో జరిగిన ఘటన అత్యంత దుర్మార్గం: ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/దేవరకొండ:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మరి జాతరలో జరిగిన చిన్నారి మృతి ఘటన రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం అని, చిన్నారులు, మహిళల పట్ల అవమానకరంగా, అశ్లీలంగా ప్రవర్తించిన ఘటనలను ఎఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు ఆరోపించారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ జాతర వంటి సాంప్రదాయ, సామాజిక వేడుకల్లో ప్రజల భద్రతకు సరైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని ఒక వైపు చిన్నారి మృతి చెందడం, మరోవైపు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా జరిగిన చర్యలు సమాజంలో పెరుగుతున్న వికృత మనస్తత్వానికి ప్రతిబింబమని మహిళలపై వేదింపులు, ఆగౌరవకర ప్రవర్తన ఎట్టి పరిస్థితుల్లో సహించరానివని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని నిందితులను శిక్షించాలని అన్నారు. ప్రజా వేడుకల్లో భద్రతా లోపాలు, పర్యవేక్షణ లోపాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారి మృతిపట్ల ఏఐఎస్ఎఫ్ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## యూరియా ఆన్‌లైన్ పద్ధతితో ఇబ్బందులు

రైతులకు సరిపడా యూరియాను అందజేయాలి



**ప్రజాపక్షం/గుండాల:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూరియా ఆన్‌లైన్ పద్ధతి ద్వారా రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీని ద్వారా రైతులకు యూరియా తీసుకోవడానికి నానాపాట్లు పడాల్సిన పరిస్థితిన నెలకొందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ ద్వారా యూరియా సప్లైని రద్దు చేసి రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు మిత్ర సంఘాల ద్వారా రైతులకు నేరుగా యూరియాను అందించాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. రైతులు వరినాట్లు వేసి రెండు నెలలు గడుస్తున్నా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంటల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. తక్షణమే యాప్ ద్వారా యూరియా సప్లైని ఆపి రైతులకు నేరుగా యూరియాను అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కొమురయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాసరబాద గ్రామంలో దుండిగల రాములుకు ప్రభుత్వం మంజూరి చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకొని గృహప్రవేశం చేస్తుండగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహ ప్రవేశం చేస్తున్న రాములు కుటుంబ సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరుతుందన్నారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలకు ఎంత నమ్మకం ఉందో ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నిదర్శమని అన్నారు. రాబోయే మండ ల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు రాబోతున్నాయని స్పష్టం చేశారు.

## దోషులకు కఠిన శిక్షలు విధించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా రజకులు దర్శనానికి వెళ్తున్న సమయంలో జరిగిన దాడి ఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని టీఆర్‌వీడిఎస్ జిల్లా కార్యదర్శి ఐతరాజు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు దాటినా దేవాలయాల్లోకి రజకులను ప్రవేశించనీయకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులస్తులు దాడి చేసి కుటుంబ సభ్యులను తీవ్రంగా గాయపరచడంతో పాటు పసిపాప మృతికి కారణమైన ఘటన ఘోరమని అన్నారు. ఇది సామాజిక వివక్షకు పరాకాష్టగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ ఘటనను ప్రజా సంఘాలు, ప్రజలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రెవెల్లి యాదయ్య, పోలేపల్లి శంకర్, నదికొండ శ్రీనివాస్, ఐతరాజు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నెలా ఉచిత కంటి వైద్యశిబిరం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

12 విడత కంటి వైద్య శిబిరంలో 610 మందికి కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/చండూరు:** మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు ఎవ్వరు కంటి సమస్యతో బాధపడవద్దని కండ్ల సమస్యలు ఉన్న వారు ధైర్యంగా వెళ్లి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గం ప్రజలకు భరోసా కల్పించారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడే ప్రజ ఇబ్బందులను కంటి చూపు మెరుగుపర్చాలనే తలంపుతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తుందన్నారు. ఆదివారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చండూరు మున్సిపాలిటీ, చండూరు మండల ప్రజలకు 12వ విడుత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ,మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎవరెవరికి ఏ ఏ కంట జబ్బులు ఉన్నాయని ఆరా తీసి మీకు నేనున్నాన్నట్లు భరోసా కల్పించారు.ఈ 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 610మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో250 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైయ్యారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిలో ఆదివారం 155 మందిని వెంటనే ఆపరేషన్ కొరకు హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారందికి మంగళవారం కంటి ఆపరేషన్లు చేయనున్నారని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి నెల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోరిమి ఓంకారం, పార్టీ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, అబ్బనబోని లింగయ్య , మారయ్య పాల్గొన్నారు.

# నేడు మిర్యాలగూడలో సేవాలాల్ జయంతి వేడుకలు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను సోమవారం మిర్యాలగూడలో ఘనంగా జరగనున్నందున బంజారా సోదరులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన బంజారాలు అత్యంత వైభవంగా జరుపుకునే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జయంతి రోజు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి సంత్ సేవాలాల్ భవనం ఎన్ఎస్పీ క్యాంప్ వరకు గిరిజన సాంప్రదాయం వేషధారణ డప్పు వాయిద్యాలతో ఆటపాటల ద్వారా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు అధికారులు, విద్యావంతులు, మహిళలు కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించడంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొర్ర నాగునాయక్, రవితేజనాయక్, సర్పంచ్‌లు సిద్ధునాయక్, శ్రీహరి, ఎంఈవో ధర్మానాయక్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరధ్‌నాయక్, కృష్ణకాంత్‌నాయక్, కృష్ణనాయక్, మురళినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధవనం - అంతర్జాతీయ వేదికపై ఖ్యాతి



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనానికి ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తోంది. తాజాగా దక్షిణ కొరియాకు చెందిన ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ప్రతినిధుల బృందం బుద్ధవనాన్ని సందర్శించి ప్రశంసలు కురిపించింది.హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న అనంతరం, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు బృందం నాగార్జునసాగర్‌కు చేరుకుంది. దక్షిణ కొరియాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ బుద్ధిష్ట్ స్టడీస్‌కు చెందిన విద్యాసాంస్కృతిక ప్రతినిధులు కాంగ్ సుంగ్ యోంగ్, చోయ్ సేంగహో, మిన్ క్యేయోంగ్ వూ, కవన్ జిన్ వోక్, శేషు, చిరాగ్ జలది తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.బృందం ముందుగా భగవాన్ బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి, అనంతరం బుద్ధ చరిత వనం, జాతక వనం, ధ్యాన వనం, స్థూప వనాలను సందర్శించింది. ముఖ్యంగా స్థూప వనంలో నిర్మించిన సౌత్ కొరియా మహాస్తూపాన్ని పరిశీలించి, భారకొరియా బౌద్ధ సంబంధాలకు ఇది ప్రతీకగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.తదుపరి మహాస్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను ప్రతిబింబించే లఘు చిత్రాన్ని వీక్షించారు. ధ్యాన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శాసన విభాగం అధికారులు, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందరరావు బుద్ధ జ్యోతులను వెలిగించి అతిథులను సన్మానించారు. బుద్ధవనం కండువాలు,బ్రోచర్లు అందజేసి సాంస్కృతిక మర్యాదలు పాటించారు.ఈ సందర్భంగా బుద్ధవనంలో చేపట్టబోయే నూతన నిర్మాణాలు, అంతర్జాతీయ బౌద్ధ సదస్సుల ప్రణాళికలు, పర్యాటకాభివృద్ధి చర్యలపై వారికి వివరించారు. బృందంతో పాటు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.బుద్ధవనం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తెలంగాణ పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చే అంశంగా భావిస్తున్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఆధునిక వైద్య సదుపాయాలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు చేరువ కావడం ద్వారా ఆరోగ్యం మరింత బలోపేతం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లాలిత్య స్కిన్ అండ్ లేసర్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు స్థానిక ప్రజలకు మెరుగైన చర్మ వైద్య సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

## అరైవ్(-) అలైవ్ రోడ్డు భద్రత అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల ప్రాణభద్రత ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నేటి నుండి వారం రోజులపాటు రెండవ దశ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పి కె నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నిర్మూలించడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో దీనిపై విస్తృత ప్రచారం చేస్తామని, ప్రజలకు ట్రాఫిక్ నియమాలను తెలియపరుస్తామన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపకూడదని అంశాలపై ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరారు.

## మత సామరస్యానికి ప్రతీక హజ్రత్ అబ్బాస్ దర్గా



**ప్రజాపక్షం/చింతపల్లి :** మత సామరస్యానికి ప్రతీక హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు అని మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పికె మల్లేపల్లి గ్రామంలో జరుగుతున్న 57వ హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలలో ఆదివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ జగదీశ్‌రెడ్డి, రవీంద్రకుమార్‌కు ఘన స్వాతగం పలికి శాలువతో సన్మానించారు. తదనతంతరం వారు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, భీల్యానాయక్, కిషన్‌నాయక్, రమేష్‌నాయక్, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ మునగాకు ఉత్పత్తుల పరిశీలన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని దాత్తయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళాశాల నుండి వచ్చిన యూనిట్ 2 విద్యార్థులు దత్తాయిపల్లి గ్రామంలో ఉన్న యాదాద్రి ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ కంపెనీని విజిట్ చేసి ఆర్గానిక్ పద్ధతులలో చేస్తున్న మునగాకు ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. ఈ యొక్క ప్రాసెసింగ్ సెంటర్ గురించి సంస్థ డైరెక్టర్స్ సుధీర్, అమరేందర్ రెడ్డి, సుమలత అరుణలు వివరిస్తూ సోలార్ డిహైడ్రేషన్‌తో, మునుగ, తులసి, అశ్వగంధ, అల్లం, బొప్పాయి మొదలగు ఇతర ఆకులని ఎండబెట్టి ప్యాకింగ్ చేసి వివిధ దేశాలకి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో రైతులని భాగస్వాములని చేసి, వారిని ఆర్గానిక్ పద్ధతులలో పంటలని వేయించి వాటిని తిరిగి కోనేలాగా వారిని ప్రోత్సహిస్తున్నామని, దీని ద్వారా వారికీ మంచి ఆదాయంతోపాటు, భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ కనక బాలరాజ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




# సర్కారీ దవాఖానా.. రోగులకు తీరని వేదన!

సమస్యల నిలయంగా నాంపల్లి ప్రభుత్వ దవాఖాన



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది.పేదలకు పెన్నిధిగా ఉండాల్సిన ప్రభుత్వ దవాఖానాలు నేడు సమస్యల నిలయాలుగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాల నుంచి ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే సామాన్యులకు నిరాశే ఎదురవుతోంది.డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, ఉన్నా సమయపాలన పాటించకపోవడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రతిరోజూ వందలాది మంది రోగులు దవాఖానాకు వస్తున్నప్పటికీ, ఓపీ విభాగాల్లో డాక్టర్లు ఉండాల్సిన సమయంలో కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. గర్భిణీలకు తీవ్ర ఇబ్బందులు గైనకాలజిస్టులు లేకపోవడంతో గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రసవాల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.అత్యవసర సేవల కొరత రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగితే ప్రాథమిక చికిత్స అందించే సిబ్బంది లేకపోవడం బాధాకరమని రోగులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం 8 గంటల తర్వాత ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండకపోవడం పరిస్థితి దారుణతను తెలియజేస్తోంది.


సిబ్బంది కొరత పెరుగుతున్న పనిభారం

స్పెషలిస్ట్ డాక్టర్ల సంగతి పక్కన పెడితే, కనీసం ఎంబీబీఎస్ డాక్టర్లు కూడా పూర్తిస్థాయిలో లేరని తెలుస్తోంది. ఉన్న కొద్ది మంది సిబ్బందిపైనే అధిక పనిభారం పడుతుండటంతో రోగులకు సరైన సమయం కేటాయించడం కష్టమవుతోంది.

ప్రజల డిమాండ్

మారుమూల ప్రాంతాల్లో డాక్టర్లు విధులు నిర్వర్తించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ దవాఖానాకు వస్తే జబ్బు తగ్గుతుందన్న నమ్మకం కలగాలి గానీ, ఇక్కడి పరిస్థితులు చూస్తే మరిన్ని సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డాక్టర్లు, నర్సుల కొరతను తీర్చడంతో పాటు సమయపాలన కచ్చితంగా అమలు చేయించి రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చంద్రమ్మకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని తానేదారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు కర్నాటి అంజయ్య తల్లి కర్నాటి చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆదివారం వారి నివాసానికి వెళ్లి చంద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి కుటుంబానికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చంద్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్, మండల కార్యవర్గ సభ్యులు ఎరుకల నిరంజన్ గౌడ్,శాఖ కార్యదర్శి అబ్బనగోని కృష్ణయ్య,అడుమయ్య,జాల చంద్రయ్య,పాముల రమేష్,కొమురయ్య పాల్గొన్నారు.

# మురళీకృష్ణుడిగా నారసింహుడు!



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నీలమేఘ శ్యాముడు.. వేణుగాన లోలుడు.. ఆ నందకిశోరుడి రూపంలో యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారు భక్తులను మురిపించారు. లోక రక్షకుడైన నారసింహుడు, లోక మోహనుడైన మురళీకృష్ణుడిగా దర్శనమివ్వడంతో యాదగిరి గిరిప్రదక్షిణ భక్తి పారవశ్యంలో మునిగి తేలింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం స్వామివారు ఉదయం శ్రీకృష్ణాలంకారంలో, రాత్రి పొన్న వాహనంపై ఊరేగుతూ భక్తకోటిని తరింపజేశారు.

వేణునాదం.. వేదనాదం!

బ్రహ్మోత్సవాల వేళ ఆలయంలో నిత్యారాధనల అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి శ్రీకృష్ణాలంకార (మురళీకృష్ణుడు) సేవ నిర్వహించారు. చేతిలో వేణువు ధరించి, నెమలి పింఛంతో ముస్తాబైన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మురళీకృష్ణుడి వేణునాదం సాక్షాత్తు వేదనాదమని, ఆ రూపాన్ని దర్శించినా, ఆ గానాన్ని స్మరించినా ఇంద్రియాలకు ఉపశమనం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీపాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు కల్లూరు వెంకటాచార్యులు, బట్టర్ సురేంద్ర ఆచార్యుల బృందం ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు.

రాత్రివేళ రమణీయం.. పొన్నవాహన సేవ పగలు కృష్ణుడిగా అలరించిన స్వామివారు, రాత్రి వేళ విశిష్టమైన పొన్న వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవతా వృక్షాలలో శ్రేష్టమైన పొన్న వృక్షంపై స్వామివారి ఊరేగింపు కన్నులపండువగా సాగింది. భగవంతుడు సత్పురుషులకు నివాస వృక్షంలా అండగా ఉంటాడని, ఈ వాహనంపై స్వామిని దర్శిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. విద్యుత్ దీపాల కాంతుల మధ్య స్వామివారి తిరువీధి ఉత్సవం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

తరలివచ్చిన భక్తజనం..

ఈ వేడుకల్లో ఆలయ ఈవో జే. భవాని శంకర్, జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్భల భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు. ఏఈఓలు గజ్వేల్ రఘు, నవీన్ కుమార్ శర్మ, పర్యవేక్షకులు మరియు సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో యాదగిరిగిరి గోవింద నామస్మరణతో మారుమోగింది.



## తపాల ఉద్యోగుల ధర్నా




ప్రజాపక్షం/కవాడీగూడ: డిమాండ్ల సాధనలో భాగంగా తపాలా ఉద్యోగులు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇందిరాపార్క్ వద్ద పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ ఆధ్వర్యంలో పోస్టుమెన్, ఎంటీఎస్ యూనియన్స్ తెలంగాణ సర్కిల్ సిబ్బంది ఆదివారం భారీ ధర్నా నిర్వహించారు. ఆందోళనలో తెలంగాణలోని వివిధ డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున పోస్టుమెన్, ఎంటీఎస్ ఉద్యోగులు పాల్గొని, సిబ్బంది సంక్షేమం, సేవా పరిస్థితులకు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ధర్నాలో తెలంగాణ సర్కిల్ పీజేసీఏ నాయకులు మధుసూదన్‌రావు, ఎం.కృష్ణ, ఎస్‌కే దాల్మియా, మొహమ్మద్, అశోక్, వెంకటయ్య, ప్రసాదు, శ్రీకాంత్, రవూఫ్, శ్రీనివాసచారి, శ్రవణ్ కుమార్, వెంకన్న, కిషోర్, బండి జయరాజు,వెంకటేశ్వరరావు, కిషన్‌తో పాటు తపాల శాఖలోని ఇతర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శుభకార్యాల్లో మన్నె గోవర్ధన్‌రెడ్డి



ప్రజాపక్షం/బంజారాహిల్స్: వివిధ శుభకార్యాల్లో బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు బంజారాహిల్స్ డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీ వాసులు పూజారి మల్లేష్, మల్లిక దంపతుల ప్రథమ పుత్రిక నిఖితనరేష్ వివాహ వేడుకలో ఆయన పాల్గొన్నారు. అంతే కాకుండా వివిధ శుభకార్యక్రమాల్లో ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆహ్వానం



ప్రజాపక్షం/కంటోన్మెంట్: దేవాలయ విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు అందించడం జరిగింది. వెస్ట్‌మారేడ్ పల్లిలోని భక్త హనుమాన్ ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలు, నవగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆలయ కమిటీ సభ్యులు పిట్ల నగేష్ ముదిరాజ్, ప్రవీణ్, సునీల్, సంజయ్, వీరన్న తదితరులు కలిసి ఆహ్వానించారు.

## వివాహ వేడుకల్లో కవిత



ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: వివాహ వేడుకల్లో తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ మేరకు ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఐశ్వర్య వివాహం శ్రీకర్‌తో జరిగింది. ఈ క్రమంలోనే వివాహ వేడుకలో కవిత పాల్గొనడంతో ప్రజలు ఆమెను ఆప్యాయంగా పలకరించడం కనిపించింది.

## భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్ విందు



ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: కందికల్ ప్రాంతం నర్కి పూల్‌బాగ్‌లో మాజీ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటయ్యింది. ఈ ఇఫ్తార్ విందులో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ పాలొన్నారు. ఇదిలా ఉండగా... హఫీజ్‌బాబానగర్‌లో చాంద్రాయణగుట్ట కార్పొరేటర్ అబ్దుల్ వహాబ్ ఏర్పాటు చేసిన దావతే ఏ ఇఫ్తార్‌కు విందుకు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ విచ్చేశారు.

## సత్వర విద్యుత్ సేవలకు వాట్సాప్ 8712441912 నంబర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) తన వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది. వినియోగదారులు విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీతెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయి అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చాన్నారు. ఈ సేవ ద్వారా వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యుత్‌కు సంబంధించిన సమాచారాన్ని వేగంగా పొందగల్గుతారని తెలిపారు. ప్రతి వినియోగదారుడు ఈ నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవాల్సిందిగా కోరారు.

## బిజెపి నేతల నిరసన

ప్రజాపక్షం/ఖైరతాబాద్: తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అరెస్టును ఖండిస్తూ హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద బిజెపి నేతలు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రతిపక్షల నేతల అరెస్ట్ అక్రమం అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపులను వెంటనే నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు.

# చిన్నారి మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర గ్రామంలోని మల్లన్న దేవస్థానం వద్ద గొడవ కారణంగా మూడేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటనలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజా సంఘాలు ఆదివారం నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగాయి. వీరికి మద్దతుగా ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలతో రోడ్డుపై బైఠాయించారు. సంఘటనపై స్పందించిన పలు సంఘాలు రెండు రోజుల నుంచి ఆందోళన బాట పట్టగా ఆదివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, వివిధ ప్రజా సంఘాలు డిఎస్‌పిని కలిశారు. కొట్టిన అగ్రవర్ణాలపై కాకుండా బాధితులపై కేసు నమోదు చేయడాన్ని నిలదీశారు. పాప మృతికి కారకులపై హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతమంది అగ్రవర్ణాలు కలిసి గణేష్‌ను చితకబాదిన వారిపై కేసు నమోదు చేయకపోవడం అగ్రవర్ణాలవారికి వత్తాసు పలకడమేనన్నారు. తక్షణమే మృతి చెందిన మూడునెలల పాప తల్లి మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి రెండురోజుల్లో సంఘటనకు బాధ్యులపై కేసు నమోదు చేస్తామని డిఎస్‌పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చినా సంతృప్తి చెందని నాయకులు అక్కడే పోలీస్‌స్టేషన్ ముందు రాస్తారోకో చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించబోమని ఖరాఖండిగా చెప్పారు. బాధ్యులైన ఎనిమిది మందిని అరెస్టు చేయాలని, పాప మృతికి కారకులైన వారిపై హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో అనంతరం కుమ్మెర గ్రామానికి బయలుదేరి వెళ్లారు. బిసి ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు అంబేద్కర్ చౌరస్తాలో బాధితులను పరామర్శించారు. గ్రామంలో వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబాద్ సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, రామయ్య, బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు రాంచందర్, పృథ్వీరాజ్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ్మా, టిఆర్ఎస్, సిపిఎం, బిఎస్‌పి కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని నిరసన నిర్వహించారు.

# ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ సొంతింటి కల సాకారం



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు హాజరై నూతన వస్త్రాలు అందజేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ప్రజాపక్షం/అడ్డాకుల: నిరుపేదల కుటుంబాల ఆర్థిక స్తోమత సరిగ్గా లేక సొంత ఇల్లు నిర్మించుకోలేక కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో నానా అవస్థలు పడుతున్న నిరుపేదల సొంతింటి కల నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సహకారం అవుతుందని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాడు వనపర్తి నియోజకవర్గం అడ్డాకుల మండల పరిధిలోని కన్మనూర్ గ్రామానికి చెందిన నంది మహేశ్వరి రమేష్ ఆస్కాని సత్యమ్మ కృష్ణయ్య ఆస్కాని లక్ష్మ మ్మ చంద్రయ్య నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి హాజరై దంపతులకు నూతన వస్త్రాల అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి నేడు మా ఇంటి పెద్దన్నల చీర సారే అందిస్తున్న మిమ్మల్ని మీ ప్రభుత్వాన్ని భగవంతుడు ఎల్లప్పుడూ చల్లగా చూడాలని హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బలీదుపల్లి గ్రామానికి చెందిన కరున మన్యం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై నూతన వస్త్రాలు అందించారు అదే గ్రామానికి చెందిన వంకని లక్ష్మీ చెన్నయ్య ఇంద్రమ్మ ఇంటికి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్ద మునుగల్ చెడు గ్రామానికి చెందిన చుక్క చెన్నయ్య బాలయ్య ఇందిరమ్మ దామోదర్‌రెడ్డి ఇంటిగృహప్రవేశాలు హాజరై ఎమ్మెలే దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిఆర్ఎస్ పాలనలో నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు నేడు కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లవేళలా అండదండగా ఉండాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, బలీదుపల్లి గ్రామ సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎర్రజమ్మని రాధా శివ, మాజీ ఎంపిటిసి వెంకట్రాంరెడ్డి, కన్మనూరు మాజీ సర్పంచ్ అగ్గిరాములు, ప్రశాంత్ కుమార్ రెడ్డి, సురేష్, శాస్త్రి, అంజల్ రెడ్డి, తిరుపతి, రెడ్డి, మన్నెపు రెడ్డి, దేవరాజు యాదవ్, అరవింద్ రెడ్డి, పెద్దమునగల చెడు గ్రామ సర్పంచ్ చిట్టిబాబు, సంజీవరెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలు అవసరం

పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రామరాజు




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: సమాజానికి అవసరమైన నూతన ఆవిష్కరణలు రావలసిన అవసరం ఉందని పాలమూరు యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డ్రీం ఫోర్స్ ఫౌండేషన్ కలాం ల్యాబ్ ఆధ్వర్యంలో జరిగిన లెవెల్ టు సైన్స్ ప్రయోగ పరీక్ష కార్యక్రమ బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ వినియోగం కోసం ఎనర్జీ ఎక్కువగా అవసరం అవుతుందని దీని కోసం సహజ వనరులు కాకుండా ప్రత్యామ్నాయ వనరుల కోసం పరిశోధనలు జరగాలన్నారు. విద్యార్థుల్లో పాఠశాల దశ నుండి ప్రయోగాత్మక బోధన మొదలవ్వాలని దీని కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నిరుపేద విద్యార్థులకు చదివే ఒక వరమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని సద్వినియోగం చేసుకుంటే గొప్ప స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు. విద్యార్థుల్లో కృషి పట్టుదల ఉంటే సమాజం గౌరవించే స్థాయికి ఎదుగువచ్చన్నారు. అవకాశాలను అందిపుచ్చుకోవాల్సింది. విద్యార్థులేనని ఆయన అన్నారు. సైన్స్ లేవల్ టు ప్రయోగ పరీక్షలు గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఫోర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టిఎన్.శ్రీధర్ కలాం ల్యాబ్ అధ్యక్షులు జనార్దన్, కార్యదర్శి నర్సప్ప ల్యాబ్ కమిటీ ప్రతినిధులు సురేఖ, శ్రావణి, అనురాధ, కలాం ల్యాబ్ మీడియా ఇంచార్జి గుముడాల చక్రవర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అండతో 16 వార్డు అభివృద్ధికి కృషి

మున్సిపల్ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని

ప్రజాపక్షం/మక్తల్: తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక డెయిరీ క్రీడా మత్స్య శాఖ మంత్రి డాక్టర వాకిటి శ్రీహరి ఆశీస్సులతో మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ ఆల్కూరి పావని తెలిపారు. డిగ్రీ చదవుతున్న పాటు తన విజయానికి అన్ని విధాలా సహకరించిన మంత్రి వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేసి, అందరి విజయానికి తోడ్పాటు అందించిన మంత్రి వాకిటి శ్రీహరి చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. మఖ్తల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన తన తండ్రి రవి కుమార్ సేవలను గుర్తించి తనకు టికెట్ ఇచ్చారని, ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి గత పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో పట్టణ అభివృద్ధి కుంటుపడిందని వార్డు కౌన్సిలర్ ఆల్కూరి పావని విమర్శించారు. 16వ వార్డులో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా తయారైందని వాపోయారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు, లేక చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు ప్రారంభించామని, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు సైతం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు అందరి సహకారంతో వార్డు అభివృద్ధికి, మఖ్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ఉత్కంఠభరితంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

ప్రీ క్వార్టర్ ఫైనల్లో అలవొక విజయంతో క్వార్టర్స్ చేరిన పేట జట్లు



ప్రజాపక్షం/మక్తల్: గత శుక్రవారం నుండి నారాయణపేట్ జిల్లా మక్తల్ పట్టణంలో నిర్వహిస్తున్న సీఎం కప్ రెండవ ఎడిషన్ రాష్ట్రస్థాయి పోటీలు చివరి అంకంకు చేరుకున్నాయి. ఆదివారం క్రీడాకారులను స్థానిక సిఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీ రెడ్డిలు పరిచయం చేసుకుని ఆటగాళ్లు ఆటలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ జట్టులో చోటు సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మంచిపేరు తీసుకొని రావాలని కోరారు. ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో నారాయణపేట పురుషులు జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి కామారెడ్డి జిల్లా టీంపై 45–33 పాయింట్లు తేడాతో విజయం సాధించి క్వార్టర్స్ ఫైనల్స్ కు దూసుకెళ్లింది. అటు నారాయణపేట్ మహిళల జట్టు సిరిసిల్ల జిల్లా టీంపై జరిగిన మ్యాచ్‌లో 42–15 పోయింట్లు భారీ తేడాతో విజయం సాధించి క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది

**క్వార్టర్ ఫైనల్ చేరిన జిల్లా జట్ల వివరాలు**

పురుషుల విభాగంలో నారాయణపేట్, హన్మకొండ, మేడ్చల్, వనపర్తి హైదరాబాద్, సంగారెడ్డి, గద్వాల రంగారెడ్డి,

**మహిళల విభాగంలో..** నారాయణపేట్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, గద్వాల జిల్లా జట్లు చేరుకున్నాయి. ఈ కార్యక్రమం జిల్లా యువజన క్రీడ అధికారి శెట్టి వెంకటేష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి నారాయణపేట్ జిల్లాలోని పిడిలు గొడుగు నర్సిములు, రత్నయ్య, బాలరాజ్ గౌడ్, వెంకటప్ప, రామకృష్ణ రెడ్డి, రాకేష్, అనంత సేన, ఊసు రవి, శ్రీధర్ గౌడ్, సాయినాథ్, మౌలాలి రాజేశ్వరి, పరంజ్యోతి, రాజశేఖర్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్, ఈశ్వర్, నరేష్, రూప, స్వరూప, రేణుక, పర్వీన్ బేగం మిగితా పిఈటిలు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి పాలనలో బహుజనులకు రక్షణ కరువు!

పసి బిడ్డ ప్రాణాలు తీసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్

ప్రజాపక్షం/ధన్వాడ : ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో బహుజనుల ప్రాణాలకు రక్షణ లేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం ధన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మూడు నెలల బిసి చాకలి బిడ్డ ప్రాణాలు బలిగొన్న ఆధిపత్య వర్గాల వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని పాలించడం రేవంత్ రెడ్డికి చేతకాకుంటే తక్షనమే నాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హోంశాఖను తన వద్దే పెట్టుకొని పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డికి రాష్ట్రంలో బహుజన కులాల వ్యక్తుల పై దాడులు, దౌర్జన్యాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారిన ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయం చేసి రక్షన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో బహుజన సమాజం ఏకమై దొరల పాలనను అంతమొందించడం ఖాయమన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం : ప్రేమ్‌కుమార్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి అనుష డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎఐఎస్ఎఫ్ 4వ మహాసభ 18నుంచి 20వరకు జరిగిన మహాసభలను ఎఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి సభ్యులుగా నాగర్‌కర్నూల్ జిల్లానుంచి ముగ్గురు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, హాస్టళ్లలో తీవ్రమైన మౌలిక వసతులకొరత నెలకొన్నదని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంవల్ల పేద విద్యార్థులు చదువు మానేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యావిధానం అమలుపేరుతో విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని విమర్శించారు.

## ఉత్తమ ఉద్యోగ పురస్కారం




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలోని తాడూరు మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న షాహిన్‌సుల్తానాకు నాగర్‌కర్నూల్ డివిజన్ ఉత్తమ ఎఎన్ఎంగా ఎంపికై ప్రశంసలు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల ఆరోగ్యసంరక్షణలో విశేష సేవలు అందిస్తున్నందుకు ఆమెకు ఈగౌరవం లభించిందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి కెజిబివి బాలికల ల్యూమినస్‌లీగ్ కేజీబివిలు ప్రేరణ కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, డిఇఓ రమేష్‌కుమార్ , కార్యాలయ నిర్వహణాధికారి చంద్రశేఖర్, జిసిడిఓ శోభారాణి, ఫైనాన్స్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి, మండల విద్యాధికారి త్యాగరాజు ఆమెకు ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారి విజయతోపాటు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలపరిధిలోని ఎల్లికట్ల గ్రామానికి చెందిన కంఠం బాల్ చెన్నయ్యకు మంజూరైన రూ.27వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఆదివారం గ్రామ సర్పంచ్ భీమయ్య, ఉపసర్పంచ్ కేశవులు, దారమోని గణేష్, రవి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, తలకొండపల్లి మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌ల సహకారంతో బాధితులకు అందజేయడం జరిగిందన్నారు.

## దివ్యాంగుడికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/పెబ్బేరు: పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం తాండ గ్రామపంచాయితీకి చెందిన లక్ష్మ ణ్ నాయక్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణం నిలిచిపోగా, తాండకు చెందిన చంద్రయ్య గోవిందు చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మానవతా దృక్పథంతో ఆయన వెంటనే స్పందించి దివ్యాంగుడైన లక్ష్మ ణ్ నాయక్ ఎమ్మెల్యే వ్యక్తిగతంగా 50 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించాడు. దీంతో లక్ష్మ ణ్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సాయం అందించడంతో గుమ్మడం తాండా, చిన్న గుమ్మడం గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల

ప్రజాపక్షం/కొత్తకోట: వివిధ వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాజీ ఎంపీ రావుల, మాజీ జెడ్పీటిసి బిఆర్ఎస్ నేతల, కొత్తకోట మండల కానాయపల్లి గ్రామానికి చెందిన పసుల మొగులయ్య కుమారుడు రాములు వివాహం, అదేవిధంగా కొత్తకోట మండల వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు మనమడు తోట్లే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరై ఆశీర్వాదించారు. వీరితో పాటు మాజీ ఎంపీపీ గుంత మౌనిక, కొత్తకోట మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర మదనాపురం మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య, కానాయపల్లి మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ కౌన్సిలర్ ఖాజా మైనోద్దీన్, జర్నలిస్ట్ ధనుష్ తో పాటు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా వనపర్తి జిల్లా కేంద్రం లోని కళ్యాణ్ సాయి గార్డెన్ లో రష్మిక వెడ్స్ అక్షయ్ వివాహ వేడుకల్లో కొత్తకోట తొలి మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుకేషిణి విశ్వశ్వర్ తో పాటు మాజీ జెడ్పిటీసీ పొగాకు విశ్వశ్వర్ న్యాటెల్లి మాజీ సర్పంచ్ లక్ష్మ ణ్ నాయక్, మాజీ కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ వేదు శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపి అధ్యక్షుల అరెస్టు దారుణం

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శాంతికుమార్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: సొంత పార్టీ ఎమ్మెల్యేలకు సంఘీభావం తెలిపేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు వెళ్లడం నేరమా? అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శాంతికుమార్ ప్రశ్నించారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విధానంలో ప్రజాప్రతినిధులకు మద్దతు తెలపడం సహజమైన చర్య కాగా, దానిని అడ్డుకోవడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆయన విమర్శించారు. బిజేపిని అణిచివేసే కుటిల ప్రయత్నాలను అధికార కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని, బిజెపి నేతలను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేసి నిర్బంధించడం హేయమైన చర్యగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యేకు మద్దతుగా సంఘీభావం తెలిపేందుకు వెళ్తే రాష్ట్ర ప్రభుత్వానికి అంత ఉలికి పాటు ఎందుకు? అని ప్రశ్నించారు. పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో నిర్బంధపు పాలనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజానీకం, ముఖ్యంగా కామారెడ్డి ప్రజలు జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

# టీమిండియాకు సఫారీలు షాక్

## 76 పరుగుల తేడాతో గెలుపొందిన దక్షిణాఫ్రికా



షాట్టి ప్రపంచకప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత జట్టుకు దక్షిణాఫ్రికా షాకిచ్చింది. ఏకపక్ష పోరులో టీమిండియాను ఒత్తిడిలో పడేసి.. 76 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇరుజట్లు ఇన్నింగ్స్ ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డాయి. కానీ, డేవిడ్ మిల్లర్(63), డెవాల్డ్ బ్రెవిస్(45)ల మెరుపులతో కోలుకున్న ప్రొటీస్ మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తీసుకుంది.. ఆపై పేసర్ల విజృంభణతో అజేయ భారత్‌కు ఓటమిని రుచి చూపించింది. భారీ ఛేదనలో టాపార్డర్ కుప్పకూలగా.. ఆపద్బాంధవుడు సూర్యకుమార్ యాదవ్(18) సైతం తేలిపోయాడు. శివం దూబే(43) ఒంటరిపోరాటం చేసినా అది సరిపోలేదు. ఐసిసి ఈవెంట్లలో ఒత్తిడికి లోనయ్యే దక్షిణాఫ్రికా పొట్టి ప్రపంచకప్‌లో మాత్రం చెలరేగిపోతోంది. గ్రూప్ డీ నుంచి టాపర్‌గా సూపర్ 8కు దూసుకొచ్చిన సఫారీ టీమ్.. తొలి మ్యాచ్‌లో ఫేవరెట్ భారత్‌ను ఓడించింది. 188 పరుగుల చేదనలో టీమిండియాను కార్బిన్ బాష్(2–12), మార్కో యాన్సెన్(4–22)లు దెబ్బకొట్టారు. తొలి ఓవర్లోనే ఓపెనర్ ఇషాన్ కిషన్(0)ను ఎడెన్ మర్క్‌రమ్ ఔట్ చేయగా.. యాన్సెన్ తొలి బంతి ఎడ్జ్ తీసుకోగా తిలక్ వర్మ(1) వికెట్ కీపర్ డికాక్ చేతికి చిక్కాడు. ఆదిలోనే రెండు వికెట్లు పడిన వేళ.. ఓపెనర్ అభిషేక్ శర్మ(15) 6, 4తో ఆశలు రేపినా.. యాన్సెన్ అతడిని బోల్తా కొట్టించాడు. 26కే వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(18), వాషింగ్టన్ సుందర్(11)లు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ, ఈ ద్వయాన్ని విడదీస్తూ సుందర్‌ను కార్బిన్ బాష్ పెవిలియన్ చేర్చాడు. రన్‌రేటు ఒత్తిడిలో గేర్ మార్చాలనుకున్న సూర్య తేఇలికైన క్యాచ్‌తో వికెట్ ఇచ్చేశాడు. దాంతో.. 51వద్ద ఐదో వికెట్ పడింది. హార్దిక్ పాండ్యా(18), శివం దూబే(43) లకుపెద్ద షాట్లు ఆడేందుకు సఫారీలు అవకాశం ఇవ్వకపోవడంతో.. బౌండరీలు కరువయ్యాయి. మహరాజ్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన పాండ్యా బౌండరీ లైన్ వద్ద స్టబ్స్ స్టన్నింగ్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. మూడో బంతికి రింకూ సింగ్ సైతం స్టబ్స్‌కు దొరికాడు. అక్కడితో భారత ఓటమి ఖాయమైంది. ఆశ్చర్యంగా.. అర్ష్‌దీప్ కూడా పాండ్యా స్టయిల్లోనే స్టబ్స్‌కు చిక్కాడు. దూబే సిక్సర్లతో పరుగుల అంతరం తగ్గించాడంతే. దూబే, బుమ్రాలు వెంటవెంటనే ఔటవ్వగా.. 76 పరుగుల తేడాతో ప్రొటీస్ జట్టు గెలుపొందింది.

## వరల్డ్ కప్‌లో గూగుల్ సిఇఒ క్రికెట్ పాఠాలు

షాట్టి ప్రపంచకప్ ఫీవర్ ప్రపంచమంతా పట్టుకుంది. నాకౌట్ మ్యాచ్‌ల వేళ.. అభిమానులే కాదు పలురంగాల దిగ్గజాలు సైతం క్రికెట్‌కు సలామ్ అంటున్నారు. ఈ జాబితాలో గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ సైతం చేరిపోయారు. అహ్మదాబాద్‌లో భారత్, దక్షిణాఫ్రికా సూపర్–8 మ్యాచ్ సందర్భంగా ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్‌తో కలిసి ప్రపంచకప్‌ను మైదానంలోని తీసుకువచ్చారు. పదో సీజన్ టి–20 ప్రపంచకప్ టోర్నీకి మాజీ ఆటగాళ్లు.. సాంకేతిక



నిపుణులు కొత్త కళ తీసుకొస్తున్నారు. భారత పర్యటనలో ఉన్న గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ తనకు ఆటపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందర్‌కు భారత కెప్టెన్ శుభమన్ గిల్ క్రికెట్ పాఠాలు నేర్పారు. 'ఫుల్ షాట్' ఎలా ఆడాలో గిల్ చూపించాడు. ఓ ఇలానా? అని గూగుల్ బాస్ ఆసక్తిగా గమనించారు. అనంతరం బ్యాట్ అందుకున్న సుందర్ ఫుల్ షాట్ ఆడి సంబురపడ్డారు. అహ్మదాబాద్ స్టేడియం చేరుకున్న సుందర్ టాస్ అనంతరం.. వరల్డ్‌కప్ ట్రోఫీతో తళుక్కుమన్నారు. భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్‌తో కలిసి ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారాయన.

## స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు..



సూపర్–8లో ఇంగ్లాండ్ బోణీ..! స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను బ్బతీయాలనుకున్న శ్రీలంక కు ఇంగ్లాండ్ పెద్ద షాకిచ్చింది. పల్లెకెల్ స్టేడియంలో విల్ జాక్స్(322) తిప్పేయగా.. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన లంక.. ఏ దశలోనూ కోలు కోలేకపోయింది. 150 పరుగుల ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా.. కెప్టెన్ దసున్ శనక(30) పోరాడినా సరిపోలేదు. తడబడుతూ సాగిన ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు ఆదిల్ రషీద్(213) తెరదించగా.. 51 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లాండ్ అదిరే బోణీ కొట్టింది. సొంతగడ్డపై చెలరేగాలనుకున్న శ్రీలంకను ఇంగ్లాండ్ స్పిన్ అస్త్రంతో పడగొట్టింది. సూపర్–8లో లంక నుంచి స్పిన్ ముప్పును ఊహించిన హ్యారీ బ్రూక్ సేన అందుకు తగ్గట్టే సన్నద్ధమైంది. కానీ.. తీరా మైదానంలోకి దిగాక ఫిల్ సాల్ట్(62) ఒక్కడే రాణించగా ప్రత్యర్థికి 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫేవరెట్ లంక పల్లెకెలె స్టేడియంలో అలవోకగా గెలుస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ, పవర్ ప్లేలోనే ఇంగ్లాండ్ విజయం దిశగా నడిచింది. డేంజరస్ ఓపెనర్ పథుమ్ నిశాంక(9)ను రెండో ఓవర్‌లోనే ఔట్ చేసి జోఫ్రా ఆర్చర్(2–20) తొలి బ్రేకివ్వగా.. అక్కడి నుంచి విల్ జాక్స్(3–22)తన స్పిన్ మ్యాజిక్ చూపించాడు. రిటర్న్ క్యాచ్‌తో కుశాల్ మెండిస్(4)ను వెనక్కి పంపిన అతడు.. పవన్ రత్ననాయకే(0), దునిత్ వెల్లలాగే(10)లను వెనక్కి పంపి ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన వెల్లలాగే.. మిడాఫ్లో షాట్కు యత్నించి బ్రూక్ చేతికి చిక్కడంతో 34కే లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది.

## ఆరోగ్యం

# మెరుగైన ఆరోగ్యానికి ఏడు రోజుల మెనూ..



లేవగానే (ప్రతి రోజు ఒకేలా)
గోరువెచ్చని నీరు – 1 గ్లాస్
5 నానబెట్టిన బాదం లేదా,
1 టీస్పూన్ నానబెట్టిన మెంతులు

**సోమవారం...**అల్పాహారం :రాగి జావ +మజ్జిగ
మధ్యాహ్నం ముందు : జామ పండు (చిన్నది)
మధ్యాహ్న భోజనం:2 జొన్న చపాతీలు
పాలకూర పప్పు, దోసకాయ సలాడ్
సాయంత్రం: గ్రీన్ టీ + ఉడికించిన శనగలు
రాత్రి: కూరగాయల సూప్ + 1 చపాతీ

**మంగళవారం...** అల్పాహారం: ఓట్స్ ఇడ్లీ + కూరగాయల చట్నీ, మధ్యాహ్నం ముందు: ఆపిల్ (చిన్నది), మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్ (చిన్న ముద్ద), సాంబార్, బెండకాయ కూర, పెరుగు (అర కప్పు), సాయంత్రం: దాల్చిన చెక్క కషాయం, రాత్రి: 2 చపాతీలు + క్యాబేజీ కూర

**బుధవారం...** అల్పాహారం: గోధుమ రవ్వ ఉప్మా (కూరగాయలతో), మధ్యాహ్నం ముందు: నారింజ పండు, మధ్యాహ్న భోజనం: 2 రాగి చపాతీలు, తోటకూర పప్పు, క్యారెట్ సలాడ్, సాయంత్రం: గ్రీన్ టీ + పల్లీలు (చిన్న ముద్ద), రాత్రి: కూరగాయల స్ట్యూ / సూప్

**గురువారం...** అల్పాహారం: ఓట్స్ దోస + సాంబార్, మధ్యాహ్నం ముందు: పియర్ పండు, మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్ (చిన్న ముద్ద), మునగాకు పప్పు, సొరకాయ కూర, సాయంత్రం: ఉడికిన కార్న్ (చిన్న కప్పు), రాత్రి: 1–2 చపాతీలు + బీరకాయ కూర

**శుక్రవారం...** అల్పాహారం: బెసన్ వెజ్ చిల్లా, మధ్యాహ్నం ముందు: జామ పండు, మధ్యాహ్న భోజనం: 2 జొన్న చపాతీలు, సాంబార్, బెండకాయ కూర, పెరుగు (అర కప్పు), సాయంత్రం: గ్రీన్ టీ, రాత్రి: కూరగాయల సూప్


**శనివారం...** అల్పాహారం: రాగి దోసె + కూరగాయల చట్నీ, మధ్యాహ్నం ముందు: ఆపిల్ (అరటి వద్దు), మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్ (చిన్న ముద్ద), పాలకూర, సాంబార్, క్యాబేజీ కూర, సాయంత్రం: ఉడికిన శనగలు, రాత్రి: 2 చపాతీలు + తోటకూర కూర

**ఆదివారం...**అల్పాహారం: వెజిటబుల్ ఓట్స్ ఉప్మా, మధ్యాహ్నం ముందు: నారింజ పండు, మధ్యాహ్న భోజనం: 2 రాగి చపాతీలు, మునగాకు పప్పు, దోసకాయ సలాడ్, సాయంత్రం: గ్రీన్ టీ, రాత్రి: లేత పాలు (అర గ్లాస్) + కూరగాయల సూప్

**ముఖ్యమైన నియమాలు...**
ఉప్పు చాలా తక్కువ
నూనె రోజుకు 2–3 టీ స్పూన్లు మించకూడదు
భోజనం సమయాలు మారకూడదు
రాత్రి భోజనం 7:30 లోపు
చక్కెర, తీపి, వేయించినవి పూర్తిగా వద్దు.

## అరుదైన వ్యాధులపై ప్రయోగాలకు బయోబ్యాంక్


ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వైద్య, పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు కలిసి లైసోసోమల్ స్టోరేజ్ డిసార్డర్స్ (ఎల్ఎస్‌డి) అనే అరుదైన జన్యు వ్యాధుల ఉపవ



ర్గానికి సంబంధించిన దేశంలోని తొలి ప్రభుత్వ ఆధారిత జాతీయ బయోబ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఇది అరుదైన రోగాల పరిశోధన, నిర్ధారణ, జన్యు విశ్లేషణ, భవిష్యత్ చికిత్సా వ్యూహాల అభివృద్ధికి కీలక వేదికగా ఉపయోగపడుతుంది. బయో బ్యాంక్‌లో రోగుల నుండి సేకరించిన జీవ నమూనాలు, జన్యు సమాచార డేటా, క్లినికల్ వివరాలను భద్రపరుస్తారు. జాతీయ బయోబ్యాంక్ స్థాపన భవిష్యత్‌లో మరింత సమర్థవంతమైన చికిత్సల అభివృద్ధికి దోహదపడే అవకాశముంది.

## యాంటీబయాటిక్స్‌కు ప్రత్యామ్నాయం!

కోరం సెన్సింగ్ అనేది బ్యాక్టీరియా మధ్య జరిగే రసాయన సంకేతాల ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థ. జనాభా సాంద్రత పెరిగే కొద్దీ, బ్యాక్టీరియా ప్రత్యేక సంకేత మాలిక్యూల్స్‌ను విడుదల చేసి పరస్పరం సమాచారాన్ని పంచుకుంటాయి. ఈ ప్రక్రియ ద్వారా వారు తమ జీన్ల వ్యక్తీకరణను సమన్వయం చేసుకుంటారు. ఇటీవలి పరిశోధనలు ఈ వ్యవస్థపై దృష్టి సారించి, యాంటీబయాటిక్స్‌కు ప్రత్యామ్నాయంగా యాంటీకోరం సెన్సింగ్ థెరపీలను అభివృద్ధి చేసే అవకాశాన్ని సూచిస్తున్నాయి. ఇది భవిష్యత్ వైద్య రంగంలో కీలక మార్పుకు దారి తీయవచ్చు. కోరం సెన్సింగ్ వ్యవస్థలో ప్రధాన భాగాలు మూడు: బ్యాక్టీరియా సమూహం, సంకేత మాలిక్యూల్స్, ప్రవర్తనా జీన్లు. బ్యాక్టీరియా విడుదల చేసే ఆటోఇండ్యూసర్లు వాతావరణంలో క్రమంగా పెరుగుతాయి. ఒక నిర్దిష్ట పరిమితి చేరుకున్న తర్వాత, అదే బ్యాక్టీరియా ఈ సంకేతాలను గుర్తించి ప్రతిస్పందన జీన్లను సక్రియం చేస్తాయి. ఫలితంగా వైరులెన్స్ (రోగ కారక శక్తి), బయోఫిల్మ్ నిర్మాణం, హారిజాంటల్ జీన్ ట్రాన్స్‌ఫర్, కంపిటెన్స్ (డిఎన్ఎ స్వీక



రణ సామర్థ్యం) వంటి సమూహ ప్రవర్తనలు ప్రారంభమవుతాయి. ఈ ప్రక్రియలు తగిన జనాభా పరిమాణం ఉన్నప్పుడు మాత్రమే సమర్థవంతంగా పనిచేస్తాయి, అందుకే కోరం సెన్సింగ్ సూక్ష్మ జీవుల్లో సమన్వయానికి కీలక మెకానిజం. ఈ భావనను మొదట 1960ల మధ్యలో హంగేరియన్ మూలాలున్న సూక్ష్మ జీవ శాస్త్రవేత్త అలెగ్జాండర్ టొమాజ్ పరిశీలించాడు. ఆయన 'స్ట్రెప్టోకాకస్ న్యుమోనియా' (గతంలో న్యుమోకొకస్‌గా పిలిచేవారు) బ్యాక్టీరియాలో డిఎన్ఎ స్వీకరణ సామర్థ్యంపై చేసిన అధ్యయనాల్లో ఈ కమ్యూనికేషన్ లక్షణాన్ని గుర్తించారు. దీనివల్ల ఔషధ నిరోధకత సమస్యను తగ్గించే అవకాశం ఉంది. అందువల్ల, కోరం సెన్సింగ్‌పై పరిశోధనలు వైద్యరంగంలో కొత్త చికిత్సా మార్గాలను ఆవిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నాయి.

# చెట్టుపట్టాల సమస్యపై శాసనమండలిలో ప్రస్తావిస్తా

సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు సరికావు
ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ** : గ్రామీణ పేద రైతుల చెట్టుపట్టాల సమస్యను శాసనమండలిలో ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హామీ ఇచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఖుదాబక్ష్‌పల్లి సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో గత 6070 సంవత్సరాలుగా చెట్ల నుంచి ఫలాలను సేకరించి జీవనోపాధి పొందుతున్న పేద రైతులకు ఇప్పటికీ చెట్టుపట్టాలు లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి తక్షణమే చెట్టుపట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామంలో గతంలో అనేక పోరాటాలు జరిగాయ ని, ఆ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం మరోసారి సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. పేద వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు పేదల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపే విధంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మొండి బకాయిల పేరుతో బ్యాంకుల నుంచి కార్పొరేట్ సంస్థలు పొందిన లక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు సుప్రీంకోర్టు ఎందు కు స్పందించలేదన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ల కు మద్దతుగా వ్యవహరించిన సందర్భాల్లో న్యాయస్థానాలు స్పందించలేదని, పేదల సంక్షేమ పథకాల విషయంలో మాత్రం వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ఉపాధి లేనప్పుడు ప్రభుత్వాలు తప్పనిసరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆ పథకాలు లేకపోతే వారి జీవనం కష్టసాధ్యమవుతుందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, కార్పొరేట్లకు దోచిపెడుతున్న సంపదపై అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పోరాటాల ఫలితంగా వేల ఎకరాల భూమి పేదలకు అందిందని గుర్తుచేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల భిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,గ్రామ శాఖ కార్యదర్శి మేదరి యాదయ్య,పొట్ట అశోక్, గిరి ముత్తయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి సహకారం



సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**ప్రజాపక్షం /మంచిర్యాల** : మంచిర్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్లు చొరవ చూపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. మంచిర్యాల నగర మేయర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ చల్ల రమ్య మహేష్ లను ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ చాంబర్‌లో నూతన కార్యవర్గానికి సిపిఐ జిల్లా నాయకత్వం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరా వంటి ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారంపై మేయర్, డిప్యూటీ మేయర్లు చిత్తశుద్ధితో దృష్టి సారించాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సాగే అభివృద్ధి పనులకు సిపిఐ పక్షాన తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, జిల్లా సమితి సభ్యులు ఎస్.కె బాజీ సైదా, పూజారి రామన్న, కొనిగంటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి జాతర ఘటన దుర్మార్గం

## ఎఐఎస్‌ఎఫ్ ఖండన

**ప్రజాపక్షం/హనుమకొండ** : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మరి జాతరలో జరిగిన చిన్నారి మృతి ఘటన రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం అని, అదేవిధంగా, చిన్నారులు, మహిళల పట్ల అవమానకరంగా, అశ్లీలంగా ప్రవర్తించిన ఘటనలను ఎఐఎస్‌ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని హనుమకొండ జిల్లా సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్ తెలిపారు. జాతర వంటి సాంప్రదాయ, సామాజిక వేడుకల్లో ప్రజల భద్రతకు సరైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని, ఒకవైపు చిన్నారి మృతి చెందడం, మరోవైపు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా జరిగిన చర్యలు సమాజంలో పెరుగుతున్న వికృత మనస్తత్వానికి ప్రతిబింబం అని తెలిపారు. మహిళలపై వేధింపులు, అగౌరవకర ప్రవర్తన ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరానివన్నారు. ప్రజా వేడుకల్లో భద్రతా లోపాలు, పర్యవేక్షణ లోపాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని బాధ్యులపై కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చిన్నారి మృతి పట్ల ఎఐఎస్‌ఎఫ్ హృదయపూర్వక సంతాపాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోందన్నారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కట్టుదిట్టంగా అమలు చేయాలని, జాతరలు, ప్రజా వేడుకల సందర్భంగా తగిన భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాజంలో మహిళల పట్ల గౌరవభావం పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.



## ఏజెన్సీ విధానం రద్దుచేసి

# కార్పొరేషన్ ద్వారా వేతనాలివ్వాలి




వరంగల్‌లో 28న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర మహాసభ
యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ** : ఈనెల 28వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో పల్లా దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంవత్సరాలుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న కార్మికులను ఇప్పటికీ పర్మినెంట్ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా అరకొర వేతనాలతో ఏజెన్సీల శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించిన కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీం కోర్టు తీర్పు అమలులోకి రాకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ విధానం రద్దుచేసి, కార్పొరేషన్ ద్వారా నేరుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న కార్మికులకు జీతభత్యాలు చెల్లించే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత టెండర్లను కొనసాగిస్తూ తక్కువ జీతాలతో పని చేయించడం తక్షణమే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్‌లో జరిగే భారీ ప్రదర్శన, కార్మిక సభకు మెడికల్ కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి విశ్వనాథులు, లెనిన్, యూనియన్ నాయకులు ఎం.యాదగిరి, సిహెచ్.నిర్మల, పి.ఎల్లమ్మ, పద్మ, ఏ.రామేశ్వరమ్మ, అన్నపు లింగస్వామి, సందీప్, మధు, సబిత,కే.నిర్మల,ఉషమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మ మరణం సిపిఐకి తీరని లోటు

నివాళులర్పించిన బాగం, దండి, మౌలానా, కర్నాటి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి** : ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు సతీమణి కనకబండి సీతమ్మ(80) శనివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రవేట్ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆదివారం తమ స్వగ్రామం భైరవునిపల్లిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ తదితరులు సీతమ్మపార్థివదేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు, దండి సురేష్ మాట్లాడుతూ సీతమ్మ పార్టీ కార్యక్రమాల్లో పలు సూచనలు చేసేదని, ఆమె మరణం సిపిఐకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వరరావు, గుండపనేని హరినాథ్, గుండపనేని చలపతిరావు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, కర్నాటి నళినిరాణి, బాగం నరసింహారావు, పాల్తియ శ్రీనివాసరావు, పాలపాటి అశోక్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, ఆలేటి ఉమామహేశ్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపుసల సీతారాములు, గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లిబాబు, కూరాకుల నాగభూషణం, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, నల్లని మల్లికార్జునరావు, వల్లాల రాధాకృష్ణ, కె.వి.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, యడ్ల తిరుపతిరావు, పాగర్తి సుధాకర్ ఉన్నారు.



## సాంకేతికతపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి : ప్రొ.రవీందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాస్త్ర సాంకేతికతపై విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు కృషి చేయాలని అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి సూచించారు. ఢిల్లీలో నిర్వహిస్తున్న అంతర్జాయతీ సెమినార్‌లో విద్యలో సాంకేతిక ప్రభావాన్ని, దాన్ని ప్రయోజనాలను సూచిస్తూ తన పరిశోధన పత్రాన్ని అంధించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఎక్కువగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని, అప్పుడే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : చైర్మన్ బసవేశ్వర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప తెలిపారు. ఆదివారం పట్టణంలో బీసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప ఆధ్వర్యంలో చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్‌లతోపాటు కౌన్సిలర్లు విశాల విశ్వం, రాజునాయక్, చాకలి పెంటయ్య, శిరీష అనిల్, సాధిక్, జమాల్పూర్ సంతోషి బాయి చందులాల్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసి జనసేన నియోజకవర్గ అధ్యక్షురాలు జక్కుల జలజ నాగరాజు, నితీష్, మేకల వెంకటేష్, జమాల్పూర్ చందులాల్, గడ్డమీది రమేష్, అగ్గనూరు నందు, జూపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**షాద్‌నగర్ గ్రేడ్-..1శాఖ గ్రంథాలయంలో..** చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు సింగపాగ శిరీష అనిల్, చాకలి పెంటయ్యలను గ్రంథాలయ పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ చైర్మన్ కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మెన్ నక్క బాల్‌రాజ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి క్యూసెట్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్, ఆర్గనైజన్, మీడియా సెక్రెటరీ అల్వాల దర్శన్ గౌడ్, ట్రెజరర్ నీళ్ల రవీందర్ గౌడ్, జాయింగ్ ట్రెజరర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సస్య సంరక్షణ చర్యలు పాటిస్తే పంట దిగుబడులు : ఎంఇఓ

**ప్రజాపక్షం/షాబాద్:** రైతులు సస్య సంరక్షణ పద్ధతులు పాటిస్తే పంట అధిక దిగుబడి సాధ్యమవుతుందని షాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారి డిజ విజయచంద్రం అన్నారు. ఆదివారం షాబాద్‌లో రైతులు సాగుచేసిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో విజయచంద్రం మాట్లాడుతూ రైతులు షాబాద్ మండలంలో అధిక సంఖ్యలో వరి పంటలు సాటు చేస్తున్నట్లు వివరించారు.

## మొద్దు లచ్చిరెడ్డికి సత్కార సభ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బియన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపద్మావతి బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ అభివృద్ధికి కృషి చేసిన తాజా, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కార సభ నిర్వహించి వారిని శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రదాన కార్యదర్శి కిషన్, సుభాస్, కిరణ్, ప్రసాద్, శ్రీకాంత్, నరేష్, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులు అధైర్య పడొద్దు..

**ప్రజాపక్షం/కేశంపేట:** మొక్కజొన్న రైతులు అధైర్య పడొద్దని, త్వరలోనే పెండింగ్ బిల్లులు పూర్తిస్థాయిలో అన్నదాతల ఖాతాలోకి వస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలో సుమారు 1400మంది రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా మార్క్‌ఫెడ్‌కు మొక్కజొన్నలు విక్రయించడం జరిగిందని తెలిపారు. మండలంలో 561మంది రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా డబ్బులు రావాల్సి ఉందని, త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు వస్తాయని, ఏ రైతు కూడా అధైర్య పడొద్దన్నారు

## ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఉన్న రైతు వేదిక ఆవరణలోఆదివారం బెల్ స్టార్ మైక్రో ఫైనాన్స్ వారి సహకారంతో హ్యాండ్ ఇన్ ఆండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డిలతో కలిసి సర్పంచ్ సులోచన శ్రీను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వార్డు సభ్యులు వడాల శ్రీకాంత్‌రెడ్డి, బైండ్ల పెంటయ్య, ఎండి బాసిద్, బ్యాగరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడికి నోటిసులు జారీ చేసిన పోలీసులు

**ప్రజాక్షం/ఇబ్రహీంపట్నం :** మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి, ఆయన కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డిలకు పలు సెక్షన్ల కింద ఆదివారం నోటిసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్‌లో 19వ వార్డు సభ్యుడు ఆకుల యాదగిరిని మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడు కిడ్నాప్ చేసి మొబైల్ ఫోన్, కౌన్సిలర్‌గా గెలిచిన ధృవత్రాలను తీసుకోని మానసికంగా చిత్రహింసలకు గురి చేశారని ఆకుల యాదగిరి భార్య, కుమారుడు రాష్ట్ర హైకోర్టులో కేసు వేయటంతో కోర్టు ఆదేశాల మేరకు విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడిపై పలు సేక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కిడ్నాప్ సంఘటనపై వివరణ ఇవ్వకుంటే న్యాయస్థానం ఆదేశాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు

# అర్హత లేకున్నా వైద్యం - అరచేతిలో ప్రాణం

**హైదరాబాద్ జిల్లాలోనే దాదాపు 2500 రిజిస్టర్ కాని వైద్యులు**

**ఆడిట్‌లో బహిర్గతం... కలెక్టర్ హరిచందన ఆదేశాల మేరకు జరిగిన ఆడిట్**

**ఎఫ్ఎంజి ఉత్తీర్ణులు కాకున్నా.. వారు డాక్టర్లే.. హైదరాబాద్‌లో ఇదీ.. పరిస్థితి**

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** రాష్ట్రంలోని వివిధ నర్సింగ్ హోంలు, ఆసుపత్రులు, క్లీనిక్‌లలో మొత్తం 45వేల మంది వైద్యులు పని చేస్తున్నారు. వీరిలో ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 18వేల మంది వైద్యులు పనిచేస్తున్నారు. అంటే వైద్యం అందించడంలో హైదరాబాద్‌ది ఎంతటి కీలక పాత్రనో అర్థం అవుతోంది. అటువంటిది ఇక్కడే వైద్యం పక్కదారి పడితే అది ఎంతటి అనర్థాలకు దారితీస్తుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి హైదరాబాద్ జిల్లాలో ఉన్న దాదాపు 4వేల ఆసుపత్రుల పరిస్థితిపై సర్వే చేయాలని వైద్యారోగ్యశాఖాధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సర్వేలో వెలుగు చూసిన వివరాల ప్రకారమే జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో రిజిస్టర్ కాని వైద్యులు ఇంత పెద్ద సంఖ్యలో ఉన్నారన్న నిజం వెలుగు చూసింది. మన రాష్ట్రం లోని అన్ని ప్రాంతాల నుండే కాకుండా మన దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి అత్యంత క్లిష్టమైన వైద్యం చేయించుకోవడానికి ఇక్కడికి వస్తారు. కొన ఊపిరితో వచ్చినా సరే వారికి ఆయువు పోసి పంపిస్తాయి ఇక్కడి ఆసుపత్రులు అన్న నమ్మకం అందరిది. అలాంటిది ఇక్కడ ఇదీ పరిస్థితి అంటే రోగుల ప్రాణాలు ఎంతటి ముప్పు ఉందో అర్థం అవుతోంది. వైద్యం అందక ప్రాణం పోయింది, ఒక మందుకు మరో మందు వాడి చనిపోయారు, వ్యాధి నిర్ధాణ సరిగా చేయక ఒక రోగానికి అందించాల్సిన చికిత్స మరో దానికి సంబంధించింది ఇవ్వడంతో ప్రాణం పోయింది అనే సంఘటనలు చూస్తున్నాం. వీటికి ఇలాంటి డాక్టర్లే కారణం అనక తప్పదు. చిన్నా, మధ్య తరహా ఆసుపత్రులోనే కాకుండా అనేక శాఖలతో దేశంలోని వివిధ ప్రాంతాలలో వెలసిన కార్పొరేట్, పెద్దాసుపత్రులతో పాటు మంచి పేరున్న ప్రత్యేక వైద్యనిపుణుల హాస్పిటల్స్, పెద్ద పెద్ద నర్సింగ్‌హోంలలోనే ఇలాంటివి జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో వైద్యారోగ్యశాఖాధికారులు బస్తీలు, చిన్న క్లీనిక్‌లలో తనిఖీలు చేసి పెద్ద సంఖ్యలోనే నకిలీ వైద్యులను పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. వీరిలో ఎంబిబిఎస్ చదవని వారు,ఆసుపత్రుల్లో పనిచేసిన అనుభవం ఉన్న కంపౌండర్లు ఉన్నారు. వీరితో పాటు టిఎంసి రెనివల్ చేసుకోని వారు కూడా ఉన్నారు. అరంతరం టిఎంసిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారా, వైద్య విద్యకు సంబంధించిన అన్ని అర్హత గల ధృవీకరణ




పత్రాలు ఉన్నాయా లేవా చూసుకోవాలని, లేకుంటే సరిదిద్దుకోవాలని పెద్దాసుపత్రులకు వైద్యారోగ్యశాఖాధికారులు సూచించారు. కాని వాటిని తనిఖీ చేయకుండా, అర్హత లేని డాక్టర్లను గుర్తించి వారిపై, వారిని నియమించుకున్న కార్పొరేట్,ఇతర నర్సింగ్ హోంలు, పెద్దాసుపత్రులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేసారు. అయితే వీటిలోనే దారుణాలు జరుగుతున్నాయి. మంచి పేరున్న కొన్ని మినహా దాదాపు అన్ని ఆసుపత్రుల్లో ఈతరహా డాక్టర్లను నియమించుకుంటున్నాయి.

ప్రమాదకరమైర రీతిలో వైద్యసేవలుః మొదటిది ఆలోపతి వైద్యమే తెలియని ఆయుర్వేదం, హోమియోపతి చదివిన వారితో ఆలోపతి వైద్యసేవలు చేయిస్తున్నారు. ఇది చాలా ప్రమాదం. గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అన్నట్టు. ఇది కొన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో కొనసాగుతోంది. రెండవది ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్ తదితర విదేశాల్లో ఎంబిబిఎస్ చదివి ఇక్కడికి వచ్చిన వారు మన దేశంలో ఎఫ్ఎంజిఇ(ఫారన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్) రాసి అందులో ఉత్తీర్ణులు అయితేనే వారిని ఎంబిబిఎస్ పట్టాను గుర్తిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యాక మన ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిన ఆసుపత్రులలో ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. ఆతర్వాతనే వారికి టిఎంసి( తెలంగాణ మెడికల్ కౌన్సిల్)లో రిజిస్టర్ అయి వైద్యం చేయడానికి అర్హులు అవుతారు. ఎఫ్ఎంజిఇ ఉత్తీర్ణులు కాని వారినే ఆసుపత్రుల్లో డ్యూటి డాక్టర్లుగా నియమించుకుంటున్నాయి.

**ఇదీ... కారణం ...** ఎంత సంపాదించినా తృప్తి చెందక కాసులకు కక్కుర్తి పడడమే అసలు కారణం. మన దగ్గర ఎంబిబిఎస్ పూర్తి చేసి, ఇంటర్న్‌షిప్ చేసి టిఎంసిలో రిజిస్టర్ అయిన వారు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఆ ఆసుపత్రిలో ఉన్న పనిని బట్టి డిమాండ్ చేస్తారు . అంతకు తక్కువకు ఒప్పుకోరు. ఇంత వేతనం ఇచ్చే ఆసుపత్రులు కూడా హైదరాబాద్‌లో కొన్ని ఉన్నాయి. ఆయుర్వేదం, హోమియోపతి చేసిన వారైతు రూ.20 వేల నుంచి 25వేలకే ఉద్యోగం చేస్తారు. కారణం వారికి బయట ఎక్కువ అవకాశాలు ఉండవు. విదేశాల్లో చదివి ఎఫ్ఎంజిఇ పరీక్ష ఉత్తీర్ణత కాని వారు వైద్యం చేయడానికే అనర్హులు కాబట్టి వారు ఎంత ఇచ్చినా ఒప్పుకుని పని చేసుకుంటూ ఎఫ్ఎంజిఇ పరీక్ష కోసం ప్రిపేర్ అవుతారు. ఇంకా అనర్థాలు జరగక ముందే అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## కామ్రేడ్ అని పిలిపించుకోవడమే ఇష్టం

**తెలంగాణ సాంస్కృతిక సలహాదారు పల్లె నర్సింహ**

**ప్రజాపక్షం/ముషీరాబాద్ :** తెలంగాణ సాంస్కృతిక సలహాదారు అనిపించుకోవడం కంటే... కామ్రేడ్ అనిపించుకోవడమే తనకు ఇష్టమని పల్లె నర్సింహ పేర్కొన్నారు. తెలంగాణ సాహితీ దశాబ్ది వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... సాహితీ దశాబ్ది వేడుకల్లో పాల్గొని ప్రజా ఉద్యమ గీతాలు పాడటం ఎంతో స్ఫూర్తి అన్నారు. ప్రజా చైతన్య గీతాలు మరిన్ని రావాల్సి ఉందని పేర్కొన్నారు. రచయితలు మంచి పాటలు రాస్తే ప్రజా కళాకారులు ప్రజా చైతన్యానికి కృషి చేస్తారని.. కవులు, గాయకులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గద్దర్, గోరటి వెంకన్న, నందిని సిధారెడ్డి ..రాసిన పాటలు, త్యాగాలు చేసిన ఉద్యమకారుల పాటలు పాడటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందన్నారు. సదస్సులో పాటల ఫిరంగి పల్లె నర్సింహ అని వక్తలు కొనియాడారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న స్పందిస్తూ పల్లెనర్సింహ గొంతులో తన పాట ఒదిగి.. పాటరాసిన తనకు కీర్తి వచ్చిందని అన్నారు.

## స్పోర్ట్స్ కార్ బీభత్సం..పలువురికి గాయాలు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** లగ్జరీ స్పోర్ట్స్‌కార్ బీభత్సం సృష్టించింది. ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం:45లో సినీ నటుడు బాలకృష్ణ నివాసం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న కార్లు, బైకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదం కారణంగా పలు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం:45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి రోడ్ నెం: 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అదేవిధంగా కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం:45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫికును దారి మళ్లించారు. కాగా ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండలం లక్ష్మీ దేవిపల్లి గ్రామంలో నూతనంగా శ్రీగణపతి, శ్రీఅభయ ఆంజనేయస్వామి, శివాలయం, రామాలయం, నవగ్రహ, ధ్వజస్తంభ, నాగదేవత, నాభిశిలా బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవానికి నందారం అశోక్ యాదవ్ రూ.1.30 లక్షల విరాళం అందజేశారు. ప్రతిష్ట మహోత్సవ ఏర్పాట్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వాహణకు బలమైన తోడ్పాటుగా నిలుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ఆధ్యాత్మిక అభివృద్ధిలో భాగంగా ముందు కు వచ్చి పెద్ద ఎత్తున విరాళం అందించడం అభినందనీయమన్నారు. దేవాలయ సేవ అంటే దైవ సేవ అనే భావనతో చేసిన ఈ సహాయం గ్రామ చరిత్రలో చిరస్మరణీయంగా ఉంటుందన్నారు. ఆలయ కమిటి సభ్యులు నందారం అశోక్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## గిరిజన జాతి ఔనత్యాన్ని చాటిన మహనీయుడు సేవాలాల్



**ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

**ఘనంగా మహారాజ్ జయంతి ఉత్సవాలు**

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను ఆదివారం బియన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సేవా థళ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకోటి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నైవేద్యంతో భోగ్ బండార్ నిర్వహించి, సేవాలాల్ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భోగ్ బండార్ కార్యక్రమం ముందు సేవాలాల్ చిత్రపటంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని వనస్థలిపురం పోలీసులు ఎస్ఐ జె.రవినాయక్ పర్యవేక్షించారు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గిరిజన జాతీ యొక్క ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మహనీయుడు సంత్ సేవాలాల్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ విగ్రహంను మద్దిమడుగులో ఏర్పాటు చేయడానికి 20 ఎకరాల స్థలంను కేటాయించడం జరిగిందన్నారు. ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం బంజార హిల్స్‌లో బంజార భవనం నిర్మించి గిరిజనులకు ప్రత్యేక స్థానం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో గిరిజన ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం ఏర్పాటుకు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, ముద్దగోని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్‌గౌడ్, విద్యారెడ్డి, గిరిజన నాయకులు ఆంగోతు రాంబాబు నాయక్, రవికుమార్ నాయక్, చందు నాయక్, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, మధావరం నర్సింహారావు, మనోజ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమష్టి కృషితో కాలనీలు అభివృద్ధి



**చల్లా నర్సింహారెడ్డి**

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సమష్టి కృషితోనే కాలనీల అభివృద్ధి, భద్రత, మౌలిక వసతుల కల్పన సాధ్యమని రాష్ట్ర అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీహిల్స్ కాలనీ ఆర్చీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో పచ్చదనం కోసం మొక్కలు నాటడం, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర పారిశుధ్య పనులు, స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీవాసులకు చల్లా నరసింహారెడ్డి సూచించారు. కార్యక్రమంలో మీర్పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, జనరల్ సెక్రటరీ శామ్ రావు, నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ లీడర్ మల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి

**ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి**



**ప్రజాపక్షం/కొత్తూరు:** బండ మల్లన్న స్వామి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో సర్పంచ్ మోత్కురు హన్మంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన శ్రీ బండ మల్లన్న స్వామి కళ్యాణోత్సవానికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిపల్లి గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మొదళ్ళగూడ సర్పంచ్ అరుణ రాజు, నాగులపల్లి సర్పంచ్ రాధిక అశోక్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మెన్ విఠల్ ముదిరాజ్, మాజీ ఎంపిటిసి కాట్న మాధవి రవీందర్, మాజీ సర్పంచ్ ఉమా ప్రవీణ్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, బిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రభు, అనిత అశోక్, శ్రీకాంత్, ఉషా మహేష్‌రెడ్డి, మమత కిరణ్ గౌడ్, ప్రభాకర్, యువ నాయకుడు శివాచారి, అన్వారీ రాజు, అన్వర్, అబ్బాస్, కాట్రె రాజులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

# రియల్ మోసాలకు 'రెరా' చెక్?

**రెరా నోటీసులతో రియల్ ఎస్టేట్ సంస్థల్లో వణుకు**

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** గడచిన దశాబ్దకాలంలో జరిగిన రియల్ ఎస్టేట్ మోసాలకు లెక్కే లేదు. పేరొందిన రియల్ ఎస్టేట్, నిర్మాణ సంస్థలు వినియోగదారుల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసి ప్లాట్లు, ఫ్లాట్లు, నిర్మాణాలను ఒప్పందం ప్రకారం నిర్ధారిత సమయానికి అందించకుండా ముప్పుతిప్పలు పెట్టిన విషయం విధితమే. ఇక ప్రీలాంచ్ పేరిట అమాయకుల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసి శఠగోపం పెట్టిన బడా రియల్ సంస్థల కారణంగా బాధితులు తీవ్ర మనోవేధనలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే రియల్ మోసాలకు చెక్‌పెట్టేలా స్వర్ణసీమ అమేయ ప్రాజెక్టు, గోద్రెజ్ ప్రాపర్టీస్, వర్టెక్స్ విరాట్, ప్రాజెక్టు, నవనామి ఎలివేట్ ప్రాజెక్టు,తిరుమల హిల్స్ తదితర రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) నోటీసులు జారీ చేయడంతో రియల్ ఎస్టేట్ రంగంలో కుదుపు మొదలయ్యింది.

రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు ప్రకటనల్లో రెరా రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరి నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలకు టీజీ రెరా షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో రియల్ ఎస్టేట్ రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇల్లు, ప్లాట్, యూనిట్ అమ్మకాలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ముందస్తు ప్రకటనలు ఇవ్వరాదంటూ సూచించింది. గతంలో వందల సంఖ్యలో రెరా నిబంధనలకు విరుద్ధంగా డీటీసీపీ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ సంస్థలు ప్రకటనలు ఇచ్చిన రూ.వేల కోట్లు మోసం చేసిన కేసుల్లో వేలాది మంది బాధితులు ఆందోళన చెందుతున్న విషయం విధితమే. ఇందులో భాగంగానే వినియోగదారులను మోసం చేయద్దని ప్రమోటర్లు, డెవలపర్లు, ఏజెంట్లు, ప్రచార మాధ్యమాలను తెలంగాణ రెరా అథారిటీ గట్టిగా హెచ్చరించింది. రెరా చట్టం ప్రకారం, 500 చదరపు మీటర్లు దాటితే, 8 కంటే ఎక్కువ యూనిట్లు కలిగి ఉన్న ప్రతి ప్రాజెక్టును ముందుగా తెలంగాణ రెరాలో రిజిస్టర్ చేయాలని, రెరా అథారిటీ ప్రాజెక్టు వివరాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్ నెంబరును మంజూరు చేసిన తర్వాతే.. ఆ నెంబరు ద్వారా అమ్మకాలపై ప్రకటనలు చేయాలని ప్రమోటర్లు, డెవలపర్లు, ఏజెంట్లు, ప్రచార మాధ్యమాలకు సూచించింది. ఇందులో భాగంగా ఇటీవల రిజిస్ట్రేషన్ నెంబరు పొందుపరచని చట్టవిరుద్ధమైన ప్రకటనలు రెరా దృష్టికి వచ్చాయి. దీంతో ఆయా ప్రాజెక్టు సంస్థలకు రెరా అథారిటీ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. కొన్ని కన్‌స్ట్రక్షన్ కంపెనీలు రెరా రిజిస్ట్రేషన్ నెంబరును పొందుపరిచినప్పటికీ, ఆ ప్రకటన రెరా నిబంధనల మేరకు లేనట్టుగా అథారిటీ గుర్తించింది. స్వర్ణసీమ కన్ స్ట్రక్షన్ చేపట్టిన అమేయ ప్రాజెక్టు ప్రకటనలో అక్షరాల సైజు, ప్రాజెక్టు పూర్తిపేరు, లేఅవుట్ గా రిజిస్టర్ చేసి, ప్రకటన మాత్రం పూర్తి రెసిడెన్షియల్ ప్రాజెక్టుగా చూపిస్తూ కొనుగోలుదారులను తప్పు దోవ పట్టించడం వంటి ఉల్లంఘనలను రెరా గమనించింది. ఈ క్రమంలోనే నిబంధనలు ఉల్లంఘిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఏదేమైనా రెరా నోటీసులతో రియల్ ఎస్టేట్ రంగం గాడిలో పడుతుందని బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీకి వలసలు

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే సొంత బాబాయ్ కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజాపక్షం/దుండిగల్ :** సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ కె.ఎం గౌరీష్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సమక్షంలో ఆయనకు పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. ఈ చేరికతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## జనసేనలో చేరిన జర్నలిస్టు సాంబశివరెడ్డి

**ప్రజాపక్షం/చర్లపల్లి :** దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో యువ నాయకుడు, జర్నలిస్టు బీరం సాంబశివరెడ్డి జనసేన పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తళ్లూరి ఆధ్వర్యంలో సాంబశివరెడ్డి తన అనుచరులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామ్ తళ్లూరి మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావడం ఆనందకరమని అన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు తనను ఎంతో ప్రభావితం చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పార్టీ ప్రచార కార్యదర్శి ఆర్‌కె.సాగర్, రాష్ట్ర ఎస్‌టి స్టూడెంట్స్ వింగ్ అధ్యక్షులు సంపత్‌నాయక్, కత్తి, నాయకులు సర్వేశ్వర్‌రావు, సాయి, రమేష్, వీరమహిమలు పద్మజ, అరుణ, లక్ష్మి , యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసిఐఎల్‌లో డిసిప్లేన్ అండ్ ఓవర్ అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి :** అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ఫేస్2లో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నిమ్మ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి ఇసిఐఎల్ చౌరస్తాలో ప్రజలకు లేన్ డిసిప్లేన్ అండ్ ఓవర్ గూర్చి 60 మందితో అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యం ద్వారా రోడ్డు ప్రమాదాలు, మరణాలు గణనీయంగా తగ్గించే లక్ష్యంతో 22వ తేదీ నుండి 28వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం షెడ్యూల్ చేయబడిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకేజీతో 15 రోజులుగా రోడ్డుపై నీటి ప్రవాహం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** గత పదిహేను రోజులుగా పైప్‌లైన్ లీకై రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై నీరు ప్రవహిస్తోందని దీంతో వాహనదారులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గత పదిహేను రోజులుగా నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారుల జారిపడి గాయాలపాలవుతున్నారు. లీకేజీతో రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు పాడైపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు,ప్రజలు కోరుతున్నారు.

## ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వినాయకనగర్ డివిజన్ రైల్వే ట్రాక్ పక్కనున్న ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజ స్థంభ పూజా కార్యక్రమంలో ఆదివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులతో పాటు కాంగ్రెస్ శ్రేణులు వెంకటేష్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, గుండా నిరంజన్, బికె శ్రీనివాస్, వినోద్ యాదవ్, సంపత్ గౌడ్, సయ్యద్ భాయ్, ఎస్ ఆర్ ప్రసాద్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, పిట్టల నాగరాజు, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

## అసోసియేషన్ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : బండి రమేష్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** స్థానిక అసోసియేషన్‌లు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్ డివిజన్ డి.సంజీవయ్య కాలనీ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్‌లో రమేష్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఆరెపుల సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శి మంత్రి వినోదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మ ణ్, ట్రెజరర్ అనిల్ కుమార్, లక్ష్మ య్య, థామస్ తదితరులు పాల్గొన్నారు.



## హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంబిపూర్ గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జెండాలు తోరణాలు సర్కిల్ అధికారులు తొలగించడం హిందువుల మనోభావాలు దెబ్బ తీయడమే అవుతుందని గ్రామస్తులు, నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం శాంబీపూర్ గ్రామంలో మాత్రమే ప్లక్సీలు, కాషాయ జెండాలు, తోరణాలు అధికారులు తొలగించడం రాజకీయ నాయకుల మెప్పుకోసం అధికారం పనిచేయడం ఏమిటని వారు ప్రశ్నించారు.

## నేటి తరం పిల్లలకు విలువతో కూడిన విద్య అవసరం

### ఎమ్మెల్యే బుయ్యని మనోర్‌రెడ్డి




**ప్రజాపక్షం/తాండూరు :** నేటి తరం పిల్లలకు సంస్కృతి సంప్రదాయాలను కాపాడే విద్య అవసరం ఉందని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు.ఆదివారం తాండూరు మండల పరిధి జిన్‌గూర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సందీపని గురుకుల ప్రారంభోత్సవ, పలు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజ్ శర్మ, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఫౌండేషన్ నిర్వహకులు బాగయ్యలతో కలసి ఎంఎల్ఎల్ బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ మాట్లాడుతూ మారుమూల ప్రాంతం అయిన జిన్ గూర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో తోడ్పాడుతుందనారు. విద్యను వ్యాపారం చేయకూడదనే ఉద్దేశంతో కొనసాగుతున్న ఏకలవ్య పౌండేషన్‌కు ఎల్లప్పుడు తమ వంతూ సహాకరం అందజేస్తామన్నారు. ఈ ఫౌండేషన్ అతి తక్కువ సమయంలోనే భారతదేశంలో ఉన్న అన్ని ప్రాంతల నుండి ప్రముఖులను ఫౌండేషన్ ఒకే వేదికపై తెచ్చిందన్నారు. యువతకు సాంకేంతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మన తాండూరులో ఎటిసి సెంటర్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా, సందీపని గురుకులం చైర్మన్ డాక్టర్ సి.మల్లారెడ్డి, పౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.వెంటేశ్వరరావు పలువురు ప్రముఖులు, గ్రామస్తులు పాల్గోన్నారు.



## పట్నంతో దగ్గుబాటి మాటామంతీ

**ప్రజాపక్షం/తాండూరు :** మాజీ మంత్రి శాసన మండపలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సీనియర్ నాయకులు మాజీ ఎంపి టిడిపి నేత దగ్గుబాటి వెంటేశ్వరావులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం తాండూరు మండల జిన్ గూర్తి గ్రామంలో గ్రామీణ వికాస్ ఫౌండేషన్ నిర్వహించిన ఓ కార్యక్రమానికి కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ శర్మలతో కలసి దగ్గుబాటి వెంకటేశ్వరావు, దగ్గుబాటి పురందేశ్వరి తో పాటు చీప్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డిలు పరస్పరం పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో కలుసుకున్న దగ్గుబాటి వెంకటేశ్వరావులు, పట్నం మహేందర్‌రెడ్డిలు పరస్పరం పలకరించుకున్నారు. పాత జ్ఞాపన కాలను నెమరు వేసుకున్నారు. బాగున్నారంటూ మహేందర్‌రెడ్డిని దగ్గుబాటి వెంకటేశ్వర రావు ఆప్యాయంగా పలకరించారు. కుశల ప్రశ్నలు వేశారు. దగ్గుబాటి పురందేశ్వరిని పట్నం మహేందర్‌రెడ్డి బాగున్నారంటూ పలకరించారు. గతంలో తాము టిడిపిలో పని చేసిన గుర్తులను గుర్తుచేసుకున్నారు. వారి మాట మచ్చటలను స్థానికులు ఆసక్తిగా చూశారు.

## నిరుపేదల కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



### -అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో సిఎం రేవంత్‌రెడ్డి నిరుపేదల కల నెరవేర్చుతున్నాడని ఇండ్లు లేని నిరుపేదలు ఉండకూడదని ప్రతి ఒక్కరికి ఇళ్లు కట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అలియబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమలం శిరీషా కృష్ణారెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు అన్నారు. ఆదివారం గ్రేటర్ హైద్రాబాద్ లోని ఉప్పర్‌పల్లి, అలియాబాద్ మున్సిపాలిటిలోని లాల్‌గడిమలక్‌పేటలో నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వార ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహ వసతి కల్పించడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని పేర్కోన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్దిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ అద్యక్షుడు తుంకి రమేష్, మండల ప్రదాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, కౌన్సిలర్‌లు ముద్దం సుధాకర్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, అలియాబాద్ మాజి సర్పంచ్ కమలం కృష్ణారెడ్డి, మాజి కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, మదుసూధన్‌రెడ్డి, నాయకులు నవీన్‌రెడ్డి, పాండు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు మేడ్చల్ జిల్లాలో సన్నద్ధం

* మొదటి, రెండవ సంవత్సరంలో 1,60,245 మంది విద్యార్థులు
* 182 పరీక్షా కేంద్రాలు, ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన అమలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మేడ్చల్ జిల్లాలో ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లతో సన్నిద్ధమైంది. ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు కలిపి 1,60,245 మంది పరీక్షలు రాయనున్నారు. 81,430 మంది మొదటి సంవత్సర విద్యార్థులు, 78,815 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో 182 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి మార్చి 17 వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు ఫిబ్రవరి 26 నుండి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మంచి నీరు. టాయిలెట్లు, ప్రథమ చికిత్సకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేసారు. అన్ని పరీక్షా కేంద్రాల సమీపాల్లో జిరాక్స్ దుకాణాలను మూసి వేయటంతో పాటు సమీప ప్రాంతాల్లో నలుగురి కంటె ఎక్కువ మంది ఒక చోట గుమికూడదన్న చట్టాన్ని అమలు చేస్తున్నారు. పరీక్షా సెంటర్లతో పాటు పరీక్షా పత్రాలు, జవాబు పత్రాలు తీసుకొని వెళ్లే మార్గంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించని నిబంధన అమలులో ఉన్నందున గంట ముందు సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను సకాలంలో తీసుకొని తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ముందస్తుగానే చూసుకొని సమయానికి చేరుకొనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా హాల్ టికెట్లపై పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు QR కోడ్‌ను ముద్రించారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు జిల్లా పరీక్షల విభాగ అధికారులు పర్యవేక్షిస్తారు. . పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, స్మార్ట్స్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను అనుమతించమని తెలిపారు. విద్యార్థులు సకాలంలో సెంటర్లకు చేరుకొనే విధంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించేలా ఏర్పాట్లు చేసారు. విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపాళ్ల నుండి హాల్ టికెట్లను తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు విద్యార్థుల హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరచటం, నేరుగా డౌన్‌లోడ్ చేసుకొనేందుకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ఇంటర్ బోర్డు అధికారులు లింక్‌ను పంపారని అధికారులు తెలిపారు. దీని ద్వారా తమ హాల్ టికెట్లను చూసుకొని దానిలో పేరు, ఫొటో, సంతకం లాంటి వివరాల్లో ఏవైనా తప్పులుంటే కంగారు పడకుండా తమ కళాశాల ప్రిన్సిపాళ్లకు తెలియచేయాలన్నారు.

## వాహనం ఢీకొట్టిన ఘటనలో విద్యార్థి మృతి

### ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ప్రియాంశ్ కుమార్ మీనా

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఎలాంటి పార్కింగ్ నిబంధనలు పాటించకుండా రోడ్డుపై పార్క్ చేసిన ట్రక్‌ను బైక్‌తో డికొట్టిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు కింపడి పోగా ఓ విద్యార్థి పైకి అశోక్‌లీలాండ్ వాహానం దూసుకెళ్లిన ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. శామీర్‌పేట డిఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట లోని పెద్దమ్మ కాలనీ ఫెజ్ 2లో మోటార్‌పై (kL07cl1490) నల్సార్ యూనివర్శిటికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రియాంశు కుమార్ మీనా, సాక్షమ్, గోపిచంద్‌లు ప్రయాణిసున్నారు. నల్సార్ వైపు వెళ్లే రోడ్డు మార్గంలో (Ts08ul7958) నంబరు గల ట్రక్ నిర్లక్ష్యంగా ఏలాంటి హెచ్చరికలు లేకుండా వాహానాన్ని పార్క్ చేశాడు. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు ఆ ట్రక్‌ను డికోట్టి కిందపడిపోయారు. వెంటనే అదే రోడ్డు మార్గంలో శామీర్‌పేట నుంచి నల్సార్ వైపు వస్తున్న అశోక్ లీలాండ్ (hr55ba9774) నంబర్ గల వాహానం అధిక వేగంతో, నిర్లక్ష్యంగా నడుపుకుంటు వచ్చి కిందపడిపోయిన సాక్షమ్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సాక్షమ్‌కు రక్తగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రియాంశు కుమార్ మీనాకు భుజానికి గాయాలు కాగ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్రక్ డ్రైవర్ వాహానాన్ని ఏలాంటి సంకేతాలు లేకుండా పార్క్ చేయడం, అశోక్ లీలాండ్ వాహానం అధిక వేగంతో రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని శామీర్‌పేట డిఐ రాజు తెలిపారు.

## చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** చెరువుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సంత్ నిరంకారి మిషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ అమృత్‌లో భాగంగా స్వచ్ఛమైన జలం స్వచ్ఛమైన మనస్సు అనే నినాదంతో పూజ్య సద్గురు మాతా సుదీక్షా జీ మహారాజ్ వారి దివ్య ఆదేశాల మేరకు చెరువుల సంరక్ష ణలో 4వ దశగా కార్యక్రమం కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ సందర్భంగా అంబీర్ చెరువు కట్టపై పేరుకుపోయిన చెత్తను స్వచ్ఛంద సేవకులు తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. జలవనరుల పరిరక్ష ణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమానికి హైదర్‌నగర్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు హాజరై, సేవా కార్యక్రమాన్ని ప్రారంభించి, సంత్ నిరంకరి చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణంపై అవగాహన పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, గోపాల్, షౌకత్‌అలీమున్నా, లింగం, సత్తయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్టలో రక్తదానం శిబిరం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట పరిధిలో మజ్జి మధుబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత, స్థానికులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి నాయకులు, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, జె.కె.శేఖర్ యాదవ్‌లు విచ్చేసి రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తం అందించి ప్రాణాలు నిలపడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రావుల పృథ్వీ, రుద్రా అశోక్, సురేష్‌రాజు యాదవ్, మంజునాథ్, శ్రీను, మాధవ్ తదితరలు పాల్గొన్నారు.







## వెంకటసాయినగర్ కాలనీ అధ్యక్షుడిగా పార్తివ్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సర్కిల్ పరిధిలోని చౌదరిగూడ వెంకటసాయి నగర్ కాలనీ ఫేస్1లో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఎన్నికల కమిటీ సభ్యులు మురళి, వెంకటేశ్వర్లు, జగదీశ్వర్, శంకర్, సుధాకర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకొన్నారు.అధ్యక్షులుగా పార్తివ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగాజి, ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా మాల్యా అజీమెర,కోశాధికారిగా చరణ్ కుమార్,సహ కార్యదర్శిగా విశ్వనాథ్,కార్యవర్గ సభ్యులుగా జనార్ధన్,రవీందర్ రెడ్డి, శంకర్,డబ్ల్యూ సుధాకర్, సాగర్, పవన్, మహేష్, సందీప్, శ్రీకాంత్, లింగస్వామి, జగదీశ్వర్,కనకయ్య,హరికృష్ణ, రాజరాం, సుభాష్, కుసుంబలను ఎన్నుకొన్నారు.

## అధిష్టానం ఆదేశిస్తే జడ్పిటిసిగా పోటీలో ఉంటా



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** బిఆర్ ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే తాను శంకర్ పల్లి మండల జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తానని మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తొండ యాదయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శంకర్ పల్లి మండల జడ్పిటిసి స్థానం ఎస్ సి లకు కేటాయిస్తారని చెప్పారు.పార్టీ నాయకులు ఆదేశిస్తే తప్పనిసరిగా జెడ్ పి టి సి అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు.

## నేటి నుండి ప్రజావాణి కార్యక్రమం

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** నేటి నుండి ప్రజావాణి కార్యక్రమం యధాతధంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23తేదీ నుండి కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్తానం 39వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/పరిగి :** శ్రీశ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం 39 వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు, పరిగి మున్సిపల్ పరిధిలోని పుర ప్రముఖులు ప్రతి ఒక్కరు పాల్గోని ఆలయ కమిటీ పిలుపు మేరకు 54 యజ్ఞగుండాలతో 27వ తేదీ న సుదర్శన యాగం , 28న తేదీన చండీ హోమం 1వ తేదీన ఉదయం 11.45శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి కళ్యాణ ం ఉంటుందని అలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరు పాల్గోని తీర్థ ప్రసాదాలు స్వీకరించడాలని కోరారు. ప్రతిరోజు భజనలు రాత్రి సంస్కృతి కార్యక్రమలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పూరోహితులు రేపల్లి రాజు శర్మ వారి బృందంచే నిర్వహించడం జరుగుతుందన్నారు.

## శేరిగూడ గ్రామ కురుమ యువజన సంఘం అధ్యక్షుడుగా మైలారం సత్యనారాయణ

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండలం శేరిగూడ గ్రామ కురుమ సంఘం యువజన అధ్యక్షులుగా ఆ గ్రామ మాజీ సర్పంచ్ మైలారం సత్యనారాయణ ఎన్నికయ్యారు.మండల కురుమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగినట్లు మండల కురుమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కురుమ సంఘం ఉపాధ్యక్షులు మోత్కుపల్లి అశోక్, కురుమ సంఘం సంయుక్త కార్యదర్శి చీర శ్రీనివాస్, శేరిగూడ గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు విట్టల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
23-02-2026
www.prajapaksham.in

ప్రతి ఏడాది ఫిలిం ఫేర్ సినిమా వాళ్లకు ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డులను ప్రకటించింది. పుష్ప -2 సినిమాకు గాను ఉత్తమ దర్శకుడిగా అవార్డు వరించింది. పుష్ప -2 సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో డెబ్బైవ ఫిలిం ఫేర్ సంస్థ ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

రీల్

# 'భోగి' యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం

'నారీ నారీ నడుమ మురారి'తో అలరించిన శర్వానంద్ ఇప్పుడు తొలి సారిగా యాక్షన్ స్పెషలిస్ట్ సంపత్ నందితో కలిసి 'భోగి' అనే భారీ పాన్ ఇండియన్ పీరియడ్ యాక్షన్ డ్రామా చేస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కెకె రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. టీమ్ ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తి చేసింది. అందులో శర్వానంద్ ఇతర నటీనటులతో కొన్ని టాకీ పోర్షన్స్ చిత్రీకరించారు. ప్రస్తుతం హైదరాబాద్లో కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ కీలక షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్ను నిర్మించారు. ఈ షెడ్యూల్లో రెండు భారీ యాక్షన్ ఎపిసోడ్లు ఉండగా, వాటికి ప్రముఖ స్టంట్ మాస్టర్ దినేష్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. స్ట్రైకింగ్ మోనోక్రోమ్లో చిత్రీకరించిన షూట్ ఫ్రేమ్లో శర్వా రోడ్డుపై నిలబడి, భుజంపై హ్యామర్ను పట్టుకుని కనిపిస్తున్నారు. అతని ముందువైపు దర్శకుడు సంపత్ నంది, స్టంట్ డైరెక్టర్ దినేష్ సుబ్బరాయన్ కనిపిస్తున్నారు. 1960 నేపథ్యంలో భోగి చిత్రం ఇంటెన్స్ ఎమోషన్స్, రా ఎనర్జీ, హై వోల్టేజ్ డ్రామాతో నిండిన కథగా రూపొందుతోంది. దర్శకుడు సంపత్ నంది పవర్ ఫుల్ కథను సిద్ధం చేశారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ఆధ్వర్యంలో పీరియడ్ డీటెయిలింగ్, రస్టిక్ ల్యాండ్స్కేప్స్, గ్రౌండెడ్ ఎస్తెటిక్ రూపొందించారు. భోగి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ఇండియా స్థాయిలో గ్రాండ్గా విడుదల కానుంది.



## 'మా ఇంటి బంగారం' మే15న రిలీజ్

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్పై సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దిగంత్, గుల్షన్ దేవయ్య ఇతర ప్రాతల్లో నటిస్తున్నారు. శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి, శ్రీనివాస్ గవి రెడ్డి, మంజుషా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ బేబి వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత మరోసారి సమంత, నందిని రెడ్డి కాంబోలో రానున్న ఈ సినిమాను రాజ్ నిడిమోరు రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మే15న వరల్డ్ వైడ్గా రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా ఇంటి బంగారం సినిమాను యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. యాక్షన్ డ్రామా మూవీ అందరికీ నచ్చేలా, అన్ని అంశాలతో రూపొందుతోంది. చిత్ర యూనిట్ లేటెస్ట్గా సమంత ఉన్న కొత్త పోస్టర్ను కూడా విడుదల చేసింది. ఇది సినిమాకి ప్రత్యేకమైన విజువల్ లుక్ను తీసుకొచ్చింది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాష్, స్టోరీ, స్క్రీన్ప్లే: రాజ్ నిడిమోరు, వసంత్ మారింగంటి, సీతామీ నన్, ఉన్నా రు.



## రిషబ్ శెట్టి హీరోగా 'జై హనుమాన్' షురూ

పాన్ఇండియన్ బ్లాక్బస్టర్ 'హనుమాన్'ను అందించిన జాతీయ అవార్డు గ్రహీత, చిత్రనిర్మాత ప్రశాంత్ వర్మ ఇప్పుడు సీక్వెల్ 'జై హనుమాన్' కోసం సిద్ధమవుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది, టిసిరీస్ దీనిని సమర్పిస్తుంది. జాతీయ అవార్డు గ్రహీత రిషబ్ శెట్టి ప్రధాన హీరోగా నటిస్తున్నాడు. ఆదివారం విజయనగరంలోని హంపిలోని అంజనాద్రి బెట్టలో సాంప్రదాయ వేడుకలో అధికారికంగా ప్రాంభమైంది. ఇది హనుమంతుడి జన్మస్థలం అని నమ్మే పవిత్ర ప్రదేశం. హనుమాన్ స్టార్ తేజ సజ్జా దర్శకత్వం వహించిన ప్రారంభ సన్నివేశానికి టిసిరీస్ అధినేత భూషణ్ కుమార్ క్లాప్బోర్డ్ కొట్టారు. అనిల్ తడానీ కెమెరాను స్విచ్చాన్ చేశారు. అనిల్ తడానీ, భూషణ్ కుమార్, నవీన్ యెర్నేని , రవిశంకర్ లు స్క్రిప్టును దర్శకుడు ప్రశాంత్ వర్మకు అందజేశారు. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నందున ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది.ముందుగా హనుమంతుడిగా రిషబ్ శెట్టిని అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఆవిష్కరించారు, ఇందులో పాత్ర ఆత్మ, దైవత్వాన్ని సంగ్రహించారు. ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని వై రవిశంకర్ నిర్మించారు, దీనిని అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు. . ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూరుస్తున్నారు. ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రాఫర్గా, శ్రీనాగేంద్ర తంగల నిర్మాణ రూపకల్పనను పర్యవేక్షిస్తున్నారు.




## 'కల్ట్' చాలా కసితో తీసిన సినిమా

హీరో విశ్వక్సేన్



మాస్ కా దాస్ విశ్వక్సేన్ మరోసారి బౌండరీస్ ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ తో వస్తున్నారు. ఫలక్నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో కల్ట్ తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథ గోవాకు ఎంజాయ్ చేయడానికి వెళ్లిన ఓ ఫ్రెండ్స్ గ్రూప్ చుట్టూ తిరుగుతుంది. స్ట్రెస్ అనే కారణంతో పార్టీకి అనుమతి నిరాకరిస్తారు. అదే సమయంలో వారిలో ఒకరు ప్రత్యేకమైన కల్ట్ పాస్ సంపాదించడంతో ఓ ఎక్స్క్లూజివ్ పార్టీకి వెళ్లే అవకాశం వస్తుంది. మొదట కలలా అనిపించిన ఆ అనుభవం, పార్టీ హోస్ట్ ప్రారంభించే ప్రాణాంతక ఆటతో ఒక్కసారిగా భయంకరమైన నైట్మేర్ గా మారుతుంది. ఒక్కొక్కరిని హతమారుస్తూ ముందుకు సాగే ఈ కథలో, గేమ్ మాస్టర్ కథను మరింత మలుపు తిప్పుతాడు. అసలు రక్షకుడా? లేక మరింత ప్రమాదకరమైన వ్యక్తా? అనేది ఆసక్తికరం. ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, కార్తికేయ, అనిరుధ్ భాస్కర్, యజ్ఞ శర్ణపోతి, కబీర్ భారతీయ, విశాక్ నాయర్, చేపూరి వివేక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డైలాగ్స్ను తరుణ్ భాస్కర్ రాస్తుండగా, మ్యూజిక్ కంపోజర్ రవి బస్రూర్ మ్యూజిక్ అందించారు. సినిమాటోగ్రాఫర్ అర్విండ్ విశ్వనాథన్, ఎడిటర్ రవి తేజ గిరిజాల పని చేస్తున్నారు.

## 'సరస్వతి' ట్రైలర్ ఎక్స్ ట్రార్డినరీ

వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్ లో విడుదల కానుంది. డైరెక్టర్ గోపీచంద్ మలినేని సినిమా ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మలినేని మాట్లాడుతూ వరలక్ష్మి చాలా ఎమోషనల్ పర్సన్. నేను క్రాక్ చేసినప్పుడు జయమ్మ క్యారెక్టర్ ఎలా ఉంటుందో నాకు మైండ్లో ఉంది. ఆ క్యారెక్టర్ ని వరలక్ష్మి చేసిన తర్వాత అందరూ షాక్ అయిపోయారు. నిర్మాత బన్నీ బాస్ మాట్లాడుతూ వరలక్ష్మి ఈ సినిమాకి తను దర్శకత్వం చేసి, నటిస్తున్నాను, అలాగే నిర్మిస్తున్నానని చెప్పినప్పుడు కచ్చితంగా ఒక మంచి కంటెంట్ అయి ఉంటుందని అనుకున్నాను. డైరెక్టర్, హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ ఫిమేల్ కంటెంట్ అని మరీ సందేశాత్మకంగా ఉండదు. చాలా థ్రిల్లింగ్ గా ఉంటుంది. బన్నీ వాసు సినిమాని చూసి చాలా అభినందించారు.




## 'హే బల్వంత్'లో హిలేరియస్ ఎంటర్టైన్మెంట్

'హే బలవంత్' సినిమా 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్టైన్మెంట్ ప్రేక్షకుల అభినందనలతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బ్లాక్బ్లస్టర్ టాక్తో దూసుకపోతుంది. చిత్రంలో ఓ కీలకపాత్రలో నటించి తన నటనతో థియేటర్లో ఎంటర్టైన్మెంట్ను అందిస్తున్న కమెడియన్ సుదర్శన్ ఆదివారం విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. 'హే

**బల్వంత్లో సుదర్శన్ 2.0 అంటున్నారు?:**
సినిమాలో అంత మంచి క్యారెక్టర్ చేశాను. సినిమాకు చాలా క్రేజీ రెస్పాన్స్ వస్తోంది. నేను పోషించిన బంక పాత్రను ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. హిలేరియస్గా నవ్వుకుంటున్నారు. ఈ సినిమా ఆద్యంతం ఎంటర్టైనర్గా ఉందని మంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ సినిమాలో పోషించిన పాత్రకు మంచి పేరొచ్చింది.

అమెరికాకు దారేది అనే షార్ట్ ఫిల్మ్లో నటించాను. దానికి అనుకోకుండా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ షార్ట్ఫిల్మ్తో రన్రాజా రన్ ఆఫర్ వచ్చింది. ఆ తరువాత దోచెయ్, కుమారి 21ఎఫ్, పటాస్, సమాజవరగమన, నారీ నారీ నారి నడుమ మురారి, ఇప్పుడు హే బల్వంత్ సినిమాలు నన్ను ప్రేక్షకులకు చేరువ చేశాయి. ఈ సినిమాలో నటించిన అందరితో నాకు అందరితో మంచి ర్యాపో ఉంది. ప్రతి సీన్కు అందరం మంచి సింక్లో ఉన్నాం. అందరూ క్లోజ్నెస్తో ఫ్లోతో సీన్లు బాగా వచ్చాయి. నేను హీరోగా వెండితెరపై ఇప్పుడే చేయను. అనుకోకుండా సినీ పరిశ్రమకు వచ్చాం. కమెడియన్గా ఇప్పుడిప్పుడు ఎదుగుతున్నాను. ఈ టైమ్లో రిస్క్ తీసుకోలేను. కమెడియన్గా నాకు అందరి హీరోలతో కలిసి సినిమాలు చేయాలని వుంది. నటుడిగా సెటిల్ అయిపోయిన తరువాత హీరోగా ఆలోచిద్దాం. ఒక వేళ హీరోగా చేస్తే చిన్న చిన్న కాన్సెప్ట్తో చేసే ఓటీటీ సినిమాలు చేస్తాను.



# తీరేదెన్నడో...?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాప్తంగా 22 మాసాల కాలంలో సుమారు 15వేల మందికి పైగా ఉద్యోగ విరమణ చేశారు. ఇందులో అతి కొద్ది మంది పింఛన్ బకాయిల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించింది. ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే మొత్తంలో పిల్లల భవిష్యత్తు, స్థిర నివాసాలు, పెళ్లిళ్లు ఇతరత్రా కార్యక్రమాలను నెరవేర్చుకునేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పింఛన్దారులను చుట్టుముట్టాయి. ఆర్థికంగా వెసులుబాటు లేక పిల్లలను స్థిరపర్చలేక మనో వ్యధకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఖమ్మంజిల్లాలో వి. నారాయణరావుకు బకాయిలతో పాటు నెలవారి పింఛన్ కూడా రాక పోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల మాజీ ఎస్ఐ మైసయ్య మృతి అందరిని కలిచివేసింది. ఆర్థిక ఇబ్బందులకు గురై సరైన వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోయారు. ఆయన సతీమణి సైతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా పింఛన్దారులకు అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో నగదు రహిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు అమలు చేయలేదు. డిఎ చెల్లింపుల్లో కూడా పింఛన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలవారీగా బిల్లు చేయాలని ఆదేశాలు జారీ కావడం పింఛన్దారులను తీవ్ర ఇబ్బందులు పెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఆర్సిపైన పింఛన్దారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సరైన రీతిలో వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా పింఛన్ దారుల బకాయిల చెల్లింపుకు సరిపడ నిధులు కేటాయించాలని పింఛన్దారులు డిమాండ్ చేస్తున్నారు.

**నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు :**
రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పింఛన్దారుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గల ధర్నాచౌక్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్లు తెలిపారు. పింఛన్ బకాయిలను తక్షణమే చెల్లించాలని నగదు రహిత వైద్య సేవలను అందించాలని, డిఏ, పిఆర్సి తదితర సమస్యలను పరిష్కరించాలని ఈనెల 23 నుంచి 26 వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళనలో భాగంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని పుల్లయ్య, రవికుమార్లు తెలిపారు.



# తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని ముందుకుతీసుకెళ్లాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల శిక్షణ తరగతులలో కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎఐసిసి ఆధ్వర్యంలో అనంతగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల (డిసిసి) శిక్షణా తరగతులలో 'తెలంగాణ ఉద్యమం, నేపథ్యం, ఆశయాలు, అమరలు త్యాగాలు, లక్ష్యాలు తదితర అంశాలపైన టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం కోదండరామ్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి దారి తీసిన పోరాట గాథను స్మరించుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా శిక్షణ తరగతులలో తెలంగాణ ఉద్యమ నేపథ్యం, లక్ష్యాలు తదితర అంశాలపై జిల్లా అధ్యక్షులకు వివరించాలని కోదండరామ్ను ఎఐసిసి కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు.

# గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో.. శంషాబాద్ విమానాశ్రయంలో 'ఉడాన్ యాత్రి కేఫే' ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్: 'తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) ఇటీవల శంషాబాద్ విమానాశ్రయంలో ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్పై ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించి నివేదికను విడుదల చేసింది. ఈ సర్వేలో మొత్తం 2,800 మంది ప్రయాణికులు పాల్గొన్నారు. సర్వే ఫలితాల ప్రకారం కేవలం 26 శాతం (720 మంది) మాత్రమే ఈ సదుపాయం గురించి తెలుసునని చెప్పగా, 74 శాతం (2,080 మంది) ప్రయాణికులకు ఈ కేఫే గురించి తెలియదని చెప్పారని వెల్లడైంది. ఈ ఫలితాలు ప్రయాణికులకు సమాచారం అందించడంలో యాప్ ఆధారిత డ్రైవర్లు, ట్రాన్స్పోర్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తున్నాయి. అయితే అధికారిక ప్రకటనలు, సైన్బోర్డులు, అవగాహన కార్యక్రమాలు తక్కువగా ఉన్నాయని స్పష్టం అవుతోంది. ప్రస్తుతం ఈ కేఫే చెక్ఇన్ హాల్ దగ్గర ఉండగా, ఎక్కువ మంది ప్రయాణికులు బోర్డింగ్ గేట్ల దగ్గర ఎక్కువ సమయం గడుపుతున్నారని తెలిపారు. చాలామంది ప్రయాణికులు, ఎయిర్పోర్ట్ సిబ్బందికి కూడా ఈ సదుపాయం గురించి తెలియడం లేదు. ప్రకటనలు, డిజిటల్ డిస్ప్లేలతో పాటు అవగాహన కార్యక్రమాలు పెంచాలని ప్రయాణికులు సూచించినట్లు వెల్లడించారు. ఉడాన్ యాత్రి కేఫేపై అవగాహన, అందుబాటు విజిబిలిటీ పెంచితే మరింత మంది ప్రయాణికులు ఈ తక్కువ ధరల సేవలను ఉపయోగించగలరు. ఇది హైదరాబాద్ ఎయిర్పోర్ట్ ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరుస్తుంది' అని టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ తెలిపారు.

# స్థిరత్వం, చిత్తశుద్ధితోనే న్యాయవృత్తిలో ఉన్నత ప్రగతి

స్నాతకోత్సవంలో గ్రాడ్యుయేట్లకు సిజెఐ హితవు



రాయ్పూర్: సహనం, సహభాగస్వామ్యం, వృత్తిపరమైన చిత్తశుద్ధితో జీవన గమన మార్గాన్ని నిర్మించుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ న్యాయవిద్యాభ్యాసం చేసే విద్యార్థులకు హితబోధ చేశారు. తరగతిలో ఉంటే తోటి విద్యార్థులను భవిష్యత్ వృత్తి భాగస్వాములుగా, న్యాయస్థానంలో తమ ప్రతివాదులుగా, న్యాయవ్యవస్థలో సహనంతో మెలగే తమ తోటి సభ్యులుగా భావించాలని, ఆ మూలాల ప్రాతిపదికపైనే ప్రతి న్యాయ విద్యార్థి తమ భవిష్యత్ జీవన గమన మార్గాన్ని తీర్చిదిద్దుకోవాలని ఉద్బోధించారు. చాలా తక్కువ సమయంలోనే వృత్తిపరమైన గొప్ప ప్రగతిని లా గ్రాడ్యుయేట్లు ఆశించవద్దని స్పష్టం చేశారు. వృత్తిపరమైన భవితను ఒక భవన నిర్మాణంలా భావించాలన్నారు. ఛత్తీస్గఢ్ రాజధాని రాయ్పూర్లోని హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ తొమ్మిదవ స్నాతకోత్సవసభలో జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, విద్య పూర్తిచేసుకున్న గ్రాడ్యుయేట్లు తోటి సహభాగస్వాములతో తమ శక్తిసామర్థాలపై ఆధారపడి ఒక అర్థవంతమైన భవిష్యత్ జీవితాన్ని నిర్మించుకోవడానికి దీర్ఘకాలికస్థాయిలో వృత్తిపరంగా అభివృద్ధి సాధించేందుకు అనిశ్చితి,బాధ్యతలమధ్య వృత్తిపరమైన ప్రయాణం ప్రారంభించారన్నారు. గ్రాడ్యుయేట్లు, యూనివర్సిటీ బోధకులు, కుటుంబసభ్యుల సమక్షంలో ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో వృత్తిపరమైన సంబంధాలను ప్రధానంగా చెప్పారు. న్యాయ విద్య పరీక్షలు, ర్యాకింగ్, మంచి ప్లేస్మెంట్ల ద్వారా తరచు పోటీని ఉద్ఘాటిస్తుందని, న్యాయవృత్తి మాత్రం తనకుతానుగా సహకారం, సభభాగస్వామ్యంపై ఆధారపడి నిలదొక్కుకుంటుందని అన్నారు. న్యాయవ్యవస్థను పలు ఉపనదుల కలయికతో ఏర్పడిన పెద్ద నదితో పోల్చి చెబుతూ, జూనియర్లు, సీనియర్లు, తోటి ఉద్యోగులు,చివరకు ఎదురు నిలబడి వాదించే న్యాయవాదులతో కలిపి చేసే ఒక ఉమ్మడి కృషివల్ల న్యాయపాలన జరుగుతుందన్నారు. తమ తోటి న్యాయ విద్యార్థులు, గ్రాడ్యుయేట్లను తమతో సమానమైన సమతుల్యులుగా భావించి గౌరవించాలని, మన్నన, స్వచ్ఛత,అరమరికలులేని బాహాటత్వంతో ఉండాలని, ఉమ్మడి కృషి ద్వారా న్యాయవ్యవస్థ, న్యాయపాలన జరుగుతుందని విశ్వసించాలన్నారు. తమతో కలసి చదువుకున్న విద్యార్థులను భవిష్యత్ సహభాగస్వాములుగా చూడాలనని, ప్రతివాదులుగా, శక్తిసామర్థ్యాలుగల న్యాయవ్యవస్థ సభ్యులుగా గుర్తించాలని కోరారు. ఈ విధమైన చర్యలవల్ల మన ఔదార్యం, దయాదృష్టి మన వ్యక్తిగత వృత్తి భవితను పటిష్టవంతం చేయడమే కాకుండా న్యాయవృత్తిలో మన శక్తిసామర్థ్యాలను కూడా పెంపొందిస్తాయని చెప్పారు. న్యాయవృత్తి దీర్ఘకాలంపాటు ఆడే ఆటగా పేర్కొన్నారు. వృత్తిని ప్రారంభించినప్పుడు తొలి సంవత్సరాలలో కొంత అనిశ్చితి, ఊగిసలాట వెంటాడతాయని, ప్రత్యేకించి ఈ వృత్తిలో ఇతరులతో పోల్చి చూసుకున్నప్పుడు ఈ పరిస్థితి ఎదురవుతుందని, ఐనప్పటికీ మౌలికంగా మనం అవగాహనతో విద్యాభ్యాసంచేసి పునాదులు పటిష్టం చేసుకున్నప్పుడు న్యాయవ్యవస్థను సక్రమంగా అర్థం చేసుకుని ముందుకు వెళ్ళి వృత్తిని అభివృద్ధి చేసుకుంటామని, న్యాయపరంగా స్థిరంగా మనం నిలదొక్కుకోవాలంటే దీర్ఘకాలిక విజయం సాధించాలంటే మనదగ్గరకు వచ్చే బాధితులపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వృత్తిపరమైన అభివృద్ధి సాధనకు స్థిరత్వం, చురుకుదనం, చిత్తశుద్ధి ఉండాలని తద్వారా అంతిమంగా గౌరవం సంపాదించుకుంటామన్నారు. ఒక భవన నిర్మాణంలో పునాదులు గట్టిగా ఉంటే భవిష్యత్ విజయాలు కూడా బలంగా ఉంటాయన్నారు. వృత్తిపరమైన సహోద్యోగులమధ్య పరస్పర అనుబంధం, సహకారం ఉండాలన్నారు. బాధ్యత, వృత్తిపరమైన చిత్తశుద్ధి, కార్యసిద్ధిని ప్రదర్శిస్తూ జీవితాన్ని సమతుల్యంగా కొనసాగించాలని హితవు చరెప్పారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఛత్తీస్గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిను కూడా కలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆయనకు పుష్పగుచ్ఛం, సంప్రదాయబద్ధమైన పై పంచెను ఇచ్చి సత్కరించారు.

# నాలుగేళ్లుగా యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

స్లోవేకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో హెచ్చరించారు. అదేవిధంగా హంగరీ దేశ ప్రధానమంత్రి విక్టర్ ఓర్బాన్ కూడా జెలెన్స్కీకి ఒక హెచ్చరిక చేశారు. ఉక్రేన్మీదుగా రష్యా నుండి హంగరీకి వచ్చే చమురు సరఫరా పైపులైన్ ద్వారా చమురు ప్రవాహాన్ని పునరుద్ధరించకపోతే యూరోపియన్ యూనియన్ ఇచ్చే 90 బిలియన్ యూరోల రుణాన్ని వీటో చేస్తామని హెచ్చరించారు. దీంతో జెలెన్స్కీ కూడా ఈ రెండు దేశాలపై ఎదురుదాడి చేశారు. హంగరీ, స్లోవేకియా దేశాలు రష్యా అండతో తమను బ్లాక్మెయిల్ చేస్తున్నాయని విమర్శించారు. ఈ శీతాకాలంలో విద్యుత్ వనరులపై దాడులు చేయడం ద్వారా రష్యా తమ ప్రజలను చలికి బలి చేస్తోందని, చలికాలాన్ని ఒక అస్త్రంగా ఉపయోగించుకుని దుర్వినియోగానికి పాల్పడుతోందని జెలెన్స్కీ విమర్శించారు. ఎన్ని చేసినా రష్యా తమను ఓడించలేదని ఆయన అన్నారు. ఐతే ఈ శీతాకాలం ఉక్రేన్ ప్రజలకు అతిపెద్ద సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

2014లో కూడా ఫిబ్రవరి 24న క్రిమియాను రష్యా ఆక్రమించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉక్రేన్లో యుద్ధ పరిష్కారానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలికాలంలో ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యవర్తుల ద్వారా సంప్రదింపుల ప్రక్రియ, మరోవైపు పరస్పర యుద్ధ దాడులు కూడా తీవ్రరూపం దాల్చాయి. జెనీవాలో ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య తాజా విడత చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగిశాయి. జనవరి నెలాఖరునాటికి లెక్కవేస్తే 1,418 రోజులుగా జరిగిన యుద్ధంలో 1,40,000 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని, 6,00,000 మంది ఉక్రేన్ సైనికులు గాయపడ్డారని సిఎస్ఐఎస్ అంచనావేసింది. రష్యావైపు 3.25 లక్షలమంది సైనికులు మరణించగా, 10.20 లక్షల మంది గాయపడ్డారని, అంచనావేసింది. రష్యా కూడా ఎనిమిది దశాబ్దాలక్రితం రెండో ప్రపంచయుద్ధంలో నాలుగేళ్ళు పోరాడి నాజీ జర్మనీ సేనలను వెనక్కు తరిమికొట్టింది. అదేవిధంగా రష్యా కూడా ఈ నాలుగేళ్ళ యుద్ధంలో ఉక్రేన్ రాజధాని కీవ్ను స్వాధీనం చేసుకోలేకపోయింది. రెండో ప్రపంయుద్ధం తర్వాత యూరప్లో మళ్ళీ రష్యా–ఉక్రేన్ మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో ఇరువైపులా ఇప్పటివరకూ దాదాపు 20 లక్షల మంది సైనికులు మరణించడం,గాయపడటం, జాడ తెలియకుండాపోవడం జరిగింది. 2014 నుండి ఇప్పటివరకూ క్రిమియా సహా 20 శాతం ఉక్రేన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. ఐతే 2022 ఫిబ్రవరి 24వ తేదీ తర్వాత రెండు దేశాలమధ్యా యుద్ధం ఉద్ధృతి తగ్గింది. మందగమనంలో సాగుతోందని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే వ్యాఖ్యానించారు. గడచిన రెండు సంవత్సరాలలో రష్యా దళాలు తూర్పు ఉక్రేన్లోని డోనెట్స్క్ ప్రాంతంలోకి 50 కి.మీ లోపలకు దూసుకువచ్చాయి. బలమైన కేంద్రాలను రక్షించుకోవడానికి ఉక్రేన్ తీవ్ర పోరాటం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో జెలెన్స్కీ చర్చలు విజయవంతం కావాలని కోరుకుంటున్నారు. మరోవైపు యూరప్దేశాల నుండి ఆయుధాలు సమకూర్చుకుంటున్నారు. ఉక్రేన్కు నాటో సభ్యత్వం ఇవ్వకూడదని, యుద్ధం తర్వాత ఉక్రేన్లో నాటో దళాల ఉనికి ఉండకూడదని రష్యా కోరుతున్నది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com